
ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికార వైసీపీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ఇప్పటికే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆ పార్టీని వీడి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఆయన అనుచరులు టీడీపీలోకి క్యూ కట్టారు. ఇంకోవైపు దాదాపు అన్ని నియోజకవర్గాల్లో కీలకమైన నాయకులు టీడీపీలోకి చేరిపోతున్నారు. ఇదే సమయంలో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆ పార్టీకి షాక్ ఇచ్చేందుకు సిద్ధంకాగా, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వైసీపీకి రాజీనామా చేశారు. వీరిలో మద్దిశెట్టి టీడీపీవైపు దృష్టిసారించగా, ఆమంచి కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. వీరిద్దరూ కాపు సామాజికవర్గానికి చెందిన వారు కావటం, ఆయా నియోజకవర్గాల్లో బలమైన అనుచర గణం కలిగి ఉండటంతో వైసీపీకి పెద్ద దెబ్బ తగలనుంది.



టీడీపీలోకి మద్దిశెట్టి వర్గం

టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి లక్ష్మిని ప్రకటించిన తర్వాత మద్దిశెట్టి ఎలాంటి వైఖరి తీసుకుంటారా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఈ దశలో మద్దిశెట్టి సోదరుడు శ్రీధర్ మూడు రోజుల క్రితం నియోజకవర్గంలోని అనుచరులతో చర్చలు జరిపారు. వైసీపీ అభ్యర్థికి సహకరించవద్దని అందరూ సూచించారు. ఆయన కూడా అనుచరుల డిమాండ్‌కు అంగీకరించినట్లు తెలిసింది. ఆ తర్వాత శ్రీధర్‌తో మాగుంట రాఘవరెడ్డి చర్చలు జరిపారు. అదేసమయంలో దొనకొండ మండలంలో వైసీపీలో బలమైన నాయకులుగా ఉన్న కందుల నారపురెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు మాగుంట సమక్షంలో టీడీపీలో చేరారు. దర్శిలో కౌన్సిలర్ భర్త, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సుబ్బయ్య, అలాగే మద్దిశెట్టి అనుచరుల్లోని కొందరు ముఖ్య నాయకులు ప్రధానంగా కాపు సామాజికవర్గానికి చెందిన వారు టీడీపీ అభ్యర్థి లక్ష్మీ, ఆమె కుటుంబసభ్యులకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. బూచేపల్లికి మద్దతు తెలిపిన ఒక నాయకుడితో కూడా లక్ష్మీ భర్త సమాలోచన జరిపినట్లు సమాచారం. మరో మండలంలో ఎంపీపీగా ఉన్న బీసీ నాయకుడు కూడా టీడీపీ వైపు దృష్టిసారించారు. ముండ్లమూరు మండల వైసీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి టీడీపీ నేతలకు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. కురిచేడు మండలంలో బూచేపల్లి వైపు వెళ్లిన ఒకరిద్దరు మద్దిశెట్టి అనుచరులు తిరిగి వెనక్కి వచ్చేశారు. తాళ్లూరు మండలంలో కొందరు పరోక్ష మద్దతుకు, కొందరు టీడీపీలో చేరేందుకు సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి సహకరించలేమనే నిర్ణయంతో ఉన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి కూడా పార్టీ మారే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం ఉంది. ఆయన ఇచ్చిన సంకేతాలతోనే ఎమ్మెల్యే వర్గీయులు ఇటు మాగుంట, అటు లక్ష్మిలకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. నేడో రేపో చాలామంది టీడీపీ కూటమి గూటికి చేరేందుకు రంగం సిద్ధమైంది.

- టీడీపీ వైపు మద్దిశెట్టి
- ఇప్పటికే పార్టీ మారిన అనుచరులు
- రాఘవరెడ్డితో శ్రీధర్ భేటీ
- త్వరలో కీలక నిర్ణయం
- కాంగ్రెస్ వైపు ఆమంచి చూపు
- పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన



వైసీపీకి షాక్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీకి వరుస షాకులు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన కీలక నాయకులు, ఎమ్మెల్యేలు దూరమవుతున్నారు. ఇప్పటికే ఎంపీ మాగుంట పార్టీ మారి లోక్‌సభ బరిలో నిలవగా, తాజాగా మరో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కూడా బైబై చెప్పబోతున్నారు. ఎన్నికల సమరం ఆరంభమై బస్సుయాత్రతో సీఎం జగన్ రానున్న నేపథ్యంలో అసంతృప్తి నాయకులు ఎవరి దారి వారు చూసుకోవటం ప్రారంభించటం విశేషం. ఇప్పటికే కిందిస్థాయిలో నాయకులు టీడీపీ కూటమిలో చేరిపోతుండగా పైస్థాయిలో మాగుంట కుటుంబం ఇప్పటికే టీడీపీలోకి చేరిపోయింది. తాజాగా మద్దిశెట్టి, ఆమంచిలు కూడా వైసీపీకి దూరం అవుతుండటం రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఇప్పటికీ వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆ పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో ఆయన సోదరుడు శ్రీధర్ తెలుగుదేశం పార్టీ నేతలతో మంతనాలు ప్రారంభించారు. కిందిస్థాయిలో ఆయన వర్గం వారు కొందరు ఇప్పటికే టీడీపీ బాట పట్టగా మరికొందరు టీడీపీ, జనసేనల వైపు దృష్టిసారించారు. అందిన సమాచారం మేరకు మద్దిశెట్టి కూడా నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి సహకరించకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. వైసీపీ అభ్యర్థిగా బూచేపల్లిని ప్రకటించే సమయంలో కనీసం మద్దిశెట్టితో చర్చలు జరపకపోవటం, ఆ తర్వాత ఆయన ఆ పార్టీలోనే ఒంగోలు ఎంపీ టికెట్ ఆశించారు. అక్కడ అవకాశం ఇవ్వకపోగా ఇతరత్రా అవకాశాలు కూడా ఇచ్చే ఆలోచనను వైసీపీ అధిష్ఠానం చేయలేదు. అభ్యర్థి అయిన బూచేపల్లి నుంచి కనీసం ఆయన్ను కలవటం కానీ కలిసే ప్రయత్నం కానీ చేయలేదు. ఎమ్మెల్యే మద్దిశెట్టిని పక్కనపెట్టి నియోజకవర్గంలోని ఆయన అనుచరుల్లో కొందరితో మంతనాలు ప్రారంభించారు. దర్శి నగరపంచాయితీలో అలాగే ముండ్లమూరు మండలంలో ఒకరిద్దరు మద్దిశెట్టి అనుచరులను తనవైపు తిప్పుకోగలిగారు. దీంతో మద్దిశెట్టితో పాటు ఆయన అనుచరులు కూడా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. మద్దిశెట్టికి కుటుంబీకులు, నియోజకవర్గంలోని అనుచరుల నుంచి ఒత్తిడి పెరిగింది. వైసీపీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ దశలో మద్దిశెట్టికి టీడీపీ, జనసేన నాయకులు కూడా కొందరు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది.



కాంగ్రెస్ గూటికి ఆమంచి!

ఇంకోవైపు చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం సాయంత్రం వైసీపీకి రాజీనామా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయిన ఆమంచికి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. అక్కడ నుంచి తప్పించిన తర్వాత ఆయన చీరాల టికెట్ కోసం పట్టుబట్టారు. తనకు కాకపోయినా ప్రస్తుత అభ్యర్థి కరణం వెంకటేష్‌కు ఇవ్వొద్దని బీసీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు వైసీపీ అధిష్ఠానం అంగీకరించకపోగా క్రమేపి ఆమంచిని దూరం పెట్టడం ప్రారంభించింది. దీంతో చీరాలలో తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పోటీలోకి రావాలని ఆమంచి భావించారు. ఇండిపెండెంట్‌గా రంగంలోకి రావచ్చనే ప్రచారం జరిగింది. తాజాగా కాంగ్రెస్ నుంచి ఆయనకు సంకేతం వచ్చినట్లు తెలిసింది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో మాట్లాడినట్లు కూడా సమాచారం. ఆ మేరకు శుక్రవారం ఆమెను కలవబోతున్నట్లు కూడా ఆయా వర్గాల్లో సమాచారం ఉంది. అయితే అనుచరులతో మాట్లాడి ఉగాది రోజుకు తుది నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించుకున్నట్లు తెలిసింది. చీరాలతోపాటు పర్చూరు నియోజకవర్గాల్లోని అనుచరులతో కూడా ఆయన మంతనాలు జరిపి వైసీపీకి వ్యతిరేకంగా పనిచేయాలని పిలుపునిచ్చినట్లు తెలిసింది.

కదులుతున్న యువత

ఓటుహక్కు కోసం 8,400 దరఖాస్తులు

ఇంకా పెండింగ్‌లో 5,630.. ఈనెల 15 వరకు అవకాశం



ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4 : జిల్లాలో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు యువతీ, యువకులు ముందుకు వస్తున్నారు. జనవరి 20వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా నమోదుకు అవకాశం ఈసీ ఇచ్చింది. ఈ రెండు నెలల కాలంలో జిల్లాలో కొత్త ఓట్ల కోసం 8,400 దరఖాస్తులు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసిన ఎన్నికల కమిషన్ ఆ తర్వాత కూడా ఓటుహక్కు లేని ప్రతి ఒక్కరు ఓటుహక్కు కోసం ఫాం-6ను పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని యువతీ, యువకులు అధికంగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఫాం-6లు 8400 వరకు రాగా అందులో 90శాతం దరఖాస్తులు 18 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న యువతీ, యువకులవే కావడం విశేషం. ఇప్పటికే 2,770 దరఖాస్తులను పరిష్కరించగా మరో 5,630 పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అయితే వాటిలో ఎక్కువమంది నెల, రెండు నెలల్లో 18ఏళ్ల నిండే యువకుల దరఖాస్తులు ఉన్నట్లు సమాచారం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 18ఏళ్ల నిండిన వారికి మాత్రమే ఓటుహక్కు కల్పించాల్సి ఉంది. అయితే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ నాటికి 18 ఏళ్ల నిండే వారికి కూడా ఓటుహక్కు కల్పిస్తామని ప్రకటించడంతో ఆ లోపు 18ఏళ్ల నిండే యువకులు కూడా దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో కొన్ని విచారణ చేసినా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఓట్ల తొలగింపుల కోసం దరఖాస్తులు వస్తున్నా వాటిని పెండింగ్‌లో పెట్టారు. ఓట్ల తొలగింపులు చేయాలంటే ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీంతో ఓట్ల తొలగింపుల కోసం పెద్దగా దరఖాస్తులు వస్తున్న పరిస్థితి లేకుండాపోయింది.

ఎస్పీగా గరుడ్ సుమిత్

వెంటనే బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుమిత్ సునీల్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 4: జిల్లా ఎస్పీగా గరుడ్ సుమిత్ సునీల్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు ఎస్పీగా పనిచేసిన పి.పరమేశ్వరరెడ్డిపై బదిలీ వేటు వేసిన విషయం విదితమే. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ గరుడ్ సుమిత్ సునీల్ ప్రస్తుతం ఇంటెలిజెన్సీ విభాగంలో పనిచేస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన సివిల్ సర్వీస్‌లో 2015లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2018లో ఆరునెలల పాటు జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ పొందారు. సత్యఏసుబాబు ఎస్పీగా పనిచేసిన సమయంలో శిక్షణ తీసుకున్న గరుడ్ సుమిత్ సునీల్ చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేశారు. జిల్లాలో ఆరునెలల పాటు శిక్షణ పొందిన తర్వాత గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా విధులలో చేరారు. అనంతరం విశాఖపట్నం రేంజి పరిధిలో నర్సీపట్నం ఏఎస్పీగా, తూర్పుగోదావరి జిల్లా ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. శ్రీకాకుళం ఏఎస్పీగా, కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా, విశాఖపట్నం డీసీపీగా, ఎస్ఐబీలో ఎస్పీగా విధులు నిర్వహించారు. తొలిసారిగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సుమిత్

జిల్లా ఎస్పీగా నియమితులైన గరుడ్ సుమిత్ సునీల్ గురువారం రాత్రికే బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ నాగేశ్వరరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు సుపరిచితుడినేనని, శిక్షణ కాలంలో ఇక్కడ పనిచేయడం తనకు కలిసొచ్చే అవకాశమన్నారు. నిష్పక్షపాతంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పెన్షన్

33వ డివిజన్ సచివాలయం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న రవి, కృష్ణమోహన్, శ్రీను, శశికాంత్‌భూషణ్

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 4: టీడీపీ అధికారంలోకి రాగానే పింఛన్‌దారులందరికీ ప్రతినెలా రూ.4వేలు పెన్షన్ ఇస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. సచివాలయాల వద్దకు పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సేవలు అందించి దాతృత్వం చాటారు. గురువారం నగరంలోని 33 డివిజన్‌లోని సచివాలయంలో భోజనం అందించారు. డివిజన్ అధ్యక్షులు నల్లూరి రవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పింఛన్‌దారులు తమ ఆకలి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో వైసీపీ ప్రభుత్వం ఆటలాడుకుంటోందన్నారు. సకాలంలో నిధులు విడుదల చేయకుండా ఆలస్యం చేసి, ప్రజలను ఎండలో తీవ్ర ఇబ్బందులు పెట్టిందని చెప్పారు. అంతేకాకుండా టీడీపీపై నిందలు వేయడం వైసీపీ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. జాయింట్ సెక్రటరీ గంగవరపు కృష్ణమోహన్ ఆర్థిక సహాయంతో తాగునీరు, భోజనం అందించగా, కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గార్లపాటి శ్రీనివాసరావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, శశికాంత్‌భూషణ్, మండే శ్రీమన్నారాయణ, టి.సాంబశివరావు, యరజర్ల యలమంద, ప్రవీణ్, గోనుగుంట్ల యోనా, యాటగిరి అంకయ్య పాల్గొన్నారు.

కారణం తెలుసుకునేందుకే మెమోలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 4 : టీచర్ల గైర్హాజరుకు కారణాలు తెలుసుకునేందుకే వారికి మెమోలు జారీచేసినట్లు డీఈవో సుభద్ర తెలిపారు. స్థానిక డీఆర్ఆర్ఎం స్కూలులో జరుగుతున్న పదవ తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి హాజరుకాని 284 మంది టీచర్లకు మెమోలు జారీచేయడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'విద్యాశాఖలో మెమోల కలకలం' కథనంపై ఆమె స్పందించారు. గతంలో మూల్యాంకన విధులకు హాజరుకాని టీచర్లకు, హెచ్‌ఎంలకు ఫోన్ చేసి స్పాట్‌కు రప్పించేవారు. అయితే అందుకుభిన్నంగా స్పాట్ ప్రారంభమైన మొదటిరోజే హాజరు కాని టీచర్లకు ఒకేసారి మెమోలు జారీచేయడంపై ఉపాధ్యాయులోకం ఉలిక్కిపడింది. మెమోలు అందుకున్న టీచర్లు మరుసటి రోజు స్పాట్‌కు రాగా అప్పటికే సరిపడినంత మంది విధుల్లో ఉండటంతో కొందరు వెనుతిరిగి వెళ్లారు. హైస్కూలు హెచ్‌ఎంలు ఇచ్చిన జాబితాను ఉపవిద్యాధికారులు ధ్రువీకరించిన తర్వాతే సీఈ, ఏఈలను నియమించారన్నారు. మూల్యాంకన విధులకు హాజరై పేపర్లు దిద్దుతున్న టీచర్లు, అర్హతను పరిశీలించేందుకే వారికి మెమోలు ఇచ్చామన్నారు. ఫిబ్రవరిలో అమెరికా వెళ్లిన టీచర్ ఏప్రిల్‌లో ఉన్నారో లేదో తెలుసుకునేందుకు మెమో ఇచ్చానన్నారు. స్పాట్‌లో ఎవరైనా అర్హత లేని వారు పనిచేస్తున్నట్లు తెలిస్తే పరిశీలించి వారిమీద శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

జిల్లాలో 90శాతం పింఛన్ల పంపిణీ

ఒంగోలు నగరం, ఏప్రిల్ 4 : జిల్లాలో గురువారానికి 90 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. బుధవారం పింఛన్ల పంపిణీలో అనేక ఇబ్బందులు పడగా గురువారం అన్ని సచివాలయాల్లో పంపిణీ సజావుగానే సాగింది. పంపిణీ మరో రెండురోజులు మాత్రమే జరగనుంది. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాల్సి ఉంది. శుక్ర, శనివారాల్లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఇళ్లవద్ద పింఛన్లు తీసుకోవాల్సిన వారిలో కొందరు అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు వచ్చి ఇప్పటికే పింఛన్ తీసుకోవడం గమనార్హం.

బలవంతపు రాజీనామాలు..!

- వలంటీర్లతో పోస్టులు వద్దని చెప్పిస్తున్న వైసీపీ నేతలు
- సంతపేటలో 23మంది గుడ్‌బై
- రంగుతోటలో మరికొందరు అదేబాటలో..



వైసీపీ కార్పొరేటర్, నాయకుల ఆధ్వర్యంలో రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 4 : వైసీపీ ప్రచార కార్యక్రమాలకు కీలకంగా వ్యవహరించే వలంటీర్లను విధులకు దూరంగా ఉండాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు.. ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ఈ మేరకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ఆదేదో ప్రతిపక్షాల కుట్ర అన్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. వలంటీర్లు విధులకు దూరం కావడంతో వారి వారి క్లస్టర్‌లలో ఇళ్లకు వెళ్ళే పరిస్థితి కూడా లేదు. దీతో రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత కష్టతరంగా మారుతుందని భావించిన వైసీపీ నాయకులు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. వలంటీర్ ఉద్యోగాన్ని వదిలి వైసీపీ కార్యకర్తలుగా పనిచేయాలని ఆదేశిస్తున్నారు. అందుకు ఈ రెండు నెలలు వలంటీర్లకు వచ్చే వేతనాలను తామే చెల్లిస్తామని, అంతేకాకుండా అదనంగా బహుమతులు అందిస్తామని ఆశచూపిస్తున్నారు. కొందరిని అయితే పోస్టు ఇచ్చింది మేమే కదా.. మేం చెబితే రాజీనామా చేయారా? అంటూ భయపెడుతున్నారు. ఇలా రకరకాల ఒత్తిళ్లతో కొందరు బలవంతపు రాజీనామాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక వైసీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి, రాజీనామాలు చేయాలని చెప్పారు. దీంతో నగరంలోని సంతపేట సచివాలయ పరిధిలోని 23మంది వలంటీర్లు సచివాలయ అడ్మిన్ నాగార్జునకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

రేపు 12వ డివిజన్‌లో మరి కొంతమంది

వలంటీర్లను వైసీపీ కార్యకర్తలుగా పూర్తిస్థాయిలో పనిచేయించుకునేందుకు ఆ పార్టీ శ్రేణులు ఒత్తిడి మీద పలువురు రాజీనామాలకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే 21 డివిజన్‌లో కొందరు వలంటీర్లు రాజీనామా చేయగా, తాజాగా సంతపేటలో మరో 23మంది గుడ్‌బై చెప్పారు. ఇది లా ఉంచితే రేపు, ఎల్లుండిలో 12వ డివిజన్‌లోని రంగుతోటలో 28 మంది రాజీనామాకు సిద్ధం అయ్యారు. ఈ మేరకు వైసీపీ నాయకులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్ గురువారం ఆ డివిజన్‌లోని వలంటీర్లతో తన నివాసంలో సమావేశమైనట్లు సమాచారం. 35 ఏళ్ల వయస్సుపైన ఉండే వారు వలంటీర్లుగా కొనసాగండి. ఆలోపు వారు ఉద్యోగాలకు రాజీనామాలు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో రేపు లేదా ఎల్లుండి మరి కొంతమంది రాజీనామా చేయడానికి సిద్ధం అయినట్లుగా సమాచారం. పోస్టుకు రాజీనామా చేసి పార్టీకి సేవ చేస్తే ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున నగదు బహుమతి ఇస్తామని చెబుతున్నారు. అలాగే పార్టీకి వారి పరిధిలో మెజారిటీ తెస్తే రూ.4లక్షలు బహుమతి ఇస్తామని ఆశచూపడంతో పొలోమని రాజీనామా చేస్తున్న పరిస్థితి.

దద్దరిల్లిన దర్శి

- టీడీపీ అభ్యర్థి లక్ష్మికి అపూర్వస్వాగతం
- అరమరికలు లేకుండా కదిలొచ్చిన టీడీపీ కూటమి శ్రేణులు
- బారులుదీరిన జనంతో ర్యాలీ
- కిక్కిరిసిన సభాప్రాంగణం



ఉమ్మడి కూటమిసభకు హాజరైన జనసందోహం(ఇన్‌సెట్) మాట్లాడుతున్న లక్ష్మి, పక్కన గొట్టిపాటి, మాగుంట, దామచర్ల, పాపారావు, రియాజ్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి నియోజకవర్గ ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. తొలిసారిగా ఆమె గురువారం నియోజకవర్గంలోకి రావటంతో ఆరంభ గ్రామమైన శంకరాపురం నుంచి దర్శి వరకు టీడీపీ కూటమి శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పలికాయి. దర్శి జనసందోహంతో దద్దరిల్లింది. సభాప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయి ఎటుచూసినా జనంతో కళకళలాడింది. 27 కిలోమీటర్ల దూరానికి లక్ష్మి, ఇతర నాయకులతో నిండిన వాహనం ర్యాలీ నాలుగు గంటల పాటు సాగింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కూటమి శ్రేణులు ఎలాంటి అరమరికలు లేకుండా స్వచ్ఛందంగా తరలివచ్చి జేజేలు పలికారు. వేలాది వాహనాల్లో ప్రజలు తరలిరావటంతో కూటమి నాయకుల ఆనందానికి అవధులు లేకుండాపోయింది. దారిపొడవునా ఆయా గ్రామాల వద్ద ప్రజలు ముఖ్యంగా మహిళలు రోడ్లపైకి వచ్చి స్వాగతం పలకటం, హారతులివ్వటం అధికంగా కనిపించింది. సభాప్రాంగణానికి 20వేల మందికి పైగా వచ్చినట్లు అంచనా.

అడుగడుగునా ఘనస్వాగతం

జిల్లాలో పేరొందిన దివంగత మాజీమంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలు, మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య కుమార్తె లక్ష్మిని దర్శి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. నరసరావుపేటలో టీడీపీ కుటుంబానికి చెందిన డాక్టరు లలిత్‌సాగర్ సతీమణి అయిన లక్ష్మిని అధిష్ఠానం చివరిక్షణంలో రంగంలో దింపింది. దీంతో ఆమె గురువారం సాయంత్రం తొలిసారిగా నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. సింగరకొండ ఆంజనేయస్వామి గుడిలో పూజలు అనంతరం సాయంత్రం సాయంత్రం 4.40 సమయంలో నియోజకవర్గంలోని శంకరాపురం గ్రామానికి చేరారు. అప్పటికే అక్కడకు భారీగా చేరిన టీడీపీ శ్రేణులు స్వాగతం పలికాయి. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి, ఇతర నాయకులు కూడా ఆమెతోపాటు వాహనం ఎక్కగా 4.50 సమయంలో ర్యాలీ ప్రారంభమైంది. పోలవరం, వేంపాడు మీదుగా ముండ్లమూరు చేరేసరికి అటు తాళ్లూరు, ఇటు ముండ్లమూరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు వచ్చి వారికి స్వాగతం పలికారు. ముండ్లమూరు సెంటర్ ర్యాలీతో కిక్కిరిసింది. ఆతర్వాత పసుపుగల్లు, ఉల్లగల్లు, రెడ్డినగర్, పులిపాడుల మీదుగా రాత్రి 8.20 సమయానికి దర్శిలోకి ర్యాలీ ప్రవేశించింది. దర్శితో పాటు దొనకొండ, కురిచేడు ప్రాంతాల ప్రజలు కూడా అక్కడకు చేరటంతో దర్శి జనంతో కిక్కిరిసిపోయింది. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 9 గంటలకే సభ ముగించాల్సి ఉండటంతో అక్కడి నుంచి వేగంగా సభాప్రాంగణానికి చేరారు. ప్రాంగణంలో వేలాదిగా వేచి ఉన్న ప్రజలు వీరి వాహనం అక్కడకు రాగానే పెద్దఎత్తున జేజేలు పలుకుతూ స్వాగతించారు. అందిన సమాచారం మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రధానంగా టీడీపీ, జనసేన శ్రేణులు తరలివచ్చారు. సొంత వాహనాల్లో తరలిరావటమే అత్యధికంగా కనిపించింది. మహిళలు పెద్దసంఖ్యలో రావటం విశేషంగా చెప్పుకోవచ్చు. సభలో లక్ష్మితోపాటు ఎంపీ అభ్యర్థి మాగుంట ప్రసంగించినప్పుడు ప్రజల నుంచి భారీస్పందన రావటం విశేషం. లక్ష్మి మాట్లాడుతూ నేను మీ ఇంటి ఆడపడుచును.. ఆదరించండి ఇక్కడే ఉండి మీకోసం పనిచేస్తా.. మీకు అండగా ఉంటా.. తన వైద్యసేవలు కూడా దర్శి ప్రజలకే అంకితం చేస్తానని చెప్పటంతో సభికులు పెద్దఎత్తున కేరింతలు కొట్టారు. సభలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన అధ్యక్షుడు రియాజ్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, స్థానిక బీజేపీ నాయకులు, ఇతర ప్రముఖులు మాట్లాడారు.

ఇక్కడే ఉండి సేవ చేస్తా:లక్ష్మి

నిందలు వేసి..నవ్వులపాలు..!

వైసీపీ డ్రామాలపై ప్రజలు పెదవి విరుపు ● ఫలించని అధికార పార్టీ నేతల అబద్ధపు ప్రచారం

రెండో రోజు కొనసాగిన పింఛన్ల పంపిణీ ● పలు సచివాలయాల వద్ద టీడీపీ అన్నదానాలు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 4: త్వరలో జరిగే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు సృష్టించి అందుకు టీడీపీ కారణమంటూ సానుభూతి సంపాదించుకోవాలని చూసిన వైసీపీ ఎత్తుడగలపై జనం మండిపడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒకటో తేదీనే పింఛను ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్కసారిగా నిలిపివేసింది. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి ఆ విషయాన్ని దాచిపెట్టి పండుటాకులను ఏడిపించింది. అయితే తెలుగుదేశం పార్టీ కారణమని ప్రజల్లో సానుభూతి సంపాదించుకునే ప్రయత్నాలు చేసింది. అందులో భాగంగా 3వ తేదీ వరకు పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. పింఛను పంపిణీలో వైసీపీ డ్రామాలు జనానికి తెలిసిపోవడంతో గురువారం ఆ పార్టీ శ్రేణులు ఒక్కరు కూడా సచివాలయాల పరిసరాల ప్రాంతాల్లో కనిపించకపోగా, తెలుగుదేశం పార్టీ శ్రేణులు మాత్రం సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడకుండా భోజన ఏర్పాట్లు చేపట్టారు. దీంతో టీడీపీపై నిందలు వేయాలని చూసిన వైసీపీ నవ్వులపాలైంది.

వాస్తవాన్ని దాచిపెట్టి..

వాస్తవానికి గత నెల 16వ తేదీ నుంచి రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నాయి. ఇప్పటికే వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న వలంటీర్లు ఇంకా విధుల్లో ఉంటే ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తారని భావించిన ఈసీ వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచింది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయంగా సచివాలయ సెక్రటరీల ద్వారా పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశించింది. ఇదే విషయమై తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూడా ఇళ్లవద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఆ దిశగానే సంబంధిత అధికారులు చర్యలకు సిద్ధం కాగా, దివ్యాంగులు, వయోవృద్ధులు, మంచంలో ఉండేవారికి ఇంటి వద్దనే పింఛన్లు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ప్రజల్లో టీడీపీ సానుభూతి పెరుగుతోందని భావించిన వైసీపీ నేతలు కొత్త ఎత్తుడగలకు తెరలేపారు. వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా పింఛను నిధులు విడుదల చేయకుండా ఆలస్యం చేసింది. అది కూడా పూర్తిగా చేయకుండా అరకొరగా విడుదల చేసి, సగం మందిందికి పంపిణీ చేసి మరి కొందరికి రేపు, మాపు అంటూ తిప్పడంతో జిల్లా అంతటా లబ్ధిదారుల్లో అసహనం కనిపించింది. కావాలనే బ్యాంకుల్లో డబ్బులు వేయకుండా రాజకీయం చేయడంపై పలువురు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ వైసీపీ రాజకీయమే అని ప్రజలు గుర్తించి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.



కబేళబజార్ సచివాలయం వద్ద పింఛను కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు



మంగమూరిడొంక సచివాలయం వద్దకు నడవలేని స్థితిలో వచ్చిన వృద్ధురాలు

టీడీపీ సేవా కార్యక్రమాలు

జిల్లాలో రెండోరోజు పింఛన్లు పంపిణీ కార్యక్రమం గురువారం కొనసాగింది. బుధవారం అందక పొద్దుపోయే వరకు సచివాలయాల వద్ద ఎదురు చూసినా నగదు చేతికి రాకపోవడంతో గురువారం ఉదయం 8గంటలకే సచివాలయాల వద్ద బారులు తీరారు. అయితే ఉదయం 11 గంటలకు కూడా కొన్ని సచివాలయాలకు పూర్తి స్థాయిలో బ్యాంకుల్లో నగదు జమ కాకపోవడంతో మధ్యాహ్నం వరకు సెక్రటరీలు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించిన తెలుగుదేశం పార్టీ భోజనం ఏర్పాట్లు, పలు చోట్ల మజ్జిగ పంపిణీలు, మరి కొన్ని చోట్ల తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసి సేవా గుణాన్ని చాటుకున్నారు. అయితే నిన్న మొన్నటి వరకు వార్డుల్లో, సచివాయాల వద్ద పనిగట్టుకుని మరీ టీడీపీపై నిందలు వేసి, అబద్ధపు ప్రచారం చేసిన వైసీపీ నేతలు వాస్తవాలు వెలుగులోకి వచ్చేసరికి పత్తాలేకుండా పోయారు. దీనిపై టీడీపీ నాయకులు వైసీపీ నాయకుల తీరును ఎండగట్టారు.



మంగమూరిడొంక సచివాలయం వద్ద పింఛనుదారులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

విద్యార్థుల వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 4 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 6నుంచి ప్రారంభమవుతున్న వార్షిక పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు ఇప్పటికే మండల విద్యావనరుల కేంద్రాల్లో భద్రపరిచారు. ప్రతిపరీక్షకు ఏరోజుకారోజు పాఠశాల హెచ్ఎం, టీచర్లు ఉదయాన్నే మండల విద్యావనరుల కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు తీసుకెళ్ళి పరీక్షలు నిర్వహించాలి. 1నుంచి 8 తరగతి వరకు క్లాస్‌రూము బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ)-3 పద్ధతిలో జవాబులను ఓఎంఆర్ షీట్‌లో గుర్తించి వాటిని బబుల్ చేయాలి. 1 నుంచి 5 తరగతులకు అన్ని సబ్జెక్టులకు సమాధానాలను ఒకే ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాలి. 6,7,8 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషుకు ఒక ఓఎంఆర్ షిట్, గ్రూప్స్ గణితం, సైన్స్, సోషల్ స్టడీస్‌కు మరో ఓఎంఆర్‌షీట్‌లో సమాధానాలు గుర్తించి బబుల్ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే డీసీఈబీ ద్వారా ఓఎంఆర్ షిట్లను సరఫరా చేస్తారు. ప్రైవేటు పాఠశాలలకు ప్రశ్నపత్రాలు మాత్రమే సరఫరా చేస్తారు. 9వ తరగతి విద్యార్థులకు మాత్రం పదో తరగతి పరీక్షల తరహాలో ప్రత్యేకంగా జవాబుపత్రాలపై సమాధానాలు రాయాల్సి ఉంటుంది. పరీక్షలు సజావుగా జరిగేలా ఉప విద్యాధికారులు, ఎంఈవోలు పర్యవేక్షించాలని డీఈవో సుభద్ర గురువారం ఓ ప్రకటనలో కోరారు.

తీరప్రాంత గ్రామాలను అభివృద్ధి చేస్తాం

కొత్తపట్నం(ఒంగోలు నగరం) ఏప్రిల్ 4: ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత గురువారం రాత్రి మండలంలోని మడనూరు పట్టపుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



నాగసత్యలతకు దిష్టి తీస్తున్న మహిళలు

ఈ సందర్భంగా మత్స్యకారులు, మహిళలతో మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి ఎమ్మెల్యేగా జనార్దన్ హయాంలో తీర ప్రాంత గ్రామాల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాళం నరసమ్మ, గేనం సుబ్బారావు, ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, మేకల జక్రయ్య, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలింగ్ అధికారులకు శిక్షణ

చీమకుర్తి, ఏప్రిల్ 4: సాధారణ ఎన్నికలు నిర్వహణలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలో పీవో, ఏపీవోలుగా డ్యూటీలు విధించిన వారికి శుక్రవారం చీమకుర్తిలో తొలివిడత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్వో గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు మాస్టర్‌ట్రైనర్లు శిక్షణ ఇస్తారని, హాజరైన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణార్థులకు అవగాహన తెలుసుకునే నిమిత్తం పరీక్షను సైతం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బావిలో పడి యువకుడు మృతి

కొత్తపట్నం(ఒంగోలునగరం) ఏప్రిల్ 4: మండలంలోని అల్లూరు గ్రామంలో బావిలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ కాలేషా(28) ఒంగోలులోని ఓ ప్రయివేట్ స్కూలు బస్సుకు డ్రైవర్‌గా ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడ్డ కాలేషా ఆదివారం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతుకుతుండగా గురువారం సాయంత్రం అల్లూరు ఊరి చివర ఉన్న బావిలో శవమై తేలాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం వాహనం బోల్తా



రోడ్డుపై పడిన మద్యంసీసాలు

చీమకుర్తి, ఏప్రిల్4 : మద్యం బాటిళ్ల రవాణా చేసే వాహనం బోల్తాపడిన సంఘటన గురువారం చీమకుర్తి తూర్పుబైపాస్ జంక్షన్ వద్ద జరిగింది. పేర్నమిట్ట డిపో నుంచి మద్యం కేసులను లోడ చేసుకొని చీమకుర్తికి బయలుదేరిన వాహనం టైరు పంచర్ కావటంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కి ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. అయితే 23 కేసులు బీరుబాటిళ్లు, 16కేసులు మద్యం బాటిళ్లు పగిలిపోయాయని ఎక్సైజ్ ఎస్ఐ దేవిక తెలిపారు. ఈ నష్టాన్ని రవాణాదారుడిని నుంచి వసూలు చేయనున్నట్లు చెప్పారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

చీమకుర్తి, ఏప్రిల్ 4 : దేవరపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న స్థావరంపై ఎస్ఈబీ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు పాపారావును అదుపులోకి తీసుకొని 26క్వార్టర్ బాటిళ్లను స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఇ.మారయ్యబాబు, ఎస్ఐ వినితా రెడ్డి తెలిపారు. అదేవిధంగా మట్టిపాడు గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి రవాణాదారులను అదుపులోకి తీసుకున్నట్లు వారు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్న ఐదుగురు నిందితులను ఎస్ఎన్‌పాడు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తా..

టీడీపీ ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ● ఎర్రగుడిపాడు సర్పంచ్, పులికొండ మాజీ ఎంపీటీసీ తమ అనుచరులతో తెలుగుదేశంలో చేరిక



బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన ఎర్రగుడిపాడు సర్పంచ్ హేమలత



పార్టీలో చేరిన పులికొండ గ్రామ నాయకులతో విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్ 4 : "త్వరలో జరిగే ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుపై వేసి ఆశీర్వదించండి. .అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తా" అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ గ్రామంలో ఇంటింటా తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్‌డీఏ కూటమి గెలుపు చారిత్రిక అవసరమని తెలిపారు. టీడీపీని గెలిపించుకుందామని, చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కాగా చీమకుర్తి మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికల పరంపర అప్రతిహతంగా సాగుతున్నది. ఎర్రగుడిపాడు సర్పంచ్ రామిశెట్టి హేమలత, రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 20కుటుంబాలు బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే మండలంలోని పులికొండ గ్రామంలో మాజీ ఎంపీటీసీ రావి సింగమ్మతో పాటు పదికుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి విజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, వేల్పుల శ్రీను, యడ్లపల్లి రామబ్రహ్మం, ఓగూరి బుర్రియ్య, కొండ్రగుంట రాఘవ, అత్యాల ఏసోబు, అంగలకుర్తి పోతురాజు, బెల్లం కోటేశ్వరరావు, రావి వెంకటరామయ్య, బెల్లం హరిబాబు, శేషగిరి, నారాయణ, చిరంజీవి, జనసేన పార్టీ నాయకులు పల్లపు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దించడమే లక్ష్యం..

మద్దిపాడు: జగన్మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓటర్లు గద్దెదించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకోవాలని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం కొలచనకోట గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని చెప్పారు. గ్రామంలో తన హయాంలోనే సిమెంట్ రోడ్లు వేసినట్టు గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలను తనను ఆదరించి గెలిపించాలని కోరారు. పొరుగు జిల్లాల వారికీ ఈ నియోజకవర్గంపై ప్రేమ ఉండదన్నారు. ఒకరు వచ్చి ప్రజలకు ఏమి చేశారని, మీరే ఆలోచించుకుని తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కొలచనకోట రేవులో ఇసుకను వైసీపీ నాయకులు దోచేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అడకా స్వాములు, జనసేన మండల అధ్యక్షుడు సున్నా బాలసుబ్రహ్మణ్యం, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, అద్దేపల్లి భవానీ, మోపర్తి లాలు, చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొలచనకోటలో బీఎన్ ప్రచారం

తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి

● టీడీపీ నేత బొమ్మాజి అనిల్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీతోనే బీసీ అభివృద్ధి జరుగుతుందని టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సోదరుడు బొమ్మాజి అనిల్ పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని తిమ్మసముద్రం, ముప్పాళ్ళ, ఈదుమూడి, మట్టిగుంట గ్రామాల బీసీలతో ఈదుమూడిలో జయహో బీసీ సదస్సు గ్రామ అధ్యక్షుడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం బీసీలను అధోగతిపాలు చేసిందన్నారు. గడచిన ఐదేళ్లలో బీసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. గత తెలుగుదేశం హయాంలో బీసీలలోని అన్ని ఉప కులాలకు తగిన గుర్తింపునివ్వడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు అందరూ ఐక్యంగా ఉండి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని చెప్పారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ బీసీల అభివృద్ధిని కాంక్షించేది టీడీపీనేనని, బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్, అడకా స్వాములు, బి.సెల్వం, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబు, స్వాములు, లంబు నాగేశ్వరరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అనిల్

వడదెబ్బతో ప్రాణనష్టం లేకుండా చూడాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4: వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ, మంచినీటి కొరతతో ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం పలుశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎండల దృష్ట్యా మనుషులకు, పశువులకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆశాలు, ఏఎన్ఎంలతో కలిసి ఇంటింటికి వెళ్లి వివరించేలా ప్రత్యేక కరపత్రాలు రూపొందించాలన్నారు. పశువుల దాహం తీర్చేందుకు నీరు అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైతే నీటి కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలన్నారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే నీటితో జాగ్రత్తగా చెరువులు నింపేదుకు ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అందుకోసం స్వచ్ఛంద సంస్థల సహకారం పొందాలని ఆయన సూచించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలతో చలివేంద్రాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు అవసరమైన మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పనిప్రదేశాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, అధికారులు మర్దన్‌అలీ, మాధూరి, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, వసుంధర, రవికుమార్, ఉషారాణి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలరావు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు

కలెక్టర్‌కు పలువురి అభినందనలు

జిల్లా కలెక్టర్‌గా రెండేళ్ళ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్‌ను స్థానిక కలెక్టర్ బంగ్లాలో గురువారం పలు శాఖల అధికారులు కలిసి బొకేలు ఇచ్చి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ రాజ్యలక్ష్మి, మర్దన్ అలీ, రవికుమార్ పాల్గొన్నారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ ఎస్.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకొలు శ్రీనివాసులు, దానియేలు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మత్తులో పోలీసులపై యువకుడు వీరంగం

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 4: మత్తుకు బానిసైన యువకుడు ఒంగోలులో బుధవారం రాత్రి హల్‌చల్ చేశాడు. అదుపులోకి తీసుకోవడానికి వచ్చిన పోలీసులపై తిరగబడి రక్షక్‌వాహనం అద్దాలు సైతం పగలగొట్టాడు. రాజస్థాన్ నుంచి పనుల కోసం వచ్చి ఓ యువకుడు చీమకుర్తి గ్రానైట్ క్వారీలో పని చేస్తున్నాడు. మత్తు కోసం వైట్నర్ పీల్చే అలవాటు ఉంది. గంజాయి కూడా దట్టంగా పట్టించాడు. దీంతో విచక్షణ కోల్పోయి స్థానిక మంగమూరురోడ్డులో వీరంగం సృష్టించాడు. మహిళల వసతి గృహంలోకి వెళ్లడంతో అక్కడ ఉన్న యువతులు కేకలు వేశారు. దీంతో చుట్టు పక్కల ఉన్నవారు అక్కడకు చేరి అతడిని నిర్బంధించారు. సమాచారం అందుకున్న పోలీసులకు చుక్కలు చూపించాడు. రక్షక్ వాహనంలో తరలిస్తుండగా వారిపై తిరగబడి వాహనం అద్దం సైతం పగలకొట్టాడు. ఎట్టకేలకు అదనపు బలగాల సహకారంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తాలుకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏఎంవో ఆకస్మిక తనిఖీలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 4: సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి(ఏఎంవో) ఎం.రమేష్ గురువారం ఒంగోలు నగరంలోని రెండు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక నెహ్రూనగర్, వెంకటేశ్వర కాలనీలోని ఎంపీపీ స్కూళ్ళను తనిఖీ చేసి 2,3 తరగతుల విద్యార్థుల తెలుగు భాషా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పరీక్షల ఫలితాలను తప్పనిసరిగా అకడమిక్ మానటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. విద్యార్థుల వర్క్‌బుక్, ఇతర రికార్డులను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బెల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. వెంకటేశ్వరకాలనీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో చదివిస్తున్న రమేష్

సునీల్‌చోప్రా జీవితం ఆదర్శనీయం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4 : బహుభాషా కోవిదుడు, అనేక ప్రజాసంఘాలకు వ్యవస్థాపకులుగా వ్యవహరించిన సునీల్ చోప్రా జీవితం ఆదర్శనీయమని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం సునీల్ చోప్రా ప్రథమ వర్ధంతి సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ సునీల్‌చోప్రా లండన్ యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ ఆఫ్రికన్‌ను అధ్యయనం చేశారన్నారు. అనేక ప్రపంచ భాషలు నేర్చుకున్న ఆయన అంతర్జాతీయ స్థాయిలో పలు సంఘీభావ ఉద్యమాల్లో పాల్గొన్నారని కొనియాడారు. నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంకణాల వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, కేఎఫ్.బాబు, సీహెచ్.వినోద్, టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

కులనిర్మూలన కోసం బాబుజగ్జీవన్‌రామ్ కృషి

ఒంగోలు(కలెక్టరేట్); ఏప్రిల్ 4: కుల నిర్మూలన, అస్పృశ్యత నివారణ కోసం తన జీవితాన్నే ధార పోసిన మహనీయుడు బాబుజగ్జీవన్‌రామ్ అని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ఉపకులపతి మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యూనివర్శిటీలోని సమావేశపు హాలులో గురువారం జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సభకు ప్రిన్సిపాల్ జి.రాజమోహన్ అధ్యక్షత వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంజిరెడ్డి మాట్లాడుతూ అస్పృశ్యత నివారణ కోసం ఆల్ ఇండియా డిప్రెస్ట్ క్లాస్‌లీగ్ అనే సంస్థను ఏర్పాటు చేసి దేశంలో కుల నిర్మూలన కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ అంజిరెడ్డి

నేడు అచలానంద స్వామి ఆరాధన

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 4: ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని శ్రీ అచలానందస్వామి ఆశ్రమంలో స్వామివారి 8వ ఆరాధన మహోత్సవం శుక్రవారం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు స్వామి పరిపూర్ణ సిద్ధానంద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు స్వామివారి పాదుకలకు అభిషేకం, 11 గంటల నుంచి పారాయణ, సత్సంగం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ మొదలైన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే విధంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇక ఈ నెల 9వ తేదీన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను సైతం ఆశ్రమంలో నిర్వహిస్తున్నామని, కనుక భక్తులు ఆయా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా క్విస్‌లో గ్యాడ్యుయేషన్ డే

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 4: ఒంగోలు నగరం కర్నూలురోడ్డులోని క్విస్ హైస్కూలులో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. యూకేజీ విద్యార్థులను 1వతరగతికి, 5వ తరగతి విద్యార్థులను ఆరో తరగతికి ప్రమోట్ చేస్తూ విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నాగరాజు. డీన్ కమలేశ్వరిదేవి, మేనేజర్ స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్‌చక్రవర్తి, వైస్ ఛైర్మన్ శ్రీగాయత్రిదేవి అభినందించారు.



వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4: కార్మికులు వడగాల్పుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీలో గురువారం కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రత పెరిగినందున కార్మికులు ఉపశమనం పొందేందుకు పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల చేత మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం నాలుగు గంటల తర్వాత పనులు చేయించుకోవాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ పవన్‌కుమార్, బి.అనితావాణి, సహాయ కార్మిక అధికారి-1 వెంకటేశ్వర్లు, ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌కుమార్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

చీమకుర్తి, ఏప్రిల్ 4 : చీమకుర్తి మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ, సీఐ దుర్గాప్రసాద్‌తో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. ముఖ్యంగా పల్లామల్లి, చంద్రపాడు, గాడిపర్తివారిపాలెం, పి.నాయుడుపాలెం పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్వో పోలీసులకు పలు సూచనలు చేశారు.



పల్లామల్లిలో పరిశీలిస్తున్న ఆర్వో గోపాలకృష్ణ

వైభవంగా ధ్వజస్తంభ కలశ ప్రతిష్ఠ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: మార్కాపు రం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నాలుగు ప్రాకార గోపురాల కలశ స్థాపన, నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేక కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా భక్తజన రంజకంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీపతి అనంతాచార్యులు యంత్రస్థాపన, రత్న స్థాపన, శిఖర ప్రతిష్ఠ, నూతన ధ్వజ ప్రతిష్ఠ, కుంభప్రోక్షణ, శాంతికల్యాణం నిర్వహించారు. అనంతరం శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామికి వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. భక్తుల చెన్నకేశవ నామస్మరణ మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో ఆధ్యాత్మిక శోభతో పండుగ వాతా వరణం నెలకొంది. ప్రతిష్ఠ సందర్భంగా ఇళ్లల్లో ఆడపడుచులను పిలిచి పసుపు, కుంకుమ, చీరెలు పెట్టారు. గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నాలుగు మాడ వీధుల్లో అన్నప్రసాద వితరణ కల్పించారు.



చెన్నకేశవస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు



కలశాలను తీసుకొస్తున్న చైర్మన్, ఈవో

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

గిద్దలూరు : పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన దేవాలయంలో అయ్యప్ప స్వామి, వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం అయ్యప్పస్వామితోపాటు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేక పూజల నడుమ ప్రతిష్ఠించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కటకం రామకృష్ణయ్య కుటుంబీకులు అయ్యప్పస్వామి ప్రతిష్ఠకు దాతలుగా వ్యవహరిం చారు. వివిధ దేవతామూర్తుల విగ్రహాలకు ఆయా దాతల కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బీవీ.రంగారావు, కటకం ట్రస్టు చైర్మన్ కటకం నాగేశ్వరరావు, దేవస్థాన కమిటీ కార్యదర్శి ఆర్.ఉమామహేశ్వరరావు తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా దక్షిణ రాజగోపుర కలశ ప్రతిష్ఠ

సింగరాయకొండ : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో గురువారం దక్షిణ రాజగోపుర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలోని శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహ స్వామి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విఖనస, క్షేత్రపాలక కాలభైరవస్వామి, వినాయక నూతన బింబ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా గావించారు. స్వామికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. తదనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపై కేసు నమోదు

మార్కాపురం రూరల్ : వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ గురువారం రాత్రి తెలిపారు. ఆదివారం రోజున వైసీపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పట్టణంలోని తర్లుబాడు రోడ్డులోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి ఎస్‌వీకేబీ కళాశాల వరకు ఇంచుమించు 1500 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోసం ఎన్నికల అధికారి అనుమతి తీసుకోలేదు. అనంతరం కార్యకర్తలకు ఆత్మీయ విందును కూడా ఏర్పాటు చేశారు. షుమారు 3 వేల మందికి విందుభోజనం కూడా ఏర్పాటు చేసినట్లు ఎన్నికల స్క్వాడ్ టీం పరిశీలించింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డబ్బులు ఇవ్వడం లేదని పొగాకు రైతుల ఆందోళన

మద్దిపాడు, ఏప్రిల్ 4 : మొదటి, రెండో కోటా పొగాకు డబ్బులు మద్దిపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రైతులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం బ్యాంక్ వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మద్దిపాడుకి చెందిన చెందిన పల్లకి వెంకటనరసింహారెడ్డి, పల్లకి బసిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, నన్నపురెడ్డి రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మారెడ్డి నరేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, సూరే రామబ్రహ్మారెడ్డి, ఇనుకొల్లు హనుమారెడ్డి మాట్లాడుతూ తీసుకున్న పొగాకు పంట రుణాలు రెండో కోటా తర్వాత నుంచి రుణకిస్తీలను బ్యాంకులు జమ చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. బ్యాంకులు రెండు కోటాల డబ్బులు ఇస్తేనే పచ్చాకు కూలీలు, బ్యారన్ టోకర్లు, డ్రైవర్లకు కూలి డబ్బులు చెల్లిస్తామని వారు వివరించారు. పినాకిని గ్రామీణ బ్యాంక్ మేనేజర్, క్షేత్ర సహాయకుడు రైతులు పొగాకు అమ్మిన మొదటి, రెండవ కోటా డబ్బులు రైతులకు ఇవ్వకుండా వారే నేరుగా పంట రుణ అకౌంట్‌కు జమ చేసుకుని ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోయారు. బ్యాంకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఏటా మాదిరిగా పొగాకు అమ్మకాల డబ్బులు ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ పథకంలో రోజు కూలి రూ.300

టంగుటూరు, ఏప్రిల్ 4 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు చెల్లించే రోజు కూలి రూ.300 పెరిగినట్లు డ్వామా పీడీ అర్జునరావు చెప్పారు. నిన్నమొన్నటి వరకు రూ.272 ఉన్న రోజు కూలి ఇప్పుడు పెరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏడాది చివరి టార్గెట్లు, చేయాల్సిన కొత్తరకం పనులపై 10 మండలాల ఉపాధి సిబ్బందికి అవగాహన సదస్సు గురువారం టంగుటూరులోగల ఉపాధి హామీ పథకం వారి కార్యాలయంలో జరిగింది. ఒంగోలు క్లస్టర్ ఏపీడీ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సదస్సుకు టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, ఒంగోలు మండలాల ఉపాధి హామీ పథకం ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

మానవీయతతోనే మెరుగైన సమాజం



అన్నదానం ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 4: తోటి వారికి సహాయపడే మానవీయతతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక సంతపేట శివం అనాథ శరణాలయంలో ప్రముఖ సంఘ సేవకురాలు వడ్డెంపూడి సుజాత ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టటమే పుణ్యకార్యమన్నారు. శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ తాము ప్రారంభించిన అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోసూరి శ్రీదేవి, మండవ లావణ్య, డాక్టర్ రామాంజనేయులు, డీవీ.రాఘవ, మండవ సుబ్బారావు, దన్నారపు మస్తాన్‌రావు, నూకతోటి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 4: ఉప్పుగుండూరు గ్రామంలోని 30మంది మహిళలకు నాబార్డు ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చారు. వారం దరికి గురువారం నాబార్డు డైరెక్టర్ రవికుమార్ సర్టిఫికెట్లు, స్టయిఫండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో శామ్యుల్, ఎన్‌జీవో నాదెండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామి తల్లి సుబ్బమ్మకు పలువురి నివాళి



సుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న దామచర్ల జనార్దన్, రియాజ్, గొట్టిపాటి రవికుమార్, సత్య, మంత్రి శ్రీను, ఇంటూరి నాగేశ్వరరావు

టంగుటూరు, ఏప్రిల్ 4 : కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తల్లి సుబ్బమ్మకు పలువురు నివాళి అర్పించారు. గురువారం తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో సుబ్బమ్మ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఆమెకు నివాళి అర్పించిన వారిలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, మాజీ శాసనసభ్యులు జనార్దన్, పోతుల రామారావు, పార్టీ ముఖ్యనాయకులు దామచర్ల సత్య, మంత్రి శ్రీను, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ముఖ్య నాయకులు వచ్చి సుబ్బమ్మకు నివాళి అర్పించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని పరామర్శించారు.

ప్రజాసేవ చేసే వారినే గెలిపించండి

కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: ప్రజాసేవ చేసేవారినే గెలిపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 12వ వార్డులో 'ఇంటింటికి మన కందుల' ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లా డుతూ.. తాను 22 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో ప్రజాసేవలోనే ఉన్నానన్నారు. టీడీపీతోనే మార్కా పురం జిల్లా ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కందుల విఘ్నేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి కీలక నేతల షాక్

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలోని వైసీపీ కీలక నేతలు షేక్ ఆదాం సాహెబ్, మయూరీ కాశీం, షేక్ ఇస్మాయిల్, షేక్ మహ్మద్ అలీ, సయ్యద్‌మాబు, హుస్సేన్ పీరా, గౌస్ మొహిదీన్, ఇండ్లా రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా తనకు, మాగుంట శ్రీనివాసరెడ్డికి మద్దతు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కొన్ని రోజుల నుంచి ప్ర తి రోజు టీడీపీలో చేరికలు ఉంటున్నాయని ఇదే ఒరవడి ఎన్నికల వరకు కొనసాగుతుం దన్నారు.



మార్కాపురంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె గ్రామంలో గురువారం వైసీపీని వీడి మార్కాపురం ఉమ్మడిపార్టీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో 20 కుటుంబాలు చేరాయి. 'ఇంటింటికి మన కందుల' కార్యక్రమం నిర్వహించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కందుల నాయకత్వం నచ్చి, చంద్రబాబు వంటి అనుభవం కలిగిన నేత వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. పార్టీలో చేరినవారిలో శెట్టిపల్లి కాశయ్య, వెంకటేశ్వర్లు, సిరిపురపు కొండయ్య నాగేష్ ప్రసాద్, దావీదు, వంశీ, గుంజి వెంకటేశ్వర్లు, దూదేకుల కాశీం, సిద్దు, మూడోసిద్దు, తదితర 20 వైసీపీ కుటుంబాల వారు పార్టీలో చేరినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

12న ఈవీఎంల ర్యాండమైజేషన్

కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4: ఈవీఎం ల ర్యాండమైజేషన్ ప్రక్రియను ఈనెల 12వతేదీన ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను గురువారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని అసెంబ్లీ, ఆ తర్వాత రోజున అసెంబ్లీ నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాడ్లు పంపాలని అధికారులను ఆదేశిం చారు. అందుకోసం వీటిని వేరు చేసే ప్రక్రియను వీడియో రికార్డ్ చేయా లని చెప్పారు. నియోజకవర్గాల వారీగా వీటి కేటాయింపులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఈవీఎంల మేనేజ్‌మెంట్ సిస్టం అప్లికేషన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ర్యాండమైజేషన్ చేసిన ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో నియో జకవర్గాల్లోని స్ట్రాంగ రూములకు తరలి స్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

చేరికల హోరు - సైకిల్ జోరు

• వైసీపీని వీడి టీడీపీకి జై కొడుతున్న క్షేత్రస్థాయి నాయకులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 4 : రోజురోజుకు వైసీపీని వీడి టీడీపీలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. గ్రామాలకు గ్రామాలే వైఎస్‌ఆర్‌సీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలోకి వెళుతున్నాయి. తాజాగా గిద్దలూరు మండలం ఉయ్యాల వాడకు చెందిన 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పట్టణంలోని చీతిరాల కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షుడు మర్రెబోయిన చంద్రశేఖర్‌యాదవ్, సచివాలయ కన్వీనర్ చెన్నబోయిన శ్రీనివాసులు, జాయింట్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షులు కొమ్మునూరి దానం ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరగా వీరికి గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువా మెడలో వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ దుష్టపాలన నుంచి రాష్ట్రాన్ని కాపడడమే కూటమి లక్ష్యమని అన్నారు. అధికారంలోకి రాగానే గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామ న్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపాల కృష్ణయాదవ్, టీడీపీ నాయ కులు బైలడుగు బాలయ్య తదితరులు ఉన్నారు.

వైసీపీకి ఇద్దరు మాజీ సర్పంచ్‌లు గుడ్‌బై

తంబళ్లపల్లి పంచాయతీ పరిధిలోని తంబళ్లపల్లె, త్రిపురాపురానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచులు వైజా కృష్ణారెడ్డి, గుమ్మళ్ల చిన్నవెంకటయ్య ఆధ్వర్యంలో ఇద్దరు వార్డు సభ్యులు గుండ్రెడ్డి లక్ష్మీ, మామిళ్ల నాగలక్ష్మీతోపాటు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి వీరికి పార్టీ కండవ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షు లు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు పంకు రాజగోపాల్, పందనబోయిన నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు



పచ్చకండువా కప్పుకున్న నేతలు

రాజుపాలెం నుండి 30 కుటుంబాలు

కొమరోలు మండలం రాజుపాలెం పంచాయతీ పరిధి లోని బి.వెంకటాపురం గ్రామానికి చెందిన 30 కుటుంబా లు గోడి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టోపి శ్రీను, జనార్ధన్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

బేస్తవారపేట : ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో బేస్తవారపేటలో 4వ రోజు పర్యటనలో భాగంగా పెద్దఓబినేనిపల్లె గ్రామం నుంచి ప్రారంభించి రెట్లపల్లె, చిన్న ఓబినేనిపల్లె, సలకలవీడు, కలగోట్ల, మల్లాపురం, నేకునాంబాద్, చింతలపాలెం, గొట్లమిట్ల, చెట్టిచెర్ల, పూసలపాడు, పందిళ్లపల్లె, మోక్షగుండం, పెంచికలపాడు, జే.బి.కేసురం, బేస్తవారపేట గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు ప్రతి నెల రూ.1500, తల్లికి వందనం ద్వారా ప్రతి ఇంటిలో ఎంత మంది చదువుకున్న వారందరికి ఒక్కొక్కరికి ఏటా రూ15వేలు అందిస్తామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, వెన్నా కృష్ణారెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, సోరెడ్డి మోహన్‌రెడ్డి, తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని పెద్దఓబినేనిపల్లి గ్రామంలో వైసీపీని వీడి వైస్ సర్పంచ్ బండ్లమూడి కాశయ్య, పెద్ద వెంకటయ్య, చిన్న వెంకటయ్య, నాగం తిరుపతయ్య, నాగం రమేష్, మేకల సుబ్బయ్య, నాగం వెంకటేశ్వర్లు, చింతం పెద్ద అంకయ్య, ఎరదేశి బాలచెన్నయ్య, మున్నంగి దానంతో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి

గుంటూరు, ఏప్రిల్ 4 : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఐపీఎస్ లపై బదిలీ వేటు వేసిన వారి స్థానంలో కొత్తగా ఐపిఎస్ అధికారులను నియమించింది. గుంటూరు రేంజ్ ఐజీగా సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని నియమించారు. అదేవిధంగా పలనాడు ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్ ను నియమించారు. ప్రకాశం ఎస్పీగా గరుడ్ సుమిత్ సునీల్, నెల్లూరు ఎస్పీగా కె ఆరిఫ్ హఫీజ్ లను నియమించారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే విధుల్లో చేరాల్సిందిగా ఆదేశించారు. గుంటూరు రేంజిలో నియమితులైన నలుగురు ఐపీఎస్ అధికారుల్లో ముగ్గురు గతంలో గుంటూరులో పనిచేసిన వారే కావడం గమనార్హం..



ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సర్వ శ్రేష్ఠ త్రిపాఠి

రేంజి ఐజీగా నియమితులైన సర్వ శ్రేష్ఠ త్రిపాఠి 2006 బ్యాచ్ కి చెందిన ఐపిఎస్ అధికారి. ఆయన గతంలో 2016 నుంచి 2018 ఎన్నికల ముందు వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా రెండేళ్ళు విధులు నిర్వహించారు. 2019లో డిప్యూటేషన్‌పై ఆయన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లారు. 2021లో ఆయన డిఐజీగా పదోన్నతి పొందారు. మూడు సంవత్సరాల డిప్యూటేషన్ పూర్తి చేసుకుని ఉత్తరప్రదేశ్ నుంచి ఆయన తిరిగి ఏపీకి వచ్చారు. అప్పటినుంచి ఆయన డిజిపి కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఆయనకు ఐజిగా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన విధి నిర్వహణలో ఆచితూచి వ్యవహరిస్తుంటారు. వివాదాలకు దూరంగా అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పోలీసింగ్ నిర్వహిస్తుంటారు. గతంలో ఆయన గుంటూరు అర్బన్ ఎస్పీగా టిడిపి ప్రభుత్వ హయంలో పనిచేశారు. ఆ సమయంలో రాజకీయంగా ఆయనపై పెద్దగా ఒత్తిళ్లు లేకపోవడంతో సజావుగా విధులు నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన ఐజీ త్రిపాఠి

రేంజ్ ఐజీగా నియమితులైన సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఐజీని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, పలువురు అదనపు ఎస్పీలు, డిఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో శాంతి భద్రతలకు సంబందించిన వివిధ అంశాలను ఎస్పీ తుషార్ డూడీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు పలు సూచనలు చేసారు.

మార్టూరులో రెండిళ్లల్లో చోరీ

మార్టూరు, ఏప్రిల్ 4 : మార్టూరులో విద్యానగర్‌లో బుధవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. రెండిళ్లల్లో ఒకటి ఎంఈవో టి టీ కిషోర్‌బాబుది. కిషోర్‌బాబు ఎంఈవోగా, అతని భార్య ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఒంగోలులో పనిచేస్తున్నారు. వారు ఒంగోలులోనే ఉంటూ వారానికోసారి విద్యానగర్‌లోని సొంత ఇంటికి వచ్చి వెళ్తుంటారు. గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటి బయట గేటుకు ఉన్న మూడు తాళాలను పగులగొట్టారు. అనంతరం ఉత్తరం వైపున ఉన్న ఇంటి తలుపులను కొంచెం తొలగించి ఇంటిలోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న రెండు కిలోల వెండి వస్తువులను ఎత్తుకుపోయారు. బీరువాలో ఉన్న వస్త్రాలను చిందరవందర చేశారు. వెండి వస్తువుల విలువ రూ.80వేలు ఉంటుందని కిషోర్‌బాబు పోలీసులకు తెలిపారు. గురువారం ఉదయం ఇంటిని శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి దొంగతనం జరిగిన విషయాన్ని గ్రహించి కిషోర్ బాబుకు సమాచారం అందించారు. అదే ఇంటికి సమీపంలో ఉంటున్న గనిపిశెట్టి భాస్కర్‌బాబు ఇంట్లో కూడా దొంగతనం జరిగింది. బీరువాలో ఉన్న 11 గ్రాముల విలువైన మూడు బంగారు వస్తువులు, రూ.5వేల నగదును ఎత్తుకుపోయారు. రెండు నెలలుగా భాస్కర్‌బాబు కుటుంబం వ్యక్తిగత కారణాలతో మద్దిసీతా దేవినగర్‌లోని మరో ఇంటిలో ఉంటున్నారు. ఈ రెండు ఇళ్లల్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐలు సైదా, మహబూబ్‌బాషా ఇళ్లను పరిశీలించారు. అనంతరం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

చేరికల హోరు- సైకిల్ జోరు

● వైసీపీని వీడి టీడీపీకి జై కొడుతున్న క్షేత్రస్థాయి నాయకులు ● పచ్చకండువా కప్పి ఆహ్వానిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి


తంబళ్లపల్లి, త్రిపురాంతకం నుంచి పచ్చకండువా కప్పుకున్న నేతలు


వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఉయ్యాలవాడకు చెందిన 300 కుటుంబాలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 4 : రోజురోజుకు వైసీపీని వీడి టీడీపీలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. గ్రామాలకు గ్రామాలే వైఎస్‌ఆర్‌సీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలోకి వెళుతున్నాయి. తాజాగా గిద్దలూరు మండలం ఉయ్యాలవాడకు చెందిన 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పట్టణంలోని చీతిరాల కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షుడు మర్రెబోయిన చంద్రశేఖర్‌యాదవ్, సచివాలయ కన్వీనర్ చెన్నబోయిన శ్రీనివాసులు, జాయింట్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షులు కొమ్మునూరి దానం ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరగా వీరికి గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువా మెడలో వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ దుష్టపాలన నుంచి రాష్ట్రాన్ని కాపడడమే కూటమి లక్ష్యమని అన్నారు. అధికారంలోకి రాగానే గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామ న్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపాల కృష్ణయాదవ్, టీడీపీ నాయ కులు బైలడుగు బాలయ్య తదితరులు ఉన్నారు.

వైసీపీకి ఇద్దరు మాజీ సర్పంచ్‌లు గుడ్‌బై

తంబళ్లపల్లి పంచాయతీ పరిధిలోని తంబళ్లపల్లె, త్రిపురాపురానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచులు వైజా కృష్ణారెడ్డి, గుమ్మళ్ల చిన్నవెంకటయ్య ఆధ్వర్యంలో ఇద్దరు వార్డు సభ్యులు గుండ్రెడ్డి లక్ష్మీ, మామిళ్ల నాగలక్ష్మితోపాటు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి వీరికి పార్టీ కండవ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు పంకు రాజగోపాల్, పందనబోయిన నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు

రాజుపాలెం నుండి 30 కుటుంబాలు

కొమరోలు మండలం రాజుపాలెం పంచాయతీ పరిధిలోని బి.వెంకటాపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు గోడి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టోపి శ్రీను, జనార్ధన్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

బేస్తవారపేట : ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో బేస్తవారపేటలో 4వ రోజు పర్యటనలో భాగంగా పెద్దఓబినేనిపల్లె గ్రామం నుంచి ప్రారంభించి రెట్టపల్లె, చిన్న ఓబినేనిపల్లె, నలకలవీడు, కలగొట్ల, మల్లాపురం, నేకునాంబాద్, చింతలపాలెం, గొట్లమిట్ల, చెట్టిచెర్ల, పూసలపాడు, పందిళ్లపల్లె, మోక్షగుండం, పెంచికలపాడు, జే.బి.కేసురం, బేస్తవారపేట గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు ప్రతి నెల రూ.1500, తల్లికి వందనం ద్వారా ప్రతి ఇంటిలో ఎంత మంది చదువుకున్న వారందరికి ఒక్కొక్కరికి ఏటా రూ15వేలు అందిస్తామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, వెన్నా కృష్ణారెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, సోరెడ్డి మోహన్‌రెడ్డి, తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని పెద్దఓబినేనిపల్లి గ్రామంలో వైసీపీని వీడి వైస్ సర్పంచ్ బండ్లమూడి కాశయ్య, పెద్ద వెంకటయ్య, చిన్న వెంకటయ్య, నాగం తిరుపతయ్య, నాగం రమేష్, మేకల సుబ్బయ్య, నాగం వెంకటేశ్వర్లు, చింతం పెద్ద అంకయ్య, ఎరదేశి బాలచెన్నయ్య, మున్నంగి దానంతో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఆర్‌వో తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌వో శ్రీలేఖ

త్రిపురాంతకం, ఏప్రిల్ 4: మండలంలోని మేడపి టోల్‌ప్లాజా వద్ద సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును ఎర్రగొండపాలెం ఆర్‌వో పి.శ్రీలేఖ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడారు. వాహనాల తనిఖీని పరిశీలించారు. ఎవరెవరికి, ఎంత మందికి డ్యూటీలు వేస్తున్నారు, ఎంత సమయం విధుల్లో ఉంటున్నారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. అనంతరం త్రిపురాంతకం జడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్‌వో వెంట తహసీల్దారు రామకృష్ణ శివప్రసాద్, ఎస్సై సాంబశివయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌వో పరిధిలోనే పరిష్కరించాలి

గిద్దలూరు, ఏప్రిల్ 4 : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఎన్నికల విధుల మినహాయింపులు రిటర్నింగ్ ఆఫీసర్ పరిధిలోనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి ఎస్.హెచ్.కబీర్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. 6 నెలల్లో రిటైరయ్యే ఉద్యోగులకు, పాలు ఇచ్చే తల్లులకు, కేన్సర్ బాధితులకు, వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మినహాయింపు ఇవ్వాలని ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు చేసినా కొందరికి ఎన్నికల విధులు వచ్చాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో బాధిత ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. బాధిత ఉపాధ్యాయులు ఒంగోలు వెళ్లి వీఆర్‌వోను కలువాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఉన్న దృష్ట్యా రిటర్నింగ్ అధికారితో విచారించి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

నరసింహులుకు నివాళులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 4 : మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోటా నరసింహులుకు పలువురు నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. బుధవారం సాయంత్రం గుండెపోటుతో ఆయన మృతిచెందారు. తిమ్మాపురం గ్రామంలోని నివాసం వద్ద టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కోటా నరసింహులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ పసుపుల మల్లేశ్వరరావు ఉన్నారు. ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిద్దలూరు వైసీపీ అభ్యర్థి కుందూరు నాగార్జునరెడ్డితోపాటు ఆయన భార్య కల్పనరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, వైసీపీ నాయకులు పరుచూరి నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గురువారం సాయంత్రం గ్రామంలో కోటా నరసింహులు అంత్యక్రియలు జరిగాయి.

సాగర్‌నీటి కోసం పడిగాపులే..!


సాగర్‌నీటికోసం పడిగాపులు కాస్తున్న ప్రజలు

పొదిలి, ఏప్రిల్ 4 : ఎప్పుడో వచ్చే సాగర్ తాగునీటి కోసం ప్రజలు పనులు మానుకొని పడిగాపులు కాయల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని కెనరాబ్యాంక్ సమీపంలోని ఓ కొళాయి వద్ద తాగునీటి సరఫరా చేస్తారని తెలిసి గురువారం మధ్యాహ్నం నుంచి పనులు మానుకొని బందెడు నీటికోసం ప్రజలు ఈ విధంగా ఎదురు చూస్తుకూర్చున్నారు. ఇళ్లలో తాగునీరు లేక రోజు మినరల్ వాటర్ కొనలేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నీటి సరఫరా చేసే సమయం తెలియజేయాలని వారు కోరుతున్నారు. పొదిలిలో ఎప్పుడు నీటి కష్టాలు తీరుతాయోనని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గంధం వీడదు- మురుగు కదలదు

● కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
● దోమల ఉధృతితో ప్రజల అసవస్థలు


బస్టాండ్ సమీపంలో కాలువల్లో వ్యర్థాలు

కంభం, ఏప్రిల్ 4 : కంభం మేజర్ పంచాయతీలో పలుచోట్ల మురుగునీటి కాలువల్లో మట్టి, రాళ్లు అడ్డుపడుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడే వ్యర్థాలతో మురుగునీరు నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. విక్టరీ సినిమా హాలు పక్కన ఉండే మురికి కాలువ, దానికి ఎదురుగా ఉండే కాలువ పూడ్చివేయడంతో మురికి నీరు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో మోకాలి లోతుకు పైగా మురికినీరు, ఇతర వ్యర్థపదార్థాలు నిలిచిపోయాయి. కంభం మెయిన్ బజార్, సంఘ వీధి, అర్బన్‌కాలనీలో పలుచోట్ల మురుగునీరు వెళ్లే దారిలేక కాలువలు నిండి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో పాదాచారులు, వాహనదారులు ఈ దారుల్లో వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దోమల, పందులకు, హానికర కీటకాలకు ఈ ప్రాంతాలు నిలయాలుగా మారా యి. ఎక్కడికక్కడ నిలిచిపోయిన మురికినీరు సక్రమంగా వెళ్లేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


విక్టరీ సినిమాహాల్ వద్ద మురుగునీరు

ప్రజాసేవ చేసే వారినే గెలిపించండి

కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి


మార్కాపురంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: ప్రజాసేవ చేసేవారినే గెలిపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 12వ వార్డులో 'ఇంటింటికి మన కందుల' ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తాను 22 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో ప్రజాసేవలోనే ఉన్నానన్నారు. టీడీపీతోనే మార్కాపురం జిల్లా ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కందుల విఘ్నేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి కీలక నేతల షాక్

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలోని వైసీపీ కీలక నేతలు షేక్ ఆదాం సాహెబ్, మయూరీ కాశీం, షేక్ ఇస్మాయిల్, షేక్ మహ్మద్ అలీ, సయ్యద్‌మాబు, హుస్సేన్ పీరా, గౌస్ మొదిన్, ఇండ్లా రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా తనకు, మాగుంట శ్రీనివాసరెడ్డికి మద్దతు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కొన్ని రోజుల నుంచి ప్రతి రోజు టీడీపీలో చేరికలు ఉంటున్నాయని ఇదే ఒరవడి ఎన్నికల వరకు కొనసాగుతుందన్నారు.

కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నే గ్రామంలో గురువారం వైసీపీని వీడి మార్కాపురం ఉమ్మడిపార్టీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో 20 కుటుంబాలు చేరాయి. 'ఇంటింటికి మన కందుల' కార్యక్రమం నిర్వహించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కందుల నాయకత్వం నచ్చి, చంద్రబాబు వంటి అనుభవం కలిగిన నేత వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. పార్టీలో చేరినవారిలో శెట్టిపల్లి కాశయ్య, వెంకటేశ్వర్లు, సిరిపురపు కొండయ్య నాగేష్, ప్రసాద్, దావీదు, వంశీ, గుంజి వెంకటేశ్వర్లు, దూదేకుల కాశీం, సిద్దు, మూడోసిద్దు, తదితర 20 వైసీపీ కుటుంబాల వారు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.


సల్లోడి పేటలో జయకేతనం చూపుతున్న నారాయణరెడ్డి

పొదిలి : మండలంలోని సల్లోడివారిపాలెం గ్రామం లో వైసీపీని వీడి బుధవా రం రాత్రి టీడీపీ పలువురు టీడీపీ లో చేరారు. 'ఇంటింటికి మన కందుల' కార్యక్ర మంలో భాగంగా కందుల నారాయణరెడ్డి, తనయుడు విఘ్నేష్‌రెడ్డి సమక్షంలో యరగొర్ల యలమంద, యరగొర్ల వెంకటేష్, కనకం చంటి, వేల్పుల శ్రీనివాసులు, వేల్పుల రమణయ్య, బండారు వెంకటకోటయ్య, వేల్పుల రమణమ్మ, పెమ్మని రమేష్, బండారు తిరుపతమ్మ, యర్రగొర్ల ఓబులేస్, రత్తమ్మ, వెంకటేశ్వర్లుతోపాటు 20కుటుంబాలు చేరాయి. వారిని కందుల నారాయణరెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జనసేన, బీజేపీలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థిగా తాను మార్కాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కనుక ప్రతి ఒక్కరూ తనను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు కాటూరి పెదబాబు, రైతు సంఘ నాయకులు ఆవులూరి యలమంద తదితరులు ఉన్నారు. గురువారం ఆముదాలపల్లి గ్రామంలో కందుల విఘ్నేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి కందుల కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ తన తండ్రి కందుల నారాయణరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వ స్వార్థంతో అవ్వతాతల అవస్థలు


పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు వికలాంగులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 4: జగన్ ప్రభుత్వ కుచిత ఆలోచనలతో పింఛన్ తీసుకుంటున్న అవ్వతాతలు అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని 21 సచివాయాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయ ఉద్యోగులు ప్రారంభించారు. పెన్షన్ల కోసం అవ్వతాతలు బుధవారం ఉదయం నుంచి సచివాలయాల వద్ద పెన్షన్ నగదు కోసం నిరీక్షించారు. మండలంలోని దరిమడుగు సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం 6 గంటలకు కూడా కొద్దిమందికి మాత్రమే పెన్షన్ నగదును అందజేశారు. ఎండ తీవ్రత పగటిపూట అధికంగా ఉండడంతో వృద్ధులు సచివాలయాల వద్ద సచివాలయ ఉద్యోగులు ఎటువంటి వసతి ఏర్పాటు చేయకపోవడంతో తీవ్రఅవస్థలు పడ్డారు. సచివాలయం వద్ద అవ్వతాతల కోసం షామియానా, కుర్చీలు, మంచినీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉండగా దరిమడుగు, జోడపాడు, పెద్ద నాగులవరం, రాయవరం గ్రామ సచివాలయాలతో పాటు మరికొన్ని సచివాయాలలో ఎటువంటి వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో పెన్షన్ తీసుకునేందుకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు ఎండలోనే పెన్షన్ నగదు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. సంబంధిత అధికారులు సచివాలయాల వద్ద పెన్షన్ నగదు కోసం వచ్చే లబ్దిదారులకు తాగునీటి, షామియానా, కుర్చీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పురుగుమందుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

అనుమతిలేని నిల్వల అమ్మకాలు నిలిపివేత


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీనివాసరావు

త్రిపురాంతకం, ఏప్రిల్ 4: త్రిపురాంతకంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. బుధవారం తనిఖీలకు వచ్చిన అధికారులకు దుకాణాల షట్టర్లు మూసివేసి దర్శనమిచ్చాయి. దీంతో నోటీసులు అంటించి సీజ్ చేసి గురువారం తనిఖీలు చేశారు. ఈసందర్భంగా డీఏవో ఎస్.శ్రీనివాసరావు సిబ్బంది 11 దుకాణాలలో పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ 11 దుకాణాల్లో కలిపి అనుమతులు లేని రూ.3,18,488 విలువైన 209 లీటర్ల పురుగుమందులను అమ్మకాలను నిలిపేసినట్లు తెలిపారు. రైతులందరూ అనుమతులు ఉన్న దుకాణాల్లో మాత్రమే ఎరువులు పురుగుమందులను కొనుగోలు చేయాలన్నారు. బిల్లులను అడిగి తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో ఏవోలు డి.జవహర్‌నాయక్, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

ఆదరించండి...అండగా ఉంటాం

టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట, ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 4 : ఎన్నికల్లో తమను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, దర్శి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిడాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రవథమంగా దర్శిపట్టణంలో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉండి అన్ని రకాలుగా ఆదుకుంటామని తెలిపారు. ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు మరిచి పోలేని వన్నారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ నేను మీ ఇంటి ఆడపడుచును, ఈ జిల్లా ఆడబిడ్డను,పక్కనున్న పల్నాడు జిల్లా కోడలని. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనుమరాలిని.దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య కుమార్తెను. టీడీపీ అధినేత చంద్రబాబు తనకు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించారు. ఈఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని, తనను అత్యధిక మెజారితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీకి ఘనవిజయం అందించాలని కోరారు. అద్దంకి, ఒంగోలు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్‌రియాజ్ మాట్లాడుతూ ఇక్కడ కార్యకర్తల జోష్ చూస్తుంటే ఉమ్మడి అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోగినేని కోటేశ్వరరావు, జిల్లా తెలుగుయువత నాయకులు మాగుంట రాఘవరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి,దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య వైస్ చైర్మన్ జి.స్టీవెన్. దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నెమలయ్య, ఎన్. శివకోటేశ్వరరావు, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు యాదగిరి వాసు, తెలుగు మహిళా నాయకురాలు ఎన్. శోభారాణి ,నియోజకవర్గ టీడీపీ, జనసేన ,బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

వైభవంగా ధ్వజస్తంభ కలశ ప్రతిష్ఠ


ప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరైన భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నాలుగు ప్రాకార గోపురాల కలశ స్థాపన, నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేక కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా భక్తజన రంజకంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీపతి అనంతాచార్యులు యంత్ర స్థాపన, రత్న స్థాపన, శిఖర ప్రతిష్ఠ, నూతన ధ్వజ ప్రతిష్ఠ, కుంభప్రోక్షణ, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామికి వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. భక్తుల చెన్నకేశవ నామస్మరణ మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో ఆధ్యాత్మిక శోభతో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠ సందర్భంగా ఇళ్లల్లో ఆడపడుచులను పిలిచి పసుపు, కుంకుమ, చీరెలు పెట్టారు. గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నాలుగు మాడ వీధుల్లో అన్నప్రసాద వితరణ కల్పించారు.

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

గిద్దలూరు, ఏప్రిల్ 4 : పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన దేవాలయంలో అయ్యప్పస్వామి, వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం అయ్యప్పస్వామితోపాటు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేక పూజల నడుమ ప్రతిష్ఠించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కటకం రామకృష్ణయ్య కుటుంబీకులు అయ్యప్పస్వామి ప్రతిష్ఠకు దాతలుగా వ్యవహరించారు. వివిధ దేవతామూర్తుల విగ్రహాలకు ఆయా దాతల కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బీవీ.రంగారావు, కటకం ట్రస్టు చైర్మన్ కటకం నాగేశ్వరరావు, దేవస్థాన కమిటీ కార్యదర్శి ఆర్.ఉమామహేశ్వరరావు తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి అంటేనే టీడీపీ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక 11వ వార్డులో గురువారం రాత్రి ఇంటింటికి కందుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల రామిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రాష్ట్ర ప్రజలు అన్ని రకాలుగా దెబ్బతిన్నారని, స్వచ్ఛమైన పాలన కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. తెలుగుదేశం, జనసేన బీజేపీ కూటమిని ఆదరించాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన టెక్నో కల్చరల్ ఫెస్ట్


బహుమతులు అందుకున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: స్థానిక జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ గురువారం ముగిసింది. కార్యక్రమంలో 450 టెక్నికల్ పేపర్లు, 120 పోస్టర్ ప్రెజెంటేషన్లు, 40 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ రాజాబాబు తెలిపారు. వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ మస్తానయ్య, కన్వీనర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 4: చట్టలపై అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు న్యాయవాది బ్రహ్మాజి అన్నారు. వెల్‌నెస్ లా కళాశాలలో గురువారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ.. విద్యార్థులు న్యాయశాస్త్రంపై అవగాహన కలిగి నూతన చట్టాలను కూడా ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతిమా సునీల్, ఏవో రమేష్ నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపై కేసు నమోదు

మార్కాపురం రూరల్ : వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ గురువారం రాత్రి తెలిపారు. ఆదివారం రోజున వైసీపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పట్టణంలోని తర్లుబాడు రోడ్డులోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి ఎస్‌వీకేబీ కళాశాల వరకు ఇంచుమించు 1500 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోసం ఎన్నికల అధికారి అనుమతి తీసుకోలేదు. అనంతరం కార్యకర్తలకు ఆత్మీయ విందును కూడా ఏర్పాటు చేశారు. షుమారు 3 వేల మందికి విందుభోజనం కూడా ఏర్పాటు చేసినట్లు ఎన్నికల స్క్వాడ్ టీం పరిశీలించింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ- మోటారు సైకిల్ ఢీకొని ఒకరి మృతి


గిద్యోన్ (ఫైల్‌ఫోటో)

పొదిలి, ఏప్రిల్ 4 : లారీ మోటార్‌సైకిల్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నందిపాలెం గ్రామానికి చెందిన దాసరి గిద్యోను, రవి అనే ఇద్దరు వ్యక్తులు పట్టణంలో రెండవ ఆట సినిమా చూసి స్వగ్రామం నందిపాలెం బైక్‌పై వెళుతున్నారు. ఆక్రమంలో కాశిరెడ్డి టిఫిన్ సెంటర్ సమీపంలోకి వచ్చేసరికి లారీ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో దాసరి గిద్యోను తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో గిద్యోను (24)మృతి చెందాడు. మృతున్ని పోస్ట్‌మార్టం కోసం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రవి అనే మరో వ్యక్తికి కుడికాలికి స్వల్పగాయమైంది. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ కోటయ్య తెలిపారు.

తీవ్రమైన ఎండలు.. ప్రజల బెంబేలు

● చలివేంద్రాలు లేక ప్రజల అవస్థలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 4: మార్కాపురం ప్రాంతంలో వారం రోజుల నుంచి ఎండల తీవ్రత ఎక్కువైంది. మధ్యాహ్నం ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 43 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. వేసవితాపానికి చిన్నపిల్లలు వృద్ధులు బయటకు రావాలంటే హడలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చల్లని నీటికోసం మట్టి కుండలను కొనుగోలు చేసుకొని తీసుకెళ్తున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉండడంతో స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు ఎటువంటి చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలు కొంత ఇబ్బందులకు గురవుతున్నారు. గత సంవత్సరంలో దోర్నాల బస్టాండ్ కూడలి, కోర్టు సెంటర్, గడియార స్తంభం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద ప్రజల దాహార్తిని తీర్చడం కోసం స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈ ఏడాది అవికూడా లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ముఠా, రిక్షా, కార్మికులు చెట్లకింద సేద తీర్చుకుని ఉపశమనం పొందుతున్నారు. ఏడాది పట్టణంలో తాగునీటి సమస్య కూడా ఉత్పన్నం కావడంతో ప్రజలకు సక్రమంగా నీరు అందే పరిస్థితి కూడా లేదు. అత్యవసరమైన పనులైతే తప్ప సాధారణంగా ప్రజలు ఎండ తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్నం సమయంలో బయట రోడ్లపై సంచరించవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు.


ఉగ్రను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఉగ్ర

వెలిగండ్ల, ఏప్రిల్ 4 :మండలంలోని కవ్వంపాడు గ్రామ శివాలయంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. వారికి వేద బ్రాహ్మణులు ఘన స్వాగతం పలికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ శివాలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం గ్రామానికి శుభపరిణామని, దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. శివుని కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్లు, చిలకల కృష్ణారెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, సాన జయపాల్ రెడ్డి, ముక్కు వెంకట శ్రీరాములు, బీరం వెంకటేశ్వరరెడ్డి, గుంటక జయరామి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 4: నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండలంలోని నందనవనం గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలను విచారించారు. నందనవనం గ్రామంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మహిళలు మంచినీటి కోసం, రైతు కుటుంబాలు సాగునీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యలను డాక్టర్ ఉగ్రకు చెప్పుకుని వాపోయారు. కనిగిరి ప్రాంత ప్రజలు అత్యధిక మెజర్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమానికి వచ్చిన డాక్టర్ ఉగ్రకు గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ మండలపార్టీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, నందనవనం గ్రామపార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 9వవార్డు బోయపాలెంలో పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ఫిరోజ్,జిలాని, జేపిరాజు, తిరుపాలు, చిలకపాటి లక్ష్మయ్య, నజిముద్దీన్, జంషీర్,జాని, పందు, తెలుగుమహిళలు కరణం అరుణ, షేక్‌వాజిదాబేగం, దొరసాని, సమీరా, ఫాతిమా, తులసి, నారాయణమ్మ, అమ్ములమ్మ, వెంకటలక్ష్మమ్మ, కే నీరజ తదితరులు పాల్గొన్నారు.


పెదరాజుపాలెంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

పామూరు,(సీఎస్‌పురం) ఏప్రిల్ 4 : ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నివిధాలుగా సర్వనాశనం చేసిందని మాజీ ఎంపీపీ తోడేటి పెద అల్లూరయ్య తెలిపారు. మండలంలోని పెదరాజుపాలెం గ్రామ పంచాయతీలో చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై గురువారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా ఉగ్రలను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీ చిన మాలకొండయ్య, దాసరి మల్లి కార్జున, రామిశెట్టి వెలిగొండయ్య, కే వెంకటకొండయ్య, ముప్పాళ్ళ నరసింహరాజు, బండారు మల్లికార్జున, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్ర వెంటే మేమూ..

టీడీపీలో చేరుతున్న ముస్లిం కుటుంబాలు
అడ్డుకునేందుకు
వైసీపీ ఇఫ్తార్ విందులతో ఆహ్వానాలు

కనిగిరి, ఏప్రిల్ 4: ముస్లిం కుటుంబాలన్నీ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వెంటే మేమూ అంటూ వైసీపీని వీడి పెద్ద ఎత్తున భారీగా పార్టీలో చేరుతున్నారు. దీంతో వైసీపీ నాయకుల్లో ఆందోళన మొదలైంది. దీంతో ఎలాగైనా ముస్లిం కుటుంబాల చేరికలను అడ్డుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అందుకోసం ముస్లిం కుటుంబాలను ఆకట్టుకునేందుకు రంజాన్ పండుగను అవకాశంగా తీసుకుని ఉపవాసదీక్షలో ఉన్న ముస్లిం కుటుంబాలకు ఇఫ్తార్ విందులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తంతు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మొదలైంది. రంజాన్ మాసంలో ఎవరూ ఆహ్వానించినా, పేద, ధనిక తేడా అనేదే లేకుండా వారు శక్తి కొలది ఏర్పాటు చేసిన విందునే సంతృప్తిగా ఆ అల్లా సమకూర్చినట్లుగా భావించి ముస్లింలు భుజిస్తారు. కానీ వైసీపీ నాయకులు మాత్రం ఇఫ్తార్ విందును కూడా రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూడటం సిగ్గుచేటు. దీంతో ముస్లిం కుటుంబాల్లో ఒకింత అసహనాన్ని కల్పిస్తున్నట్లుగా నగరంలో చర్చ నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు విందు కార్యక్రమాలను ఉపయోగించుకుంటున్నా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.


వైసీపీని వీడి పెద్దఎత్తున టీడీపీలో చేరిన ముస్లిం కుటుంబాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

వైసీపీని వీడిన పామూరు ముస్లింలు

పామూరు, ఏప్రిల్ 4: పాదయాత్రలో ముస్లింలకు అండగా ఉంటానని కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లను దండుకొని గద్దెనెక్కిన జగన్‌రెడ్డి, ముస్లింలకు అమలౌతున్న పథకాలను రద్దు చేసి ద్రోహం చేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆరోపించారు. పామూరు పట్టణానికి చెందిన పలువురు ముస్లిలు, టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు షేక్ గౌస్‌బాష, షేక్ ఖాజారహంతుల్లా ఆర్‌ఆర్ రఫీ, ఫత్తుమస్తాన్, మాచర్ల రహిమాన్‌ల ఆధ్వర్యంలో 68 ముస్లిం కుటుంబాలు ప్రముఖ వ్యాపారవేత్త షేక్ చిన మస్తాన్‌తో కలిసి వైసీపీ నీ వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో గురువారం చేరారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారందరికి కండువాలు కప్పి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి ఉగ్ర మాట్లాడుతూ మైనార్టీలకు టీడీపీతోనే భద్రత, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో షాదీఖానాల నిర్మాణానికి నిధులు, హజ్‌యాత్ర చేయడానికి ప్రభుత్వం తరుపున సబ్సిడీ, రంజాన్ తోఫా, బ్యాంకుల ద్వారా రుణాలు, దుల్హాన్ పథకాలతో పాటు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు టీడీపీపాలనలో అందాయన్నారు. ముస్లింలకు అన్ని విధాలుగా తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌరవ అధ్యక్షులు షేక్ ఖాజారహంతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, యువ పారిశ్రామిక వేత్త యారవ శ్రీనివాసులు, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ గౌస్‌బాష, ఆర్ ఆర్‌రఫీ, ముబీనా మౌలాలి, పులి నాయబ, ఫత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్‌లు ఉన్నారు.


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు కాపు సంఘం నాయకులు

ఉగ్ర సమక్షంలో వివిధ వర్గాలు చేరిక

పామూరు, ఏప్రిల్ 4 : టీడీపీలో చేరికల పరంపర జోరుగా కొనసాగుతున్నది. పామూరు నుంచి ఒకే రోజు గురువారం వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 120 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. పామూరు ఆకులవీధి కాపు సంఘం నాయకులు పోతురాజు వెంకటరత్నం, గద్దె శేషు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి బేషరుతుగా టీడీపీలో చేరగా వారందరికీ ఉగ్ర టీడీపీ కండువాలతో స్వాగతం పలికి పార్టీలో చేర్చుకొన్నారు. టీడీపీలో చేరిన వారిలో పామూరు బులియన్‌మర్చంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పోతురాజు వెంకటరత్నం, గద్దె శేషు, ఆవుల ఆంజనేయులు, కటికం మోహన్‌రావు, గద్దె సుబ్బయ్య, మామిడిశెట్టి బాలసిద్దయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతురాజు వెంకట్రావు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, బి. నరసయ్య ఎస్. సాంబయ్య, ఆకుపాటి రమణయ్య ఉన్నారు.

పథకాలతో మహిళలకు ప్రయోజనం

పామూరు : చంద్రబాబు ప్రవేశపెట్టిన మహిళాశక్తి సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సత్యనారాయణ తెలిపారు. ఉగ్ర ఆదేశాల మేరకు పట్టణంలోని కరెంటు ఆఫీసు కాలనీలో బాబు ష్యూరిటీ - భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్‌కమిటీ ఇన్‌చార్జి తిరుపతయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి


కొత్తపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పీసీపల్లి,ఏప్రిల్4: అన్ని రంగాల్లో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని చౌటగోగులపల్లి, గుంటుపల్లి, కొత్తపల్లి, మలినేనివారిపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వీరపనేని పెద్దన్న, పువ్వాడి నాగరాజు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మన్నం వెంకటేశ్వర్లు, ముప్పవరపు మాచర్లు, మడక గురుబ్రహ్మం, వీరాంజనేయులు, ముప్పూరి మాల్యాద్రి, నెలకుర్తి మాల్యాద్రి, వీరపనేని నానిబాబు, వీరనారాయణ, వెంకట్రావు, ఎబినేజరు, రాయుడు, శ్రీను, శ్రీరాములు, సర్పంచ్ కనపర్తి శాంసన్, నాగోతు మాలకొండయ్య, పల్లా మల్లికార్జున, చినమాలకొండయ్య, పుల్లారెడ్డి, నాగోతు శ్రీనివాసులు, అంకిరెడ్డి, నెలకుర్తి రమణయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మద్యం కోసం బారులు తీరిన మందుబాబులు


మద్యం బాటిళ్ల కోసం బారులు తీరిన మందుబాబులు

పీసీపల్లి, ఏప్రిల్ 4 : వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి దద్దాల నారాయణ పీసీపల్లిలో గురువారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సమావేశానికి కనిగిరి, పీసీపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి ఓటర్లను ఆయా గ్రామాల వైసీపీ నాయకులు ఆటోలు, ఇతర వాహనాల్లో పీసీపల్లికి తరలించారు.వీరికి నాన్‌వెజ్ భోజనం ఏర్పాటు చేయడంతో పాటు మద్యం కూడా సరఫరాచేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతుండగానే సభకు వచ్చిన కొంతమంది వైసీపీ కార్యకర్తలు మద్యం బాటిళ్లకోసం స్థానిక దుకాణాల వద్ద బారులు తీరారు.

77 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పామూరు,(సీఎస్‌పురం) ఏప్రిల్ 4 : అర్ధరాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ పట్టుకొన్న సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. నెల్లూరుజిల్లాకు చెందిన వ్యక్తి సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపం నుంచి పామూరుకు వచ్చే మార్గంలో మినీలారీలో 77 బస్తాలను తరలిస్తుండగా సమాచారం అందుకొన్న ఎస్‌ఐ తన సిబ్బందితో దాడి చేశారు. వ్యక్తిని అదుపులో తీసుకొనికేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత


పట్టుబడిన అక్రమ మద్యంతో ఎస్సై సంపత్‌కుమార్, సిబ్బంది

దొనకొండ, ఏప్రిల్ 4: మండలంలోని చందవరం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వచేసిన అక్రమ మద్యాన్ని గురువారం దొనకొండ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు చందవరం గ్రామానికి చెందిన మురికిపూడి పెదబాబు ఎటువంటి అనుమతులు లేకుండా 30 మద్యం బాటిల్స్ స్టాక్ చేసుకొని ఉండటంతో తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అక్రమమద్యం కల్గి ఉన్నా, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా, ఎటువంటి అ సాంఘిక కార్యక్రమాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని ఎస్సై సంపత్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనారోగ్య బాధితుడికి రూ.20 వేల సాయం అందజేత


గురుప్రసాద్‌కు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందచేస్తున్న మహర్షి సభ్యులు

పామూరు, ఏప్రిల్ 4 : అనారోగ్యంతో బాధపడుతున్న పామూరు తూర్పు వీధికి చెందిన శీలం గురుప్రసాద్‌కు మహర్షి ఫౌండేషన్ సభ్యులు రూ. 20 వేల ఆర్థిక సహాయం గురువారం అందజేసారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో ఒంగోలులో వైద్యం పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకొన్న ఫౌండేషన్ సభ్యులు జిల్లా కోఆర్డినేటర్ బి. బాలకృష్ణ, కోశాధికారి ఎస్‌వీ ప్రసాద్ బాదిత కుటుంబానికి ఆర్థిక సహకారం అందజేసారు. ఈ కార్యక్రమంలో శీలంశేఖర్, శీలం గురునాథం, పిక్కిలి మస్తాన్ పాల్గొన్నారు.

ఆరంభమే అదుర్స్

ఊరూరా అఖండ స్వాగతం
పెద్ద ఎత్తున స్వాగతం పలికిన అభిమానులు
భారీ కాన్వాయ్‌తో శంకరాపురం నుంచి పులిపాడు వరకు ర్యాలీ
ర్యాలీలో మాగుంట తనయుడు రాఘవరెడ్డి, గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్ సాగర్, మామ వెంకటేశ్వరరావు



ముండ్లమూరు మండలం శంకరాపురం వద్ద గజమాలతో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి స్వాగతం పలుకుతున్న తెలుగు తమ్ముళ్లు (ఇన్‌సెట్లో) భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న అభ్యర్థి లక్ష్మి

ముండ్లమూరు, ఏప్రిల్ 4 : దర్శి నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి గురువారం భారీ కాన్వాయ్‌తో దర్శి నియోజక వర్గంలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా మండలంలోని శంకరాపురంలో పెద్ద ఎత్తున మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ మహేశ్వరి, నారాయణ స్వామి ఆధ్వర్యంలో క్రేన్‌ల సహాయంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. పోలవరం, వేంపాడు గ్రామాల మీదుగా సాగిన ర్యాలీ ముండ్లమూరుకు వచ్చే సరికే వేలాది మంది జన సందోహం తోడయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ అభిమానులు, జనసేన అభిమానులతో పాటు బీజేపీ కార్యకర్తలు, మాజీ మంత్రి స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గొట్టిపాటి నరసయ్య అభిమానులు గొట్టిపాటి లక్ష్మికి మద్దతుగా పెద్ద ఎత్తున వచ్చి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు నియోజక వర్గ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనంత విధంగా టీడీపీ అభ్యర్థి లక్ష్మిని చూసేందుకు తరలివచ్చారు. మండు టెండను సైతం లెక్క చేయకుండా కార్యకర్తలు, అభిమానులు ఎదురేగి స్వాగతం పలికారు. దాదాపు వెయ్యి వాహనాలకు పైగానే ర్యాలీలో పాల్గొనటం పెద్ద విశేషం. ముండ్లమూరులో గతంలో లోకేశ్ యువగళం పాదయాత్ర కంటే ఎక్కువ మంది హాజరయ్యారు. శంకరాపురంలో చర్చిలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో దర్శి వెళ్ళటానికి ఐదు గంటల సమయం పట్టింది. పసుపుగల్లులో ఎస్సీ కాలనీలో మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పెద ఉల్లగల్లు, రెడ్డినగర్, పులిపాడులలో కూడా వృద్ధులు, మహిళలు, యువకులు స్వాగత ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళలు

గొట్టిపాటి లక్ష్మి మాజీ మంత్రి హనుమంతరావు మనుమరాలు కావటంతో ఆ కుటుంబం పై ఉన్న అభిమానంతో పెద్ద ఎత్తున మహిళలు హాజరై ఆమెతో కరచాలనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ కొక్కెర నాగరాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, వరగాని పౌలు, మాజీ ఎంపీపీలు కోడెగ మస్తాన్‌రావు, సర్పంచ్‌లు గజ్జల సుబ్బారెడ్డి, కూరపాటి నారాయణ స్వామి, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, జిల్లెలమూడి చౌదరి, నిడమానూరి శ్రీనివాసరావు, మానం నరసింహారావు, మండల టీడీపీ మాజీ తెలుగు యువత అధ్యక్షులు నాగండ్ల రమణ, భీమనేని నాసరయ్య, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, అబ్బూరి గోవిందరయ్య, కుంచపు ఏడుకొండలు, మాలెంపాటి మల్లిఖార్జున రావు, గుద్దేటి చిన నారాయణ రెడ్డి, ఏరేసు వెంకటేశ్వరరెడ్డి, జీడీసీసీ జిల్లా మాజీ డైరెక్టర్ కందిమళ్ళ చంద్రవౌళి, గుంటుపల్లి రంగ నాయకులు, మేదరమెట్ల శేషగిరిరావు, కొండలరావు, వివిధ గ్రామాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో దర్శికి తరలిన టీడీపీ కేడర్

దొనకొండ, ఏప్రిల్ 4 : తెలుగుదేశం పార్టీ దర్శి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో దర్శిలో గురువారం సాయంత్రం నిర్వహించే పరిచయ, ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ నుంచి రెండు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గతంలో ఎన్నడూలేని విధంగా రెట్టింపు ఉత్సాహంతో ర్యాలీగా తరలివెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునాథరెడ్డి, వల్లపునేని వెంకటస్వామి, పెమ్మసాని లక్ష్మీనారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, శృంగారపు నాగ సుబ్బారెడ్డి, యగ్గోని యల్లారెడ్డి, విప్పర్ల లక్ష్మీరావు, మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, యరగొర్ల బసవయ్య, శృంగారపు రామసుబ్బారెడ్డి, కమ్మా వెంకటనారాయణ, షేక్ తోహిద్, కుందుర్తి లక్ష్మణ్‌సీతాపతి మరికొందరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో దొనకొండకు చేరి ర్యాలీగా దర్శికి తరలివెళ్లారు. మండల టీడీపీలోని రెండవ వర్గానికి చెందిన టీడీపీ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి నేతృత్వంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు పులిమి రమణాయాదవ్, నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, తోటా కోటేశ్వర రావు, కామేపల్లి నారాయణమ్మ షేక్ మునామియా, నూనె విజయకుమారి, వేగినాటి అల్లూరయ్య, వల్లపునేని ఆదినారాయణ, పణిదపు వీరాంజనేయులు, వైకే చౌదరి, సింగమనేని హనుమంతరావు, విప్పర్ల శేషు మరికొందరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. అలాగే మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గుండాల నాగేంద్రప్రసాద్ నేతృత్వంలో పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వెళ్లిన వారిలో ఉన్నారు.


దొనకొండ నుంచి దర్శి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు


ర్యాలీకి భారీగా హాజరైన టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్లో) నేతలతో అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు నుంచి

తాళ్లూరు : దర్శి నియోజవర్గ టీడీపీ అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీకి, బహిరంగ సభకు తాళ్లూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండల టీడీపీ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు తరలి వెళ్లి ముండ్లమూరు నుంచి ర్యాలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులుమానం రమేష్‌బాబు, శాగం కొండా రెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, దర్శి నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ మీరామొహిద్దీన్, దర్శి నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు చెన్నపరెడ్డి వీరనాగిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ప్రధానకార్యదర్శి మేడగం వెంకటేశ్వరరెడ్డి, జనసేన, బీజేపీ శ్రేణులు, అధికసంఖ్యలో అభిమానులు తరలి వెళ్లారు.



కురిచేడు నుంచి తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు

కురిచేడు నుంచి

కురిచేడు : టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి స్వాగతం పలికేందుకు కురిచేడు తెలుగు తమ్ముళ్లు భారీఎత్తున తరలివెళ్లారు. 90 వాహనాలు, రెండు బస్సులు, ద్విచక్రవాహనాలపై దర్శికి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024




శింగరకొండ వ్యూ, భవనాసి చెరువు

రెడ్డిరాజుల రాజధాని.. అద్దంకి

చారిత్రక ప్రసిద్ధి.. సాహిత్యపరంగా ప్రత్యేక గుర్తింపు.. రెడ్డి రాజుల రాజధాని.. అద్దంకి ఎంతో విశిష్టతను సంతరించుకుంది. తొలి తెలుగు పద్య శాసనం అద్దంకిలోనే దొరికింది. 1955లో అద్దంకి నియోజకవర్గం ఏర్పడగా ఇప్పటి వరకు 14 సార్లు ఎన్నికలు జరగాయి. నియోజకవర్గ ఓటర్లు అన్ని పార్టీలను ఆదరించారు. ఉద్దండులు శాసనసభ్యులుగా గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టినా ఇంతవరకు ఏ ఒక్కరికి కూడా మంత్రిగా అవకాశం దక్కలేదు. 2009 నుంచి వరుసగా గొట్టిపాటి రవికుమార్ ఇక్కడి నుంచి మూడు సార్లు మూడు పార్టీల తరపున పోటీ చేసి విజయం సాధించి నాలుగో సారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా వైసీపీ నుంచి పాణెం చినహనిమిరెడ్డి బరిలో ఉన్నారు.

- చారిత్రక, సాహిత్యపరంగా ఎంతో ప్రసిద్ధి
- అన్ని పార్టీలను ఆదరించిన ఇక్కడి ఓటర్లు


అద్దంకిలోని కమలేశ్వరస్వామి దేవాలయం వద్ద తొలి తెలుగు పద్య శాసనం (ప్రతికృతి)


అద్దంకిలో కనుమరుగవుతూ కొద్దిమేర మిగిలి ఉన్న రెడ్డి రాజుల కాలం నాటి కోట కొట్ట

అద్దంకి, ఏప్రిల్ 4: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రారంభంలో అద్దంకి ప్రాంతం గుంటూరు జిల్లాలో భాగంగా ఉన్న ఒంగోలు అసెంబ్లీ పరిధిలో ఉంది. మండల వ్యవస్థ వచ్చే వరకు అద్దంకి తాలుకా కేంద్రంగా ఉంది. ఎందరో ఉద్దండులు ఎమ్మెల్యేలుగా ఉన్నా ఇంతవరకు ఏ ఒక్కరికి కూడా మంత్రిగా అవకాశం దక్కలేదు. 1955లో అద్దంకి నియోజకవర్గం ఏర్పడింది. 2009 వరకు నియోజకవర్గంలో 12 మండలాలు ఉండేవి. 2009 పునర్విభజన తర్వాత అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు పరిమితమైంది. ప్రస్తుతం అద్దంకి మున్సిపాలిటీతో పాటు ఐదు మండలాలు ఈ నియోజకర్గంలో ఉన్నాయి. బాచిన చెంచుగరటయ్య ఏడుసార్లు పోటీ చేసి నాలుగుసార్లు విజయం సాధించారు. కరణం బలరామకృష్ణమూర్తి నాలుగుసార్లు పోటీ చేసి రెండు సార్లు గెలుపొందారు. గొట్టిపాటి రవికుమార్ తొలుత కాంగ్రెస్, అనంతరం వైసీపీ, ఆ తర్వాత టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం టీడీపీ తరపున బరిలో నిలిచారు. 2014లో వైసీపీ తరపున పోటీ చేసి గెలుపొంది అనంతరం టీడీపీలో చేరారు. రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేల్లో గెలిచింది గొట్టిపాటి రవికుమార్ ఒక్కరే. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య కుమారుడు కృష్ణచైతన్య ఇటీవల వరకు అద్దంకి వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అయితే ఆ పార్టీ టికెట్‌ను పాణెం చినహనిమిరెడ్డికి కేటాయించడంతో బాచిన టీడీపీలో చేరారు.

ఎన్నో ప్రత్యేకతలు

అద్దంకి ప్రాంతానికి చారిత్రక, సాహిత్యపరంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. క్రీ.శ 1325లో రెడ్డిరాజులు అద్దంకి కేంద్రంగా పాలన సాగించారు. రెడ్డి రాజుల కాలంలో అద్దంకిలో మట్టి కోటను నిర్మించారు. అనంతరం రాజధానిని కొండవీడుకు మార్చారు. కాలక్రమంలో కోట కట్ట శిథిలమై ప్రస్తుతం కొద్దిమేర మట్టి గోడలా మిగిలి ఉంది. తొలి తెలుగు పద్య శాసనం అద్దంకిలో దొరికింది. ఆ శాసనంను చెన్నై మ్యూజియంకు తరలించగా ఇటీవల పలుసాహితీ సంస్థల ప్రతినిధులు తొలి తెలుగు పద్యశాసనం మోడల్ తయారు చేయించి అద్దంకిలోని కమలేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేశారు. కవి త్రయంలో ఒ కరైన ఎర్రా ప్రగడ భారతంను అద్దంకి గడ్డపైనే పూర్తి చేశారు. ఇక్కడ వేయిస్తంభాల గుడి ఉంది. గాడిద శాసనం, విక్టోరియా మహారాణి విగ్రహాలు, రాణిగారి సత్రం శిథిలావస్థకు చేరాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలు అద్దంకి సమీపంలో ఉన్నాయి. శింగరకొండ వద్ద 1918లో భవనాసి చెరువు నిర్మాణం జరిగింది. టంగుటూరి ప్రకాశంపంతులు ప్రాథమిక విద్యాభ్యాసం కొంతకాలం అద్దంకిలోని మేనమామ ఇంటి వద్ద జరిగింది. అద్దంకి పట్టణంలో పలుసాహితీ సంస్థలు ఉన్నాయి. తరచూ సాహితీ సమావేశాలు నిర్వహిస్తూ కొత్తతరం కవులను ప్రోత్సహిస్తుంటారు. అద్దంకి ఇటుకకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి అద్దంకి ప్రాంతంలోకి సాగర్ నీరు వచ్చిన తరువాత అత్యధిక గ్రామాలు సస్యశ్యామలంగా మారాయి. అత్యధిక గ్రామాలకు తాగునీటి సమస్య తీరింది. అద్దంకి పట్టణం వెంబడిగా గుండ్లకమ్మ నది ప్రవహిస్తుంది.

సం.	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	నాగినేని వెంకయ్య	కృషికార్ లోక్‌పార్టీ	పాటిబండ్ల రంగనాయకులు	సీపీఐ	6,828
1962	పాటిబండ్ల రంగనాయకులు	సీపీఐ	బాచిన అప్పారావు	కాంగ్రెస్	3,772
1967	దాసరి ప్రకాశం	కాంగ్రెస్	నాగినేని వెంకయ్య	స్వతంత్ర పార్టీ	2,068
1972	దాసరి ప్రకాశం	కాంగ్రెస్	నర్రా సుబ్బారావు	స్వతంత్ర	9,082
1978	కరణం బలరామకృష్ణమూర్తి	కాంగ్రెస్	బాచిన చెంచుగరటయ్య	జనతా	5,150
1983	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	కరణం బలరామకృష్ణమూర్తి	కాంగ్రెస్	3,394
1985	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	జాగర్లమూడి హనుమయ్య	కాంగ్రెస్	5560
1989	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	7082
1994	బాచిన చెంచుగరటయ్య	ఇండిపెండెంట్	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	7049
1999	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	249
2004	కరణం బలరామకృష్ణమూర్తి	టీడీపీ	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	2790
2009	గొట్టిపాటి రవికుమార్	కాంగ్రెస్	కరణం బలరామకృష్ణమూర్తి	టీడీపీ	15,764
2014	గొట్టిపాటి రవికుమార్	వైసీపీ	కరణం వెంకటేష్	టీడీపీ	4,235
2019	గొట్టిపాటి రవికుమార్	టీడీపీ	బాచిన చెంచుగరటయ్య	వైసీపీ	12,747

105 Addanki Assembly Constituency



కులాల వారీగా ఓటర్లు

కమ్మ	47,000	విశ్వ బ్రాహ్మణ	2,500
మాదిగ	33,000	కుమ్మరి	3,000
మాల	22,500	బ్రాహ్మణ	2,000
వడ్డెర	16,500	ముత్తరాసి	1700
యాదవ	19,000	దూదేకుల	2,000
ముస్లిం	15,000	వెలమ	1800
రెడి	16,000	పద్మశాలి	1500
కాపు	14,000	గౌడ	1300
రజక	9,000	బత్రాజులు	1100
వైశ్య	7,700	జంగం	650
యానాది	5,500	బోయ	600
ఎరుకుల	4,000	లంబాడి	850
నాయీబ్రాహ్మణ	4,000	చెంచులు	300

మొత్తం ఓటర్లు	2,41,081
పురుషులు	1,18,159
మహిళలు	1,22,910
ఇతరులు	12

నియోజకవర్గ ముఖచిత్రం



బాధ్యతలు స్వీకరించారు

- గుంటూరు ఐజీగా సర్వ శ్రేష్టత్రిపాఠి..
- పల్నాడు ఎస్పీగా బిందుమాధవ్..


గుంటూరు రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సర్వ శ్రేష్ట త్రిపాఠి



గుంటూరు, నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 4: ఎన్నికల సంఘం ఆదేశాల నేప థ్యంలో గుంటూరు ఐజీ, పల్నాడు ఎస్పీలపై బదిలీ వేటువేసిన వారి స్థానంలో నియమితులైన అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ట త్రిపాఠి, పల్నాడు ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం ది. వీరు వెంటనే విధుల్లో చేరాల్సిందిగా ఆదేశించగా ఆ ప్రకారం వారు బాధ్యతలు చేపట్టారు. రేంజి ఐజీగా నియమితులైన సర్వ శ్రేష్టత్రిపాఠి 2006 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన గతంలో 2016 నుంచి 2018 ఎన్నికల ముందు వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా రెండేళ్ల విధులు నిర్వహించారు. మూడేళ్ల డిప్యూటేషన్ పూర్తి చేసుకుని ఉత్తరప్రదేశ్ నుంచి ఆయన తిరిగి ఏపీకి వచ్చారు. అప్పటి నుంచి ఆయన డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఆయనకు ఐజీగా ఉద్యోగోన్నతి లభించింది. సర్వశ్రేష్ట త్రిపాఠి రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ, ఏఎస్పీలు, డీఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలకు సంబంధించిన వివిధ అంశాలను ఎస్పీ తుషార్ డూడీని అడిగి తెలుసుకున్నారు.

● పల్నాడు ఎస్పీగా నియమితులైన గరికపాటి బిందుమాధవ్ 2017లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత ఆయన రంపచోడవరం ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా పని చేశారు. జిల్లాల విభజన అనంతరం ఆయన పల్నాడు జిల్లా ఓఎస్డీగా, ఏఎస్పీగా పని చేశారు. ఆ త ర్వాత ఆ యన ఉద్యోగోన్నతి పొంది గ్రేహౌండ్స్ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత తిరిగి తాజాగా పల్నాడు ఎస్పీగా రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయనకు జిల్లాపై అవ గాహన ఉండటం వల్ల రానున్న ఎన్నికల నిర్వహణ కొంత సులువు కానుంది. బిందు మాధవ్ నరసరావు పేటలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేసిన వారే..

గుంటూరు రేంజిలో తాజాగా నియమితులైన నలుగురు ఐపీఎస్ అధికారుల్లో ముగ్గురు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేసిన వారే కావడం గమనార్హం. ఐజీ సర్వ శ్రేష్టత్రిపాఠి 2016 నుంచి 2018 వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. పల్నాడు ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా పని చేశారు. ఇక నెల్లూరు ఎస్పీగా నియమితులైన ఆరిఫ్‌హఫీజ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా ఏడాదికి పైగా పనిచేశారు. ఆ తర్వాత అర్బన్ ఏఎస్పీగా, గుంటూరు అర్బన్ ఎస్పీగా పని చేశారు. జిల్లాల విభజన తర్వాత గుంటూరు జిల్లా ఎస్పీగా పనిచేశారు. రెండు నెలల క్రితం ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. తాజాగా ఆయనను గుంటూరు రేంజి పరిధిలోని నెల్లూరు ఎస్పీగా నియమించారు.

ఎంపీ సీటు.. నాకొద్దు

- పొన్నూరు టికెట్ నాకే ఇవ్వండి
- లేదంటే గుంటూరు పశ్చిమలో అవకాశమివ్వండి
- మంత్రి రజినీని గుంటూరు లోక్‌సభకు పంపండి
- సజ్జలకు మొరపెట్టుకున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య
- ఇప్పటికే కాడి కిందపడేసి పరారైన ఉమ్మారెడ్డి వెంకటరమణ



గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మాత్రమే వచ్చింది. ఇంకా నోటిఫికేషన్ రాలేదు.. అయితే వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం పట్టుకుందా అంటే.. తాజాగా నెలకొంటున్న పరిస్థితులు అవుననంటున్నాయి. గుంటూరు లోక్ సభ స్థానం నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా రెండో కృష్ణుడుగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య రంగప్రవేశం చేశారు. అయితే ఇంకా ఆట మొదలుకాకుండానే ఆయన కాడి కింద పడేశారు. అక్కడి వారిని ఇక్కడకు, ఇక్కడి వారిని అక్కడకు మారుస్తూ సీఎం జగన్ ప్రయోగాలు చేసినప్పటికీ అవి సత్ఫలితాలు ఇవ్వడం లేదు. పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కిలారి వెంకటరోశయ్య గుంటూరు ఎంపీ అభ్యర్థిగా రాజకీయ బదిలీపై వచ్చారు. తొలుత ఈ సీటుకు రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణను ఎంపిక చేశారు. ఆయన రెండు మూడు రోజుల్లోనే తోక ముడిచి నాకొద్దీ సీటంటూ పరారయ్యారు. దీంతో అవాక్కయిన వైసీపీ అధిష్ఠానం అతనికి బదులుగా , అతని బావ రోశయ్యను బరిలోకి దించారు. అభ్యర్థిగా ఖరారు చేసింది కొద్దిరోజుల క్రితమే అయినప్పటికీ ఆయన అయిష్టంగానే అడుగులు వేస్తున్నారు. ఇందుకు ప్రధానకారణం అధిష్ఠానం సూచించినంత మొత్తం ఆయన వద్ద లేకపోవడమేనని సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయన బుధవారం తన మామ, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిలతో కలిసి వెళ్లి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృ ష్ణారెడ్డి ఎదుట తన గోడు వెళ్లగక్కినట్లు తెలిసింది. తాను ఎంపీగా పోటీ చేయలేనని, ఎంపీగా పోటీ చేసే ఆర్థిక స్థితి తనకు లేదని రోశయ్య సజ్జలకు విన్నవించినట్లు తెలిసింది. తన వద్ద ఎమ్మెల్యే ఎన్నికలకు పోటీ చేసేంత ఆర్థిక స్తోమత మాత్రమే ఉందని, అందువల్ల తనకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పొన్నూరు సీటునే తిరిగి ఇవ్వాలని మొరపెట్టు కున్నట్లు తెలిసింది. అది వీలు కాని పక్షంలో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. గుంటూరు పశ్చిమలో తన సామాజికవర్గం ఓటర్లు కూడా ఎక్కువగా ఉన్నారని వివరించినట్లు తెలిసింది. చిలకలూరిపేట నుంచి ఇక్కడకు వలస వచ్చిన విడదల రజినీని గుంటూరు ఎంపీగా బరిలోకి దించాలని కూడా రోశయ్య సూచించినట్లు సమాచారం. అయితే ఈ సమయంలో మార్పులు చేయడం అంతసులువు కాదని, ఇప్పుడే తొందరపడి ఎటువంటి ప్రకటనలు చేయవద్దని సజ్జల వారికి హితవు చెప్పినట్లు తెలి సింది. ఉగాది పండుగ వరకు ఆగమ ని ఆ తర్వాత కొద్దిపాటి మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఈలోగా సీఎం జగన్‌తో మాట్లాడి ఏ విషయం చెబుతా నని రోశయ్యను అను నయించినట్లు తెలిసింది.

వైసీపీకి గుడ్‌బై

- అధిష్ఠానానికి ఆమంచి షాక్
- 9న భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని లేఖ
- 11న కాంగ్రెస్ పార్టీలో చేరికపై అనుచరులకు సమాచారం


ఆమంచి కృష్ణమోహన్

చీరాల, ఏప్రిల్ 4: వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు, ఈ నెల 9న భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11వ తేది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు అనుచరులకు ఆయన సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని తన నివాసంలో గురువారం ఆమంచి ముఖ్యఅనుచరులతో భేటీ అయ్యారు. ఇందులో వైసీపీకి రాజీనామా, కాంగ్రెస్ పార్టీలో చేరికపై నిర్ణయాలు ప్రకటించినట్లు సమాచారం. గతంలో నవోదయం పార్టీ(ఆటో గుర్తు)పై ఇండిపెండెంట్‌గా పోటీ చేశామని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, అన్ని కోణాల్లో ఆలోచించి కాంగ్రెస్ పార్టీలో చేరటం మంచిదని ఆయన వివరించగా అనుచరులు సమ్మతించినట్లు తెలిసింది.

అధిష్ఠానం కన్నా.. ఆమంచే ముందు

వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కొంతకాలంగా వేస్తున్న అడుగులు అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించినట్లు ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ, చీరాల నుంచి పోటీ చేస్తానని అనుచరులకు ఆమంచి చెప్పినప్పటి నుంచి పరిణామాలు చకచకా మారిపోయాయి. ఈ క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఆమంచి పాల్పడుతున్నట్లు అధిష్ఠానం భావించింది. ఆయన చర్యలను కట్టడి చేసేందుకు అధిష్ఠానం మూడు మార్గాలను ఎంచుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఆమంచిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఒక మార్గం. అయితే అధిష్ఠానం ఆలోచనను ముందుగానే పసిగట్టిన ఆయన తానే ముందస్తు నిర్ణయం తీసుకున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అందులో భాగంగానే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించుకున్నారని సమాచారం.

పింఛన్లు.. 88 శాతం

- వలంటీర్ల కంటే వేగంగా పంపిణీ
- బెడిసికొట్టిన వైసీపీ ఓట్ల రాజకీయం
- నగదు విడుదల కాకే తొలుత జాప్యం
- అధికార పార్టీ అసత్య ప్రచారాలు పటాపంచలు
- గురువారం మధ్యాహ్నానికే సచివాలయాలు ఖాళీ

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ కష్టమని అధికార పార్టీ చేసిన అసత్య ప్రచారాలు పటాపంచలయ్యాయి. గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు వలంటీర్లు చేసే పనిని రోజున్నర వ్యవధిలోనే పూర్తి చేశారు. సచివాలయాలకు పింఛన్‌దారులు వచ్చిందే తడవుగా నిమిషాల వ్యవధిలో వేలిముద్ర ద్వారా ఆధార్ అథెంటికేషన్ చేయించుకుని నగదు చేతిలో పెట్టి పంపించేశారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే చాలా సచివాలయాల్లో పింఛన్‌దారులు లేక కౌంటర్లు ఖాళీగా మారాయి. ఇంకా ఎవరైనా పెన్షన్ తీసుకోవాల్సిన వారు ఉంటే వెంటనే రావాలని, సచివాలయాల్లో పలువురు కార్యదర్శులు వాట్సాప్ గ్రూపుల ద్వారా పింఛన్‌దారులకు సందేశాలు పంపించారు. ప్రభుత్వం కనుక రెండు విడతలుగా కాకుండా ఒకే విడతలో నగదు జమ చేసి ఉంటే ఈపాటికి మొత్తం పెన్షన్ల పంపిణీని పూర్తి చేసేవారమని పేర్లు చెప్పడానికి ఇష్టపడని పలువురు సెక్రెటరీలు తెలిపారు. గుంటూరు జిల్లాలో 2,60,830 పింఛన్లను ఈ నెలలో ప్రభుత్వం విడుదల చేయగా గురువారం సాయంత్రానికి 2,14,734 (82.33 శాతం)మందికి పంపిణీ పూర్తిచేశారు. అలానే పల్నాడు జిల్లాలో 2,82,105 మందికి 2,48,970(88.25 శాతం), బాపట్ల జిల్లాలో 2,35,945 మందికి 2,02,814(86.32 శాతం) మందికి పంపిణీని పూర్తిచేశారు. అది కూడా ఎలాంటి చిన్నపాటి సమస్యలు కూడా లేకుండానే. ఇదే పనిని ప్రతీ నెలా వారికి అప్పగించినా పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఇచ్చేయగలరు. కాగా వలంటీర్లు లేకపోతే పింఛన్ల వ్యవస్థ కుప్పకూలుతుందని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన వైసీపీకి పెన్షన్ల పంపిణీ శాతం ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ నెల, వచ్చే నెలలో పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టి ఓట్లు కోసం చేసిన నీచ రాజకీయ వ్యూహం బెడిసికొట్టినట్లు అయింది. పింఛన్ల జాప్యానికి కారణం టీడీపీ, బీజేపీ, జనసేన అని మూడు పార్టీలపై నెపం మోపి లబ్ధి పొందాలని చూసిన వైసీపీ ప్రయత్నం బూమరాంగ్ అయింది.

చాలామంది పింఛన్‌దారులు తాము గతంలో వలంటీర్‌కు రూ.200 ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ బాధ తప్పిందని సంతోషాన్ని వ్యక్తపరిచారు. కాగా మంచం నుంచి లేవలేని వాళ్ల, దివ్యాంగుల వద్దకు సచివాలయాల కార్యదర్శులే వెళ్లి పెన్షన్‌ని పంపిణీ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ సచివాలయం వద్దకు వైసీపీ నేత వెళ్లి గురువారం తానే పింఛన్లు పంపిణీ చేస్తానని హడావిడి చేసినట్లు తెలిసింది. అయితే అందుకు సచివాలయ సెక్రెటరీలు అంగీకరించలేదు. దీంతో ఎన్నికల తర్వాత వచ్చేది వైసీపీ ప్రభుత్వమే, ఆ విషయాన్ని గుర్తు పెట్టుకోండి అంటూ వారిని హెచ్చరించినట్లు సమాచారం. తలసేమియా వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కొరిటపాడుకు చెందిన బాలుడికి ఉన్నతాధికారులు అనుమతిస్తే అక్కడికు వెళ్లి రూ.10 వేల పింఛన్‌ని ఇచ్చేందుకు సంబంధిత సిబ్బంది సన్నద్ధమయ్యారు.


రేపల్లెలో పింఛన్లు పంపిణీచేస్తున్న సచివాలయ సిబ్బంది


దుగ్గిరాలలో పింఛన్లు పంపిణీచేస్తున్న సచివాలయ సిబ్బంది

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(శుక్రవారం)

సహెరీ (ఉదయం) 4.43 (శనివారం)



మేదరమెట్లలో ఎమ్మెల్యే రవికుమార్‌కు గుమ్మడి కాయతో దిష్టి తీస్తున్న మహిళలు

పింఛన్‌లపై జగన్‌రెడ్డివి అసత్యాలు

● హత్యారాజకీయం..అబద్ధపు ప్రచారాలే వైసీపీ నైజం

● ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శ

మేదరమెట్ల , ఏప్రిల్ 4 : పింఛన్ పంపిణీపై జగన్‌రెడ్డి అసత్యాలు చెప్తున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ డబ్బులు కమిషన్ కోసం కాంట్రాక్టర్లకు దోచిపెట్టి తెలుగుదేశం పార్టీపై అభాండాలు వేయడం జగన్‌రెడ్డి నైజమన్నారు. గురువారం ఇంటింటి ప్రచారానికి వచ్చిన రవికుమార్‌కు మహిళలు పెద్దసంఖ్యలో ఎదురెళ్లి గుమ్మడికాయతో దిష్టితీసి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ పింఛన్‌ల పంపిణీకి సరిపడా అధికారులు ఉన్నప్పటికీ వృద్ధులను మండుటెండలో సచివాలయాల చుట్టూ తిప్పుతున్నారని రవి ఆవేదన వ్యక్తం చేశారు. రెండోరోజు కూడా పింఛన్ మొత్తాలు సరిపడా లేక, కొద్దిమందికే అందజేశారన్నారు. ఎస్టీ, ఎస్సీ కాలనీలతో పాటు ఆర్యవైశ్యుల ఇళ్లకు వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి విజయంతోనే రాష్ట్ర భవిష్యత్ అని గొట్టిపాటి తెలిపారు. దేవాలయం వద్ద పెద్ద సంఖ్యలో హాజరైన ఆర్యవైశ్యులు ఆయనకు మద్దతు ప్రకటించారు. పంచాయతీ వార్డు మెంబర్లు పఠాన్ సర్దార్‌ఖాన్, చిన్న తదితరులుతో పాటు పెద్ద సంఖ్యలో గొట్టిపాటికి మద్దతు పలికారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు బాబాయి హత్య, కోడి కత్తి డ్రామాలతో జగన్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టారన్నారు. హత్యారాజకీయాలు.. అబద్ధపు ప్రచారాలతో వైసీపీ ప్రజలను మోసగిస్తోందన్నారు. రూ.11 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. మచ్చుకు కూడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించడంతోపాటు అన్ని రంగాలల్లో రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేశారన్నారు. కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. వచ్చేందుకు కూడా పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో నిత్యావసరాలు, కరెంట్, బస్సు చార్జీలను విపరీతంగా పెంచారన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారని గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఆడ పిల్లల చదువుకు, మహిళల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇకపై రూ.4వేల పింఛన్‌ను నేరుగా ఇళ్ల వద్దకే అందజేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో మన్నె రామారావు, కర్నాటి పూర్ణచంద్రరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, సింగమనేని వాసు, బొల్లేపల్లి సుబ్బారావు, రేగుల వెంకట్రావు, మారెళ్ల శేషయ్య, పోకూరి హరి, మన్నె ప్రసాద్, దుర్గరావు, రవ్వవరపు బ్రహ్మయ్య, సీహెచ్, రాజేష్, మహిళలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వేమూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

లక్ష్య సాధకుడు చంద్రబాబును గెలిపించుకుందాం

● రౌడీ పాలన తరిమికొడదాం

● పరిచయ సమావేశంలో బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

వేమూరు, ఏప్రిల్ 4 :లక్ష్యసాధకుడైన చంద్రబాబును గెలిపించుకుందాం, రౌడీ పాలన తరిమికొడదాం అని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గం కేంద్రమైన వేమూరులో నియోజకవర్గ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశంతోపాటు, బాపట్ల పార్లమెంట్ స్థాయి ఉమ్మడి అభ్యర్థి కృష్ణప్రసాద్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి వేమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆనందబాబు ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పోలీసు శాఖలో ఎస్పీ, డీజీపీగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేశానని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కోరిక మేరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టి అనేక ప్రాజెక్టుల ద్వారా అనూహ్యమైన అభివృద్ధిని సాధించడం జరిగిందన్నారు. లక్ష సాధకుడైన చంద్రబాబు ఆలోచనలతో ఒకే సారి 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించి దాదాపు 30 లక్షల మందికి వృత్తిపరమైన ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని అందుకు కూటమిగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులు ఎంతగానో కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అప్పుడు బాపట్ల సమీపంలోని నిజాంపట్నం పోర్టును విశాఖ తరహాలో అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. టీడీపీ హయాంలో భవిష్యత్తును ఆలోచించి పార్టీ కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రధానంగా ఓట్ ఫ్రమ్ హోం అనే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని రెండు శాతం ఉన్న పోస్టల్ బ్యాలెట్‌ను మూడు శాతం ఉన్న వృద్ధులు, వికలాంగుల ఓట్లు సైకిల్ గుర్తుపై వేసే విధంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి దుర్మార్గపు పాలన వల్ల ప్రజలు, రాష్ట్రం కునారిల్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ వచ్చాయని జగన్ పాలనలో దానిని కాలరాస్తున్నారని తెలిపారు. అపధర్మ ప్రభుత్వం అన్న విషయాన్ని మరిచి జగన్ వ్యవహరిస్తున్నారని, అసాంఘిక సంఘటలనతో రాష్ట్ర ప్రజలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్త పరిచారు. అత్యధిక మెజారిటీతో అసెంబ్లీ అభ్యర్థి ఆనందబాబుతోపాటు, తనను కూడా సమానమైన మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీపై నాటకాలు ఆడుతూ టీడీపీపై బురద చల్లుతున్నారని విమర్శించారు. వలంటీర్లకు చంద్రబాబు వ్యతిరేకం కాదని, వారిని అప్రజాస్వామ్యంగా వాడుకుంటున్నారన్న విషయాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. సచివాలయంలో 11 శాఖల ఉద్యోగులు ఉన్నారని వారి ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయవచ్చున్నారు. చీఫ్ సెక్రటరీ కూడా జగన్మోహనరెడ్డికి సహకరించడం వల్లఈ విధానం పూర్తిగా పక్కదోవపడుతుందన్నారు. కన్న తండ్రి లాంటి బాబాయిని పొట్టన పెట్టుకున్న జగన్ ప్రజలను కూడా అదే పద్ధతిలో హింసికు గురిచేస్తున్నాడన్నారు. వైసీపీ అభ్యర్థి పన్నుతున్న కుయుక్తులకు ఏ మాత్రం భయపడకుండా ముందుకు సాగాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ఉండి ఏ మాత్రం అభివృద్ధి చేయకుండా తాను ఓడిపోతానన్న భయంతో మేరుగ నాగార్జున ఆరునెలల ముందే ఇక్కడ నుంచి పారిపోయారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా కార్యదర్శి అనూరాధ, పార్టీ నాయకులు టి సాయిబాబా, మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్, యలవర్తి బ్రహ్మానందం, మహిళా విభాగం అధ్యక్షురాలు ఘంటా స్వాతి, దండే వెంకటసుబ్బారావు, తమ్మాశివారెడ్డి, వేమూరి మురళీకృష్ణ, తాడికొండ దయాబాబు, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, వాకా శేషబాబు, వివిధ పార్టీ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జిల్లాలో 90 శాతం పింఛన్లు పంపిణీ

ఒంగోలునగరం, ఏప్రిల్ 4 : జిల్లాలో 90శాతం మేర పింఛన్ల పంపిణీ గురువారానికి పూర్తయ్యింది. బుధవారం జిల్లాలో పింఛన్ల పంపిణీలో అనేక ఇబ్బందులు పడగా గురువారం అన్ని సచివాలయాల్లో పంపిణీ సజావుగానే సాగింది. పంపిణీ మరో రెండురోజులు మాత్రమే జరగనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాల్సి ఉంది. శుక్రవార, శనివారాల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేసే అవకాశం ఉంది. కాగా ఇంటికే పింఛన్ అందజేయాల్సిన కేటగిరీలో ఉన్న అనేకమంది లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు వచ్చి ఇప్పటికే పింఛన్ తీసుకున్నారు. ఇంకా తీసుకోని వారికి ఇంటికే వెళ్లి పింఛన్‌ను అందజేయాల్సి ఉంది.

వైసీపీకి షాక్

టీడీపీ వైపు మద్దిశెట్టి

ఇప్పటికే పార్టీ మారిన అనుచరులు

రాఘవరెడ్డితో శ్రీధర్ భేటీ

త్వరలో కీలక నిర్ణయం

కాంగ్రెస్ వైపు ఆమంచి చూపు

పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన



ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికార వైసీపీకి దెబ్బ మీద దెబ్బ పడుతుంది. ఇప్పటికే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆ పార్టీ వీడి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఆయన అనుచరులు టీడీపీలోకి క్యూకట్టారు. ఇంకోవైపు దాదాపు అన్నీ నియోజకవర్గాల్లో కీలకమైన నాయకులు టీడీపీలోకి చేరిపోతున్నారు. ఇదే సమయంలో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆ పార్టీకి షాక్ ఇచ్చేందుకు సిద్ధంకాగా, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వైసీపీకి రాజీనామా చేశారు. వీరిలో మద్దిశెట్టి టీడీపీవైపు దృష్టిసారించగా ఆమంచి కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. వీరిద్దరూ నాయకులు కాపు సామాజికవర్గానికి చెందిన వారు కావటం ఆయా నియోజకవర్గాల్లో బలమైన అనుచరగణం కలిగి ఉండటం విశేషం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీకి వరుస షాకులు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన కీలక నాయకులు, ఎమ్మెల్యేలు దూరమవుతున్నారు. ఇప్పటికే ఎంపీ మాగుంట పార్టీ మారి లోక్‌సభ బరిలో నిలవగా, తాజాగా మరో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కూడా బైబై చెప్పబోతున్నారు. ఎన్నికల సమరం ఆరంభమై బస్సుయాత్రతో సీఎం జగన్ రానున్న నేపథ్యంలో అసంతృప్తి నాయకులు ఎవరి దారి వారు చూసుకోవటం ప్రారంభించటం విశేషం. ఇప్పటికే కిందిస్థాయిలో నాయకులు టీడీపీ కూటమిలో చేరిపోతుండగా పైస్థాయిలో మాగుంట కుటుంబం ఇప్పటికే టీడీపీలోకి చేరిపోయింది. తాజాగా మద్దిశెట్టి, ఆమంచిలు కూడా వైసీపీకి దూరం అవుతుండటం రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఇప్పటికీ వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆ పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో ఆయన సోదరుడు శ్రీధర్ తెలుగుదేశం పార్టీ నేతలతో మంతనాలు ప్రారంభించారు. కిందిస్థాయిలో ఆయన వర్గం వారు కొందరు ఇప్పటికే టీడీపీ బాట పట్టగా మరికొందరు టీడీపీ, జనసేనల వైపు దృష్టిసారించారు. అందిన సమాచారం మేరకు మద్దిశెట్టి కూడా నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి సహకరించకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. వైసీపీ అభ్యర్థిగా బూచేపల్లిని ప్రకటించే సమయంలో కనీసం మద్దిశెట్టితో చర్చలు జరపకపోవటం, ఆ తర్వాత ఆయన ఆ పార్టీ లోనే ఒంగోలు ఎంపీ టికెట్ ఆశించారు. అక్కడ అవకాశం ఇవ్వకపోగా ఇతరత్రా అవకాశాలు కూడా ఇచ్చే ఆలోచనను వైసీపీ అధిష్ఠానం చేయలేదు. అభ్యర్థి అయిన బూచేపల్లి నుంచి కనీసం ఆయన్ను కలవటం కానీ కలిసే ప్రయత్నం కానీ చేయలేదు. ఎమ్మెల్యే మద్దిశెట్టిని పక్కనపెట్టి నియోజకవర్గంలోని అయన అనుచరుల్లో కొందరితో మంతనాలు ప్రారంభించారు. దర్శి నగరపంచాయితీలో అలాగే ముండ్లమూరు మండలంలో ఒకరిద్దరు మద్దిశెట్టి అనుచరులను తనవైపు తిప్పుకోగలిగారు. దీంతో మద్దిశెట్టితో పాటు ఆయన అనుచరులు కూడా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. మద్దిశెట్టికి కుటుంబీకులు, నియోజకవర్గంలోని అనుచరుల నుంచి వత్తిడి పెరిగింది వైసీపీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ దశలో మద్దిశెట్టికి టీడీపీ, జనసేన నాయకులు కూడా కొందరు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది.

టీడీపీలోకి మద్దిశెట్టి వర్గం

టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి లక్ష్మిని ప్రకటించిన తర్వాత మద్దిశెట్టి ఎలాంటి వైఖరి తీసుకుంటారా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఈ దశలో మద్దిశెట్టి సోదరుడు శ్రీధర్ మూడు రోజుల క్రితం నియోజకవర్గంలోని అనుచరులతో చర్చలు జరిపారు. వైసీపీ అభ్యర్థికి సహకరించకూడదని అందరూ డిమాండ్ చేశారు. ఆయన

కొ నా డా అనుచరుల డి వ హాం

డ్‌కు అంగీకరించినట్లు తెలిసింది. ఆ తర్వాత శ్రీధర్‌తో మాగుంట రాఘవరెడ్డి చర్చలు జరిపారు. అదేసమయంలో దొనకొండ మండలంలో వైసీపీలో బలమైన నాయకులుగా ఉన్న కందుల నారపురెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు మాగుంట సమక్షంలో టీడీపీలో చేరారు. దర్శిలో కౌన్సిలర్ భర్త మాజీ ఏఎంసీ చైర్మన్ సుబ్బయ్య, అలాగే మద్దిశెట్టి అనుచరుల్లోని కొందరు ముఖ్య నాయకులు ప్రధానంగా కాపు సామాజికవర్గంకు చెందిన వారు టీడీపీ అభ్యర్థి లక్ష్మీ, ఆమె కుటుంబసభ్యులకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. బూచేపల్లికి మద్దతు తెలిపిన ఒక నాయకుడితో కూడా లక్ష్మీ భర్త సమాలోచన జరిపినట్లు సమాచారం. మరో మండలంలో ఎంపీపీగా ఉన్న బీసీ నాయకుడు కూడా టీడీపీ వైపు దృష్టిసారించారు. ముండ్లమూరు మండల పార్టీ కన్వీనర్ సుబ్బారెడ్డి టీడీపీ నేతలకు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. కురిచేడు మండలంలో బూచేపల్లి వైపు వెళ్లిన ఒకరిద్దరు మద్దిశెట్టి అనుచరులు తిరిగి వెనక్కు వచ్చేశారు. తాళ్లూరు మండలంలో కొందరు పరోక్ష మద్దతుకు, కొందరు టీడీపీలో చేరేందుకు సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి సహకరించలేమనే నిర్ణయంతో ఉన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి కూడా పార్టీ మారే అలోచనలో ఉన్నారనే ప్రచారం ఉంది. ఆయన ఇచ్చిన సంకేతాలతోనే ఎమ్మెల్యే వర్గీయులు ఇటు మాగుంట అటు లక్ష్మీలకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. నేడో రేపో చాలామంది టీడీపీ కూటమి గూటికి చేరేందుకు రంగం సిద్ధమైంది.

కాంగ్రెస్ గూటికి ఆమంచి!

ఇంకోవైపు చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం సాయంత్రం వైసీపీకి రాజీనామా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయిన ఆమంచికి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. అక్కడ నుంచి తప్పించిన తర్వాత ఆయన చీరాల టికెట్ కోసం పట్టుబట్టారు. తనకు కాకపోయినా ప్రస్తుత అభ్యర్థి కరణ వెంకటేష్‌కు ఇవ్వొద్దని బీసీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు వైసీపీ అధిష్ఠానం అంగీకరించకపోగా క్రమేపీ ఆమంచిని దూరం పెట్టడం ప్రారంభించారు. దీంతో చీరాలలో తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పోటీలోకి రావాలని ఆమంచి భావించారు. ఇండిపెండెంట్‌గా రంగంలోకి రావచ్చనే ప్రచారం జరిగింది. తాజాగా కాంగ్రెస్ నుంచి ఆయనకు సంకేతం వచ్చినట్లు తెలిసింది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో మాట్లాడినట్లు కూడా సమాచారం. ఆ మేరకు శుక్రవారం ఆమెను కలవబోతున్నట్లు కూడా ఆయా వర్గాల్లో సమాచారం ఉంది. అయితే అనుచరులతో మాట్లాడి ఉగాది రోజుకు తుది నిర్ణయం తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. చీరాలతోపాటు పర్చూరు నియోజకవర్గాల్లోని అనుచరులతో కూడా ఆయన మంతనాలు జరిపి వైసీపీకి వ్యతిరేకంగా పనిచేయాలని పిలుపునిచ్చినట్లు తెలిసింది.

దద్దరిల్లిన దర్శి

టీడీపీ అభ్యర్థి లక్ష్మికి అపూర్వస్వాగతం

అరమరికలు లేకుండా కదిలొచ్చిన టీడీపీ కూటమి శ్రేణులు

బారులు తీరిన జనంతో ర్యాలీ

కిక్కిరిసిన సభాప్రాంగణం



దర్శి అభ్యర్థి లక్ష్మి పరిచయ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన శ్రేణులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి, పక్కన ఎంపీ అభ్యర్థి మాగుంట, అద్దంకి, ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి నియోజకవర్గ ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. తొలిసారిగా ఆమె గురువారం నియోజకవర్గంలోకి రావటంతో ఆరంభ గ్రామమైన శంకరాపురం నుంచి దర్శి వరకు టీడీపీ కూటమి శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పలికాయి. దర్శి జనసందోహంతో దద్దరిల్లింది. సభాప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయి ఎటుచూసినా జనంతో కళకళలాడింది. 27 కిలోమీటర్ల దూరానికి లక్ష్మి, ఇతర నాయకులతో నిండిన వాహనం ర్యాలీ నాలుగు గంటల పాటు సాగింది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కూటమి శ్రేణులు ఎలాంటి అరమరికలు లేకుండా స్వచ్ఛందంగా తరలివచ్చి జేజేలు పలికారు. వేలాది వాహనాల్లో ప్రజలు తరలిరావటంతో కూటమి నాయకుల ఆనందానికి అవధులు లేకుండాపోయింది. దారిపొడవునా ఆయా గ్రామాల వద్ద ప్రజలు ముఖ్యంగా మహిళలు రోడ్లపైకి వచ్చి స్వాగతం పలకటం, హారతులివ్వటం అధికంగా కనిపించింది. సభాప్రాంగణానికి 20వేల మందికి పైగా వచ్చినట్లు అంచనా.

అడుగడుగునా ఘనస్వాగతం

జిల్లాలో పేరొందిన దివంగత మాజీమంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలు, మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య కుమార్తె లక్ష్మిని దర్శి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. నరసరావుపేటలో టీడీపీ కుటుంబానికి చెందిన డాక్టరు లలిత్‌సాగర్ సతీమణి అయిన లక్ష్మిని అధిష్ఠానం చివరిక్షణంలో రంగంలో దింపింది. దీంతో ఆమె గురువారం సాయంత్రం తొలిసారిగా నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. సింగరకొండ ఆంజనేయస్వామి గుడిలో పూజలు అనంతరం సాయంత్రం సాయంత్రం 4.40 సమయంలో నియోజకవర్గంలోని శంకరాపురం గ్రామానికి చేరారు. అప్పటికే అక్కడకు భారీగా చేరిన టీడీపీ శ్రేణులు స్వాగతం పలికాయి. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి, ఇతర నాయకులు కూడా ఆమెతోపాటు వాహనం ఎక్కగా 4.50 సమయంలో ర్యాలీ ప్రారంభమైంది. పోలవరం, వేంపాడు మీదుగా ముండ్లమూరు చేరేసరికి అటు తాళ్లూరు, ఇటు ముండ్లమూరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు వచ్చి వారికి స్వాగతం పలికారు. ముండ్లమూరు సెంటర్ ర్యాలీతో కిక్కిరిసింది. ఆతర్వాత పసుపుగల్లు, ఉల్లగల్లు, రెడ్డినగర్, పులిపాడుల మీదుగా రాత్రి 8.20 సమయానికి దర్శిలోకి ర్యాలీ ప్రవేశించింది. దర్శితోపాటు దొనకొండ, కురిచేడు ప్రాంతాల ప్రజలు కూడా అక్కడకు చేరటంతో దర్శి జనంతో కిక్కిరిసిపోయింది.

ఇక్కడే ఉండి సేవ చేస్తా: లక్ష్మి

ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 9 గంటలకే సభ ముగించాల్సి ఉండటంతో అక్కడి నుంచి వేగంగా సభాప్రాంగణానికి చేరారు. ప్రాంగణంలో వేలాదిగా వేచి ఉన్న ప్రజలు వీరి వాహనం అక్కడకు రాగానే పెద్దఎత్తున జేజేలు పలుకుతూ స్వాగతించారు. అందిన సమాచారం మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రధానంగా టీడీపీ, జనసేన శ్రేణులు తరలివచ్చారు. సొంత వాహనాల్లో తరలిరావటమే అత్యధికంగా కనిపించింది. మహిళలు పెద్దసంఖ్యలో రావటం విశేషంగా చెప్పుకోవచ్చు. సభలో లక్ష్మితోపాటు ఎంపీ అభ్యర్థి మాగుంట ప్రసంగించినప్పుడు ప్రజల నుంచి భారీస్పందన రావటం విశేషం. లక్ష్మి మాట్లాడుతూ నేను మీ ఇంటి ఆడపడుచును. ఆదరించండి ఇక్కడే ఉండి మీకోసం పనిచేస్తా.. మీకు అండగా ఉంటా.. తన వైద్యసేవలు కూడా దర్శి ప్రజలకే అంకితం చేస్తానని చెప్పటంతో సభికులు పెద్దఎత్తున కేరింతలు కొట్టారు. సభలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన అధ్యక్షుడు రియాజ్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, స్థానిక బీజేపీ నాయకులు మాట్లాడారు.

ఎస్పీగా గరుడ్ సుమిత్ సునీల్

● వెంటనే బాధ్యతల స్వీకరణ



ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 4: జిల్లా ఎస్పీగా గరుడ్ సుమిత్ సునీల్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఎస్పీగా పనిచేసిన పి.పరమేశ్వరరెడ్డిపై బదిలీ వేటు వేసిన విషయం విదితమే. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ గరుడ్ సుమిత్ సునీల్ ప్రస్తుతం ఇంటెలిజెన్సీ విభాగంలో పనిచేస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన సివిల్ సర్వీస్‌లో 2015లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2018లో ఆరునెలలు పాటు జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ పొందారు. సత్యఏసుబాబు ఎస్పీగా పనిచేసిన సమయంలో శిక్షణ తీసుకున్న గరుడ్ సుమిత్ సునీల్ చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా పనిచేశారు. జిల్లాలో ఆరునెలల పాటు శిక్షణ పొందిన తర్వాత గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా విధులలో చేరారు. అనంతరం విశాఖపట్నం రేంజి పరిధిలో నర్సీపట్నం ఏఎస్పీగా, తూర్పుగోదావరి జిల్లా ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. శ్రీకాకుళం ఏఎస్పీగా, కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా, విశాఖపట్నం డీసీపీగా , ఎస్ఐబీలో ఎస్పీగా విధులు నిర్వహించారు. తొలిసారిగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఎన్నికల నిర్వహణ పర్యవేక్షించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సునీల్

జిల్లా ఎస్పీగా నియమితులైన గరుడ్ సుమిత్ సునీల్ గురువారం రాత్రికే బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ నాగేశ్వరరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. నిష్పక్షపాతంగా, ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పెన్షన్

33వ డివిజన్ సచివాలయం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 4: టీడీపీ అధికారంలోకి రాగానే పింఛన్ దారులందరికీ ప్రతినెలా రూ.4వేలు పెన్షన్ ఇస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. సచివాలయాల వద్దకు పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సేవలు అందించి దాతృత్వం చాటారు. గురువారం నగరంలోని 33 డివిజన్‌లోని సచివాలయంలో భోజనం అందించారు. డివిజన్ అధ్యక్షులు నల్లూరి రవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పింఛన్‌దారులు తమ ఆకలి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో వైసీపీ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని అన్నారు. అంతేకాకుండా టీడీపీపై నిందలు వేయడం వైసీపీ చేతగానితనమన్నారు.

బలవంతపు రాజీనామాలు..!

వలంటీర్లతో పోస్టులు వద్దని చెప్పిస్తున్న వైసీపీ నేతలు

సంతపేటలో 23మంది వలంటీర్లు గుడ్‌బై

రేపు రంగుతోటలో మరికొంతమంది



సంతపేట సచివాలయంలో అడ్మిన్‌కు రాజీనామా ఇస్తున్న వలంటీర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 4 : వైసీపీ ప్రచార కార్యక్రమాలకు కీలకంగా వ్యవహరించే వలంటీర్లను విధులకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ఈ మేరకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. అదేదో ప్రతిపక్షాల కుట్ర అన్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. వలంటీర్లు విధులకు దూరం కావడంతో వారి వారి క్లస్టర్‌లలో ఇళ్లకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. దీంతో రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత కష్టతరంగా మారుతుందని భావించిన వైసీపీ నాయకులు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. వలంటీర్ ఉద్యోగాన్ని వదిలి వైసీపీ కార్యకర్తలుగా పనిచేయాలని ఆదేశిస్తున్నారు. అందుకు ఈ రెండు నెలలు వలంటీర్లుకు వచ్చే వేతనాలను తామే చెల్లిస్తామని, అంతేకాకుండా అదనంగా బహుమతులు అందిస్తామని ఆశచూపిస్తున్నారు. కొందరిని అయితే పోస్టు ఇచ్చింది మేమే కదా.. మేం చెబితే రాజీనామా చేయారా? అంటూ భయపెడుతున్నారు. ఇలా రకరకాల ఒత్తిళ్లతో కొందరు బలవంతపు రాజీనామాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక వైసీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి, రాజీనామాలు చేయాలని చెప్పారు. దీంతో నగరంలోని సంతపేట సచివాలయ పరిధిలోని 23మంది వలంటీర్లు సచివాలయ అడ్మిన్ నాగార్జునకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

రేపు 12వ డివిజన్‌లో మరి కొంతమంది

వలంటీర్లను వైసీపీ కార్యకర్తలుగా పూర్తిస్థాయిలో పనిచేయించుకునేందుకు ఆ పార్టీ శ్రేణులు ఒత్తిడి మీద పలువురు రాజీనామాలకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే 21 డివిజన్‌లో కొందరు వలంటీర్లు రాజీనామా చేయగా, తాజాగా సంతపేటలో మరో 23మంది గుడ్‌బై చెప్పారు. ఇదిలా ఉంచితే రేపు, ఎల్లుండిలో 12వ డివిజన్‌లోని రంగుతోటలో 28 మంది రాజీనామాకు సిద్ధం అయ్యారు. ఈ మేరకు వైసీపీ నాయకులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ గురువారం ఆ డివిజన్‌లోని వలంటీర్లతో తన నివాసంలో సమావేశమైనట్లు సమాచారం. 35 ఏళ్ల వయస్సుపైన ఉండే వారు వలంటీర్లుగా కొనసాగండి. అలోపు వారు ఉద్యోగాలకు రాజీనామాలు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో రేపు లేదా ఎల్లుండి మరి కొంతమంది రాజీనామా చేయడానికి సిద్ధం అయినట్లుగా సమాచారం.

మార్టూరులో రెండిళ్లల్లో చోరీ

మార్టూరు, ఏప్రిల్ 4 : మార్టూరులో విద్యానగర్‌లో బుధవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. రెండిళ్లల్లో ఒకటి ఎంఈవో టి టీ కిషోర్‌బాబుది. కిషోర్‌బాబు ఎంఈవోగా, అతని భార్య ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఒంగోలులో పనిచేస్తున్నారు. వారు ఒంగోలులోనే ఉంటూ వారానికో సారి విద్యానగర్‌లోని సొంత ఇంటికి వచ్చి వెళ్తుంటారు. గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటి బయట గేటుకు ఉన్న మూడు తాళాలను పగులగొట్టారు. అనంతరం ఉత్తరం వైపున ఉన్న ఇంటి తలుపులను కొంచెం తొలగించి ఇంటిలోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న రెండు కిలోల వెండి వస్తువులను ఎత్తుకుపోయారు. బీరువాలో ఉన్న వస్త్రాలను చిందరవందర చేశారు. వెండి వస్తువుల విలువ రూ.80వేలు ఉంటుందని కిషోర్‌బాబు పోలీసులకు తెలిపారు. గురువారం ఉదయం ఇంటిని శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి దొంగతనం జరిగిన విషయాన్ని గ్రహించి కిషోర్ బాబుకు సమాచారం అందించారు. అదే ఇంటికి సమీపంలో ఉంటున్న గనిపిశెట్టి భాస్కర్‌బాబు ఇంట్లో కూడా దొంగతనం జరిగింది. బీరువాలో ఉన్న 11 గ్రాముల విలువైన మూడు బంగారు వస్తువులు, రూ.5వేల నగదును ఎత్తుకుపోయారు.

రెండు నెలలుగా భాస్కర్‌బాబు కుటుంబం వ్యక్తిగత కారణాలతో మద్దిసీతా దేవినగర్‌లోని మరో ఇంటిలో ఉంటున్నారు. ఈ రెండు ఇళ్లల్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐలు సైదా, మహబూబ్‌బాషా ఇళ్లను పరిశీలించారు. అనంతరం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్టూరులో వైసీపీకి షాక్

» ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కాపు నేతలు

» నమ్మకం నిలబెట్టుకుంటా.. అందరికీ అండగా ఉంటా

మార్టూరు, ఏప్రిల్ 4 : మార్టూరులో వైసీపీకి షాక్ తగిలింది. బలరాం కాలనీకి చెందిన కాపు నేతలు, 30 కాపు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారంతా గురువారం మార్టూరు నుంచి ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళ్లి మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. గతంలో కొంతమంది కాపు నేతలు తెలుగుదేశంలోనే ఉన్నప్పటికీ ప్రస్తుతం చేరిన కాపు నాయకులతో దాదాపుగా 90శాతం కాపు కుటుంబాలు టీడీపీ కూటమిలో చేరినట్లయింది. మార్టూరులో సుమారు 250 కాపు కుటుంబాలు ఉన్నాయి. వారంతా గతంలో 2014, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతుగానే ఉన్నారు. అయితే ఏడాది క్రితం పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్తగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి రాకతో కాపు నేతలు ఆయన వెంట వెళ్లారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల క్రమంలో ఆమంచి పర్చూరు సమన్వయ కర్తగా వైదొలగి చీరాలకు వెళ్లిపోవడంతో కాపు నాయకులు టీడీపీలోకి వచ్చేందుకు మొగ్గు చూపారు. గురువారం వారంతా భారీగా తరలి వచ్చి ఏలూరి సమక్షంలో సైకిలెక్కారు. పార్టీలో చేరినవారిలో సకల ఆంజనేయులు, పెంట్యాల బుల్లయ్య, పూజల నాగు, పెంట్యాల సుబ్బరామయ్య, ముప్పవరపు హనుమంతరావు, గోపిశెట్టి కోటయ్య, తిరుమల శెట్టి వీరాంజనేయులు, పెంట్యాల భద్ర య్య, కాసా నాగార్జున, పూజల పవన్, ముప్పవరపు నాగేశ్వరరావు, ఓబుల శెట్టి సుబ్బారావు, గజ్జల శివ, గజ్జల సాంబ, కందుకూరి చంద్రశేఖర్, కందుకూరి శివన్నారాయణ, సంజయ్, భార్గవ్, కాకుమాను కిరణ్, గుత్తి నాగరాజు తదితర కుటుంబాలు పార్టీలో చేరారు.



వైసీపీ వార్డు సభ్యుడిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏలూరి

అండగా ఉంటా : ఎమ్మెల్యే ఏలూరి

రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టాయన్నారు. మాపై నమ్మకంతో వచ్చిన మీకు అన్ని వేళలా అండగా ఉంటానని కాపు నాయకులకు ఏలూరి మాటిచ్చారు. అందరం ఒక్కటై జగన్‌రెడ్డిని గద్దె దింపుదామన్నారు. ప్రజల భవిష్యత్ కోసం చంద్రబాబు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అరాచక ప్రభుత్వంపై పోరు సాగిస్తున్నారన్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జగన్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలన్నారు.

బెదిరించినా ఏలూరితోనే : కాపు నేతలు

బెదిరించినా.. భయపెట్టినా మీతోనే ఉంటామని కాపు నేతలు ఎమ్మెల్యే ఏలూరికి స్పష్టం చేశారు. మీ గెలుపునకు సాయశక్తులా కృషి చేస్తామని నాయకులు ఏలూరికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఏలూరి విజయమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతినబూనారు.

వైసీపీని వీడి టీడీపీలోకి

మార్టూరు మండలం నుంచి వైసీపీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరుతున్నారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఏలూరి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మార్టూరు గ్రామ పంచాయతీ 13వ వార్డు మెంబరు వైసీపీ నాయకుడు పెనుబోయిన శ్రీనివాసరావు, బలరాంకాలనీకి చెందిన రామిశెట్టి వెంకటేశ్వర్లు పార్టీలో చేరగా, వారిని ఏలూరిని స్వాగతించారు. అలాగే మండలంలోని కోలలపూడి గ్రామంలో వైసీపీకి చెందిన ఎస్సీలు గాలి ఏసుబాబు, గాలి పేరయ్య, కుంచెపు శ్రీనివాసరావు, తాతా రాం బాబు, గాలం కామయ్య టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, తాటి నాగార్జున, తొండెపు ఆది నారాయణ, మిన్నెకంటి రవికుమార్, గొట్టిపాటి వెంకట్రావు, రావినేని శ్రీనివాసరావు, కన్నె గంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు కాపు నేతలు

కూటమి అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా

పర్చూరు : రాష్ట్ర భవిష్యత్ కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం కలసి కట్టుగా ముందుకు సాగుదామని పలువురు నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం పర్చూరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారానిన నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, యువకులు, మహిళలు తరలిరావడంతో శ్రేణుల్లో జోష్ నెలకొంది. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తంగెళ్ల మల్లికార్జునరావు, మామిడిపాక హరిప్రసాద్, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, కృష్ణంశెట్టి జగదీష్, కొల్లా చౌదరి, తులసి రామాంజనేయులు, ఊటుకూరి నిర్మల, శివాలశెట్టి రమాదేవి, కొల్లా సుబ్బాయమ్మ, జనసేన పార్టీ నాయకులు కారంపూడి సందీప్ తేజ, రంగిశెట్టి ఆంజనేయులు, మారుతి, వీరాంజనేయులు, తోట మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పేరాల(చీరాలటౌన్), ఏప్రిల్ 4 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ప్రధానోపధ్యాయులు సాల్మన్ రాజు అన్నారు. పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవనశైలి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అలాగే చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, బాలశంకరరావు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



రికార్డులు పరిశీలిస్తున్న విజయమ్మ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (యూపీహెచ్‌సీ) కాకానిపాలెంను బాపట్ల డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్యశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే అద్దంకి భవానీ సెంటర్‌లో మురుగు కాలువలు, పారిశుధ్యం అధ్వానంగా ఉండడాన్ని మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాని తెలిపారు. ఆమె వెంట యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.హేమమాధురి, సిబ్బంది ఉన్నారు.

నేర నియంత్రణకు సహకరించండి : సీఐ



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, ఏప్రిల్ 4 : మీ పరిసరాలలో ఏదైనా అనుమానిత వ్యక్తులు లేక సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించి నేర నియంత్రణకు సహకరించాలని టూటౌన్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో ప్రత్యేక పోలీసు బలగాలు, స్టేషన్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సై మురళి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు వేయండి

ఇంకొల్లు, ఏప్రిల్ 4 : రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటును వేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు ఇంకొల్లు ఎస్ఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గురువారం మండలంలోని పావులూరు, నాగండ్ల, ఇంకొల్లు గ్రామాలలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాలలో ఎటువంటి అంచనీయ సంఘటనలకు పాల్పడకుండా ఓటును వినియోగించుకోవాలని మల్లికార్జునరావు సూచించారు. కార్యక్రమంలో కేంద్రబలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని సీఐ నరసింహారావు తెలిపారు. సంతమాగులూరు మండలం చవిటిపాలెం, తంగేడుమల్లి గ్రామాలలో గురువారం సీఐ పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సంతమాగులూరు ఎస్ఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8న మాదిగ యువకుల సదస్సు



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4 : గుంటూరులో ఈనెల 8వ తేదీన జరిగే మాదిగ యువకుల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఎంఎస్పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య కోరారు. గురువారం అద్దంకిలోని అంబేద్కర్ భవనంలో అద్దంకి నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య మాదిగ మాట్లాడుతూ ఈ సదస్సుకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాలు మద్దతు తెలిపిన నేపథ్యంలో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగిపోగు చక్రవర్తి మాదిగ, పూనూరి నరేంద్రమాదిగ, ఆమోసు మాదిగ, పల్లెపోగు నాని మాదిగ, మారుతి ప్రసాద్, మహేంద్ర, పేతురు, రమేష్, శ్రీను, బాబు, దావీదు, ఎలీషా పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

పర్చూరు, ఏప్రిల్ 4: అత్యాచారయత్నానికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై గురువారం పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోతుకట్ల ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు వివాహితులపై కాలనీకి చెందిన నలుగురు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. బహిర్భూమికి వెళ్లిన తరుణంలో ఆ నలుగుర వెంబడించినట్లు బాధితులు పేర్కొన్నారన్నారు. ఈఘటనలో ఒక మహిళకు గాయాలు కావడంతో చీరాల వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రమేష్ తెలిపారు.

బావపై తండ్రీకొడుకుల దాడి

గవినివారిపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 4 : బావపై తండ్రి, కుమారుడు రాయితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని గవినివారిపాలెంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గవిని శ్రీనివాసరావుకు అదే ప్రాంతానికి చెందిన మద్దిబోయిన సోమయ్య సోదరితో వివాహం జరిగింది. ఈక్రమంలో వీరికి గతకొంత కాలంగా కుటుంబ కలహాలు సాగుతున్నాయి. ఇదిలావుండగా బుధవారం రాత్రి శ్రీనివాసరావు నూతన ఇంటిని నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలో సోమయ్య, అతని కుమారుడు హరీష్ రాయితో దాడిచేయగా శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. దీంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు సేకరించగా, ఈపూరుపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జైభీం మాల ఉద్యోగుల కమిటీ ఎన్నిక

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4 : అద్దంకి నియోజకవర్గ జై భీం మాల ఉద్యోగుల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవాధ్యక్షుడిగా గోపనబోయిన ఏడుకొండలు, గోగుల కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా గోపతోటి శ్యాంసన్, ప్రధాన కార్యదర్శిగా యర్రమోతు ఆదినారాయణ, కోశాధికారిగా నూతలపాటి హనుమంతరావు సహాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, శిరీష్, వరలక్ష్మి, సహా కార్యదర్శిగా టీ వెంకట్రావుతోపాటు మరి కొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. జ్యోతీరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వంహించాని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీ కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



శింగరకొండలో దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

శింగరకొండలో టీడీపీ అభ్యర్థి లక్ష్మి పూజలు

అద్దంకి, ఏప్రిల్ 4 : దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం దర్శి నియోజవర్గానికి వెళ్తూ శింగరకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కోటప్పకొండలో పూజలు నిర్వహించిన గొట్టిపాటి లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి శింగరకొండలో పూజలలో పాల్గొన్నారు. అనంతరం దర్శి నియోజకవర్గానికి బయలు దేరి వెళ్లారు.

విద్యుత్ మరమ్మతులకు రోటరీ సాయం



దాతలను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4 : అద్దంకిలోని ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. ఈక్రమంలో పశు వైద్యశాలలో విద్యుత్ మరమ్మతుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం వైద్యశాలలో విద్యుత్ మరమ్మతుల అనంతరం సౌకర్యాలను పరిశీలించారు. దాతలు గుండ్లకమ్మ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ పొల గంగు శ్రీనివాసరావు, నాదెండ్ల సుబ్బారావు రూ.15వేల ఆర్థిక సహకారంతో మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా వైద్యశాల ఏడీ డాక్టర్ మోహనరావు రోటరీ క్లబ్ సభ్యులను, ఆర్థక సహకారం అందించిన దాతలకు, మరమ్మతు పనులు దగ్గరుండి చేయించిన వారిని ఘనంగా సత్కరించారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ హరి బాబు, కొల్లా భువనేశ్వరి, మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, మలాది శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రచార జోరు.. టీడీపీ కేడర్‌లో జోష్

» ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి

» మరో వైపు తనయుడు హర్షవర్ధన్

అద్దంకి, ఏప్రిల్ 4 : అద్దంకి నియోజకవర్గ టీడీపీ కేడర్‌లో జోష్ పెరిగింది. ఒక వైపు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రోజుకో గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నా రు. మరో వైపు రవికుమార్ పెద్దకుమారుడు హర్షవర్ధన్ సంతమాగులూరు మండలంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. నిత్యం జనంలో ఉంటూ జననేతగా ప్రత్యేక గుర్తింపు ఉన్న గొట్టిపాటి రవికుమార్ తరచూ ఏదోఒక కార్యక్రమం నిర్వహిస్తూ కేడర్‌లో నూతనోత్సాహం నింపుతున్నారు. ఈక్రమంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పక్కా ప్రణాళికతో ఎన్నికల ప్రచారం ప్రారంభించి మరింత స్పీడు పెంచారు. గ్రామాలవారీ సమీక్షలు నిర్వహించి కేడర్‌ను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేసిన గొట్టిపాటి వారం రోజులుగా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ వైసీపీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. టీడీపీ అధికారం చేపట్టిన తరువాత చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వవివరిస్తున్నారు. ఈ క్రమంలో సెంటిమెంట్‌గా నాలుగు విడతలలో తొలుత ఎన్నికల ప్రచారం ప్రారంభించిన విధంగానే ఈ విడత కూడా సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం నుంచే 5వ సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల ప్రచారాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం వరుసగా రోజుకో మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే అద్దంకి మండలం మణికేశ్వరం, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు, అద్దంకి పట్టణంలోని 20వ వార్డు, పంగులూరు మండలం బూదవాడ లలో ఇంటింటి ఎన్నికల ప్రచారం పూర్తి చేశా రు. గురువారం రాత్రి కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఇం టింటి ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటితో పాటు ఆ గ్రామ నేతలు, మండల నేతలు పెద్ద ఎత్తు న పాల్గొంటున్నారు. దీంతో ఇప్పటికే జోష్ మీ ద ఉన్న టీడీపీ కేడర్‌లో మరింత స్పీడు పెరిగింది. ఇక గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్ గత ఎన్నికల సమయంలోనే అడపాదడపా ప్రచారంలో పాల్గొనగా ప్రస్తుతం సంతమాగులూరు మండలంపై ప్రత్యేక దృష్టి సారించి ఇం టింటికీ వెళ్లి నాన్నను గెలిపించాలని అభ్యర్థిస్తు న్నారు.



ఎన్టీఆర్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి (ఫైల్)

యువత ఆయనతో కలిసి ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంతమాగులూరు, బల్లికుర వ మండలాలు గతంలో మార్టూరు నియోజకవర్గ పరిధిలో ఉన్నప్పటి నుంచి గొట్టిపాటి కు టుంబానికి మంచి పట్టు ఉంది. ఈ నేప థ్యంలో పలువురు మండల, గ్రామ నేతలు గొట్టిపాటి కుటుంబంలో గొట్టిపాటి హనుమంతరావు, అనంతరం గొట్టిపాటి నర్సయ్య, గొట్టిపాటి రవికుమార్, ప్రస్తుతం గొట్టిపాటి హర్షవర్ధన్‌తో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇలా అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ ఎన్నికల ప్రచారం పక్కా వ్యూహంతో ప్రత్యర్థులకు అందనంత స్పీడుతో ముందుకు సాగుతుంద న్న అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమవుతుంది.

బల్లికురవ : మండలంలోని కొణిదెనలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సాయంత్రం నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ విఫలం

టీడీపీ యువ నేత హర్షవర్ధన్

సంతమాగులూరు : రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటులో, యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ ఘోరంగా విఫలమైందని టీడీపీ యువనేత గొట్టిపాటి హ ర్షవర్ధన్ తెలిపారు. కొప్పరం గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు హర్షవర్ధన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ యువత భవిష్యత్‌ను జగన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ఐదేళ్లుగా నిరుద్యోగులను మోసగించారన్నారు. దీంతో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి వెల్లడించారని ఇది వైసీపీ చేతకాని పాలనకు నిదర్శనమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తారని హర్షవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, ఆలూరి శ్రీనివాసరావు, సన్నెబోయిన గురుయాదవ్, షేక్ మాబుసుభాని (బోడా), మస్తాన్‌వలి, పోలవరపు శింగరకొండ, గుంజి అంకమ్మరావు, కోటయ్య అంగడి శివయ్య, బాషా, అనంతవరపు దేవా, స్మార్ట్, అట్లా పెద వెంకటరెడ్డి, పార్లమెంటు మహిళా కార్యదర్శి సుబాత, కే గోవిందమ్మ, శ్రీనివాసరావు, అయినాల గోపి, అయినాల మారుతి, మేకల ఆంనేయయులు, చేవూరి వాసిరెడ్డి, కంచేటి మురళి, జనసేన మండల అధ్యక్షుడు జీ రామాంజి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా కృష్ణ, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి హర్షవర్ధన్



టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

» విస్తృతంగా ఎన్నికల ప్రచారం

» కొండయ్యకు ప్రజాదరణ

చీరాల, ఏప్రిల్ 4 : టీడీపీలోకి రోజు, రోజుకు వలసలు పెరుగుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు ఆదరణ పెరుగుతోంది. మండల పరిధిలోని కావూరివారిపాలెంకు చెందిన రెడ్డి సా మాజిక వర్గానికి చెందిన పలువురు స్థానిక టీ డీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి కొండయ్యను కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కొండయ్య గెలుపునకు సైనికుల్లా పనిచేస్తామన్నారు. వారందరికీ కొండయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొండయ్య కుమారుడు గౌరీ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని 21వ వార్డులో జరిగిన ఎన్నికల ప్రచారంలో కొండయ్యతో పాటు టీడీపీ, జనసేన, బీ జేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గు ర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సూ పర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్ పథకాలను వివరించా రు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయి సమస్యలన్నీ పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో పార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండయ్యకు మద్దతు తెలుపుతున్న కావూరివారిపాలెంవాసులు



చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న కొండయ్య

ఓట్లన్నీ నీకే వేస్తాం మా సమస్యలు తీర్చండి

కొండయ్యతో నేతన్నల మనోభావాలు

వేటపాలెం(చీరాల) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మా ఓట్లన్నీ నీకే వేస్తాం.. మా సమస్యలు తీర్చండి అంటూ నేతన్న కొండయ్యను ఆశీర్వదిస్తూ స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో గురువారం రాత్రి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కొండయ్య టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వ పాలనతో రాష్ట్రం అధోగతి పాలయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రతి ఒక్కరినీ అభ్యర్థించారు. చంద్రబాబు మేనిఫెస్టో కరపత్రాలను కొండయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారథి, నాసిక వీరభద్రయ్య, యర్ర శివనాగమల్లేశ్వరి, తేలప్రోలు నాగేశ్వరరావు, ఎస్‌కే బాబు, కర్ణ శ్రీను, జనసేన నాయకులు కారంపూడి పద్మిని, ఆర్కే నాయుడు, భాగ్యలక్ష్మీకాలిక, సాయి, బీజేపీ ప్రతినిధులు నాసిక శివాజీ, షేక్ కరిమున్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : 6.23
సహరి (శనివారం) : 4.42

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.6	26.5
కావలి	38.0	26.0
కందుకూరు	37.0	27.0
ఆత్మకూరు	41.0	26.0
ఉదయగిరి	42.0	25.0

ఆంధ్రజ్యోతి



పంచాయతీల్లో మళ్లీ పైసల చోరీ

- నిన్న ఆర్థిక సంఘం నిధులు.. నేడు స్టాంప్ డ్యూటీ డబ్బులు
- పంచాయతీల నగదు వాడేసుకున్న ప్రభుత్వం
- ఏడాది నుంచి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జమకాని షేర్
- కనీస వసతులకూ నిధుల్లేక పంచాయతీలు విలవిల

నెల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పల్లె పాలనను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కనీసం మౌలిక వసతులకు కూడా నిధుల్లేకుండా పంచాయతీల నిధులన్నింటినీ వైసీపీ ప్రభుత్వం లాగేసుకుంటోంది. గ్రామ పాలనను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో బదలాయిస్తోంది. నిన్నటి వరకూ విద్యుత్ బకాయిల పేరుతో లాగేసుకోగా ఇప్పుడు రిజిస్ట్రేషన్ చార్జీల ద్వారా ఆదాయంలో పంచాయతీలకు రావాల్సిన షేర్‌ను కూడా ఏడాది నుంచి జమ చేయడం లేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయా పంచాయతీలో జరిగిన రిజిస్ట్రేషన్లు, వచ్చిన ఆదాయం ఆధారంగా పంచాయతీలకు భాగం ఇవ్వాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా పంచాయతీల ఖాతాల్లో జమకాలేదు. ఎందుకు జమ చేయడం లేదంటే సమాధానం చెప్పేవారు లేకుండా పోయారు.

● పంచాయతీలకు 40 శాతం


ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమి లేదా భవనాలు రిజిస్ట్రేషన్ జరిగితే అందుకు వసూలయ్యే స్టాంప్ డ్యూటీలో 40 శాతాన్ని స్థానిక పంచాయతీకు ఇవ్వాల్సి ఉంది. అలానే 20 శాతాన్ని మండల పరిషత్‌లకు, మరో 20 శాతాన్ని జిల్లా పరిషత్‌కు జమ చేయాలి. స్టాంప్ డ్యూటీ రూపంలోనే జిల్లాలోని పంచాయతీలకు రూ.కోట్లలో నిధులు జమ కావాల్సి ఉంది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఈ నిధులు పంచాయతీలకు ఊపిరిపోస్తాయి. పంచాయతీలకే కాకుండా మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు కూడా ఈ నిధులు ఆసరాగా నిలుస్తాయి. కానీ సదరు శాఖలో పట్టించుకునే అధికారే కనిపించడం లేదు.

● వచ్చింది వచ్చినట్టు లాగేసుకుని..

చాలా పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులు గానీ జనరల్ ఫండ్ నిధులు గానీ లేవు. గతేడాది ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిల పేరుతో లాగేసుకుంది. ఈ ఏడాది జనవరిలో విడుదలైన మరో విడత ఆర్థిక సంఘం నిధులను మూడేళ్లుగా పంచాయతీల్లో చేసిన వర్కులకు బిల్లులు చెల్లించారు. గతేడాది వరకు వసూలు చేసిన ఇంటి పన్నులు జనరల్ ఫండ్‌లో ఉండగా వాటిని కార్మికుల వేతనాలు, ఇతరత్రా ఖర్చులకు వినియోగించారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఇంటి పన్నులు వసూలు చేయవద్దని రాజకీయ నాయకులు పంచాయతీ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పంచాయతీలకు ఎటువంటి ఆర్థిక మార్గం లేకుండా పోయింది.

● వేసవిలో పెరగనున్న ఖర్చులు

వేసవి కావడంతో గ్రామాల్లో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. ఎక్కువ సమయం మోటార్లు ఆడాల్సి ఉంటుంది కాబట్టి అవి తరచూ మరమ్మతులకు గురవుతూ ఉంటాయి. అలానే ట్యాంకులను శుభ్రం చేసుకోవడం, పైపులైన్లకు మరమ్మతులు చేసుకోవడం వంటి పనులు రెగ్యులర్‌గా చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సర్పంచ్‌లు తమ సొంత నిధులతో చాలా పనులు చేసి ఉన్నారు. వాటికే బిల్లులు తెచ్చుకోలేక నానా తంటాలు పడుతున్నారు. పోనీ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంప్ డ్యూటీ వాటా అయినా వస్తే ఎలాగోలా నెట్టుకొద్దామనుకుంటే ఆ నిధులు కూడా ఇవ్వకుండా పంచాయతీలతో ఆటలాడుకుంటున్నారని స్థానిక సంస్థల ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి సుస్మితా రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు జమకాని మాట వాస్తవమేనని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు.



'ఒకచాన్స్.. ఒక్కచాన్స్... ఇవ్వండి.' అంటూ వైసీపీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర చేశారు. తిరిగిన ప్రతిచోటా హామీలు గుప్పించారు. గెలిపిస్తే అద్భుతం జరుగుతుందనే నమ్మకం కలిగించారు. తీరా గెలిచాక మాట తప్పి, మడమ తిప్పేశారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వచ్చిన ప్రతిసారీ హామీల వర్షం కురిపించారు. అభివృద్ధి కోసం రూ.కోట్లు కేటాయిస్తున్నట్లు నమ్మబలికారు. పాలనా కాలం ముగిసిపోతున్నా అభివృద్ధి దేవుడెరుగు.. పైసా కూడా విదల్చలేదు. గాల్లో ఎగిరొచ్చి వెళ్లిపోవడం తప్ప ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా జనంలోకి రాని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి శుక్ర, శనివారాల్లో బులెట్ ప్రూఫ్ బస్సులో వస్తున్నారు. 'మళ్లీ నాకే ఓటేయండి.' అని అడగబోతున్నారు. జనం చెవిలో అబద్ధాల పూలు మరోసారి పెట్టబోతున్నారు. జనం మాత్రం తక్కువ తిన్నారా... దబాయింపు, దౌర్జన్యం పాలనగా సాగిన కాలంలో మౌనంగా ఉండిపోయారుగానీ ఎన్నికల వేళ జగన్‌రెడ్డి పాత హామీలను గుర్తు చేసుకుంటున్నారు. ఒక్కటీ అమలు చేయకుండా మరో చాన్సివ్వండి అక్కచెల్లెమ్మలూ అని మాయ చేయడానికి వస్తున్నాడని అంటున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఇచ్చిన మాట మరిచారా!?

● ఒక్క హామీ నెరవేర్చని సీఎం జగన్! ● నేడు, రేపు జిల్లాలో పర్యటన



గట్టెక్కని కష్టాలు

2021లో సంభవించిన వరదల సందర్భంగా నెల్లూరు పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి నగరంలో నీట మునిగిన ప్రాంతాలను సందర్శించారు. యుద్ధప్రాతిపదికన పెన్నా పొర్లుకట్టల నిర్మాణానికి రూ. 100 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారు. ఇప్పటికి మూడేళ్లు గడిచిపోయినా అతీగతీ లేదు. పెన్నా పొర్లుకట్టల నిర్మాణం పురిటి దశను దాటలేదు. ఇప్పటివరకు కేవలం 10 శాతం పనులు మాత్రమే జరిగాయి.

● నెల్లూరు నగరంలో 1600 కోట్ల రూపాయలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజ్, తాగునీటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తి అయ్యాయి. మిగిలిన పది శాతం పనులను కూడా ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలకులు పూర్తి చేయలేకపోయారు. టిడ్కో ఇళ్లను పేదలకు పంచడానికి ఐదేళ్ల కాలం మనసు రాలేదు. ఇప్పటికి 50శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయలేదు. నెల్లూరు నగర అభివృద్ధి కోసం అంటూ ప్రత్యేకంగా నిధులూ విడుదల చేయలేదు.



కావలికి ఇస్తానన్న 80 కోట్లు ఏవీ!?

గత ఏడాది కావలి పర్యటన సందర్భంగా ట్రంకు రోడ్డును వెడల్పు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కావలి పెద్ద చెరువును రిజర్వాయర్‌గా చేసి రూరల్ మండలంలోని చెరువులకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. వెంగళరావు నగర్, ఇందిరమ్మ కాలనీ రోడ్లు, డ్రైన్లు రూ.80 కోట్లు ఇస్తామన్నారు. వీటిలో ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు.




వంతెన ఏది సారూ!

నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో పొట్టేపాళెం వద్ద వంతెన నిర్మాణానికి సీఎం జగన్ హామీ ఇచ్చారు. కేవలం పది కోట్లతో పూర్తయ్యే ఈ నిర్మాణాన్ని ఉద్దేశపూర్వకంగానే పెండింగ్ పెట్టారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జొన్నవాడ కూడలి వద్ద దేవరపాళెం రోడ్డుపై కొట్టుకుపోయిన కల్వర్ట్‌ను పరిశీలించి అక్కడ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జొన్నవాడ నుంచి తాడిపత్రి వరకు రోడ్డు ఆధునీకరణ, ములుమూడి కలుజులపై వంతెన నిర్మాణాలకు హామీ ఇచ్చారు.

'రాళ్లపాడు'ను మరిచారా!?

జగన్ పాదయాత్ర సందర్భంగా కలిగిరి, సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు నింపి సాగు,తాగు కష్టాలు తీరుస్తామని జగన్ ప్రకటించారు. అలాగే కలిగిరి జిర్రావారిపాళెం కాటన్ యార్డును కోల్డు స్టోరేజ్‌గా మార్చి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు అవకాశం కల్పిస్తామన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు నీటి సామర్థ్యం పెంచుతానన్నారు. కానీ వీటిలో ఒక్కటీ నెరవేర్చలేకపోయారు.





'కోవూరు షుగర్స్' గతేంటి!?

తాను అధికారంలోకి రాగానే కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న జగన్ ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే, ఫ్యాక్టరీ విక్రయానికి పెట్టడంతో రైతులు తిరగబడ టంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ఆర్టీసీ బస్టాండు నెలకొల్పాలన్న ప్రతిపాదనపైనా వ్యతిరేకత వచ్చింది.

● జిల్లాకు చేరుకున్న సీఎం జగన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర గురువారం రాత్రి జిల్లాకు చేరుకుంది. సాయంత్రం తిరుపతి జిల్లా నాయుడుపేటలో సభ అనంతరం గూడూరు మీదుగా మనుబోలు వద్ద జిల్లాలోకి యాత్ర ప్రవేశించింది. రాత్రి నెల్లూరుకు చేరుకోగా నగర శివారులో జగన్ బస చేశారు. శుక్రవారం యాత్రకు విరామం ప్రకటించారు. శనివారం ఉదయం సిద్ధం బస్సు యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది.

● పరిశ్రమల మాటేమిటి!?

సోమశిల జలాశయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఉత్తర కాలువ ఆధునీకరణ, హైలెవల్ కెనాల్ నిర్మాణం పూర్తి చేస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ హామీలు గుప్పించారు. అంతేకాదు.. ఆత్మకూరులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడికి వచ్చిన భారీ పరిశ్రమ సెంచరీ ప్లేఉడ్ బద్వేలుకు తరలించుకుపోయారు.


జిల్లా ఎస్పీగా ఆరీఫ్ హఫీజ్



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 4 : జిల్లా ఎస్పీగా కె ఆరీఫ్ హఫీజ్ గురువారం రాత్రి నెల్లూరులోని పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న డాక్టర్ కె తిరుమలేశ్వర రెడ్డిని ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఎస్పీగా బెంగుళూరుకు చెందిన ఆరీఫ్ హఫీజ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులు, అధికారుల వివరాల గురించి ఏఎస్పీలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఆరీఫ్ హఫీజ్ తొలిపోస్టింగ్ నర్సీపట్నం ఎస్పీగా 2017 డిసెంబరు నుంచి 2019 జూలై వరకు పని చేశారు. ఆ తర్వాత గుంటూరు రూరల్, అర్బన్ జిల్లాల సెబ్ ఏఎస్పీగా పనిచేశారు. 2021లో గుంటూరు అర్బన్ ఏఎస్పీగా, జిల్లాల పునర్విభజన తర్వాత గుంటూరు జిల్లా ఎస్పీగా ఈ ఏడాది జనవరి వరకు పనిచేశారు. జనవరిలో జరిగిన ఎస్పీల బదిలీల్లో ఇంటెలిజెన్స్ విభాగానికి ఆయన బదిలీ అయ్యారు.

ఇది కనిపించలేదా...!



ఈ చిత్రం మనుబోలు మండలంలోని వెంకన్నపాళెం పాత సచివాలయం. సచివాలయాల కొత్త నిర్మాణాలు జరగక ముందు ఇందులోనే సచివాలయం, ఆర్బీకే నిర్వహించారు. ఆ సమయంలో వైసీపీ రంగులు అద్దారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నా ఎన్నికల నియమావళిని అమలు చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైసీపీ రంగులు తొలగించాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.

- మనుబోలు



ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో ఆనం

ఆత్మకూరును మరింత అభివృద్ధి చేస్తాం

● ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 4 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా ఉన్న తమను ఆశీర్వదించి గెలిపిస్తే ఆత్మకూరును మరింత అభి వృద్ధి చేసి చూపుతామని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులోని రవితేజ కల్యాణ మండ పంలో జరిగిన ఉమ్మడి కూటమి ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొని ప్రసం గించారు. ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా ఆనం గతంలో రూ.105కోట్ల తో సోమశిల నుంచి తాగునీటిని తెచ్చారని గుర్తుచేశారు. రూ.1600 కోట్లతో సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణానికి సాధించడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఆనంకే దక్కుతుందన్నారు. ఆనం రామనారాయణ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి వైసీపీ పాలనలో కుంటుపడిందని అన్నారు. పదేళ్ల కిందట తాను ఆత్మకూరును విద్య, వైద్య రంగాల్లో ముందుకు తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆత్మకూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు అన్ని రంగాల్లో ఆత్మకూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పోలింగ్ నిర్వహణకు 14వేల మంది

● ర్యాండమైజేషన్ కార్యక్రమంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం); ఏప్రిల్ 4 : జిల్లాలో పోలింగ్ నిర్వహణకు 14,945 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఎన్నికలకు పోలింగ్ అధికారులను కేటాయించడానికి మొదటి విడత ర్యాండమై జేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2900 మంది పోలింగ్ అధికారులు, 2914 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, 9131 మంది ఇతర అధికారులని తెలిపారు. వారిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని చెప్పారు. కాగా, జిల్లాలో 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, సీపీఓ ఎస్.రాజు, డీఈఓ పి.రామారావు, జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల బదిలీలు

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 4 : రాష్ట్రవ్యాప్తంగా అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు నగరం ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సి.సత్యవాణి అనంతపురం జిల్లా 1వ అదనపు న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. నగరంలో కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక మహిళా కోర్టు, 8వ అదనపు జిల్లా న్యాయాధికారిగా కడప 1వ అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న టి.గీతను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి. అలాగే, నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి డాక్టర్ బి. లక్ష్మీనారాయణను కృష్ణా జిల్లా గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా పని చేస్తున్న ఐ. కరుణకుమార్‌ను నియమించారు.



ఎండుతున్న నిమ్మ.. రైతు కంట కన్నీటి చెమ్మ!

వలేటివారిపాలెం మండలంలో ఏడెనిమిదేళ్లుగా అరకొరగానే వర్షపాతం నమోదవుతోంది. దీంతో వాగులు, వంకలు, కుంటలు చెరువులలో చుక్కనీరు లేకుండా పోయింది. చెరువుల కింద ఉన్న మాగాణి భూములు బీళ్లుగా మారాయి. భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఒట్టిపోయాయి. వీటికింద నీటి లభ్యతను నమ్ముకొని సాగు చేసిన నిమ్మ, బత్తాయి, సపోట, మామిడి తదితర పండ్ల తోటలు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని చుండి, అయ్యవారిపల్లె పోలినేనిచెరువు, గరుకుపాలెం, అంకభూపాలపురం, రామంద్రాపురం, లింగపాలెం, వలేటివారిపాలెం, బంగారక్కపాలెం, అమ్మపాలెం, పోలినేనిపాలెం, జమీన్‌ఉప్పలపాడు, కొండసముద్రం, కూనిపాలెం, పోకూరు. బడేవారిపాలెం శింగమనేనిపల్లె తదితర గ్రామాలలో సుమారు బత్తాయి, నిమ్మ, మామిడి, సపోట, జామ తదితర పండ్ల తోటలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి, నిమ్మ పంటలు కాయ దశలో ఉన్నాయి. ఆ పండ్ల తోటలకు నీటి లభ్యత చాలా అవసరం. బోర్లు అడుగుంటడంతో పంటలకు నీటి తడులు అందడం ఇబ్బందిగా మారింది. నీటి తడులు అందక చాలా గ్రామాల్లో పండ్ల తోటలు ఎండుముఖం పడుతున్నాయి. వాటిని కాపాడుకోవాలన్న ఉద్దేశంతో రైతులు రూ.లక్షలు వెచ్చించి 300 అడుగుల లోతున బోర్లు వేస్తున్నారు. అయినా నీరు అందడం లేదు. కళ్లెదుటే ఎండిపోతున్న పండ్ల తోటలను చూసి రైతులు విలవిల్లాడిపోతున్నారు.

- వలేటివారిపాలెం

కార్పొరేషన్‌లో పర్సంటేజీల పందేరం

ఇంజనీరింగ్‌లో లంచం సొమ్ముకు కోడింగ్

రూ.లక్షకు రూపాయి!

"ఏం రాజయ్య (పేరు మార్పు) మీ సీసీరోడ్డు పూర్తయినట్టుంది. బిల్లు నా దగ్గరకి వచ్చింది. సీఎఫ్ఎంఎస్‌కు పంపాను. నేడో, రేపో నీ ఖాతాలో జమైపోతుందులే. మిగిలిన వారివి కూడా వారి ఖాతాల్లో పడిపోయాయి. నీ బిల్లు రూ.50 లక్షలు కదా. నేను మనిషిని పంపిస్తా.. రెండు రూపాయలు (రూ.2 లక్షలు) పంపు.

- కాంట్రాక్టర్‌తో ఓ ఇంజనీరు

కొత్త కోడింగ్ విధానంలో లంచం డిమాండ్



నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో ఇదీ సంగతి. సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైన నాటినుంచి నెల్లూరులోని పనులు చేసిన కాంట్రాక్టర్లకు వేగంగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఇందుకు తామే కారణమంటూ ఇంజనీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు పర్సంటేజీల వసూళ్లకు పదును పెట్టారు. రూ.లక్షకు రూపాయి కోడింగ్ విధానం అమలు చేస్తున్న మరికొందరు అధికారులు రూ.వేలకు పైసలు చొప్పున లంచం సొమ్మును దండుకుంటున్నారు. నగర పరిధిలో సీసీరోడ్లు కల్వర్టులు, ప్యాచ్ వర్కులు కాంట్రాక్టర్లకు పంచి పెట్టిన వైసీపీ నేతలు వారి పర్సెంటేజీలు ముందుగానే తీసేసుకోవడంతో పనులు పూర్తి చేసిన వారికి కార్పొరేషన్ ఖజానాలోని సొమ్ములతోపాటు ప్రభుత్వం ప్రత్యేక నిధిని కూడా సమకూర్చింది. తామే దగ్గరుండి బిల్లులు చేయిస్తున్నామంటూ ఇంజనీరింగ్ అధికారులు క్రెడిట్‌ను నెత్తినేసుకుని అందులో పర్సంటేజీలు దండేస్తున్నారు.

● రూ.లక్షకు 17 శాతం వసూళ్లు

నగరంలోని 54 డివిజన్లలో సాధారణ నిధులు రూ.20 కోట్లతోపాటు 15వ ఆర్థిక సంఘం రూ.50 కోట్లు, జీజీఎంపీ నిధులు సుమారు రూ.99.60 కోట్లు, ఎంపీ నిధులు రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, రోడ్డు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. వీటిల్లో ముప్పాతిక శాతం వరకు పూర్తయ్యాయి. అందులో సగం వరకు బిల్లులు మంజూరు కాగ పాతిక శాతం బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయ్యాయి. సాధారణంగా ఇంజనీరింగ్ విభాగంలో రూ.లక్షకు 12 - 15 శాతం వరకు పర్సంటేజీ డిమాండ్ చేసి వసూళ్లు చేస్తున్న అధికారులు తాజాగా ఆ లెక్కను 17 శాతానికి పెంచారు. క్షేత్రస్థాయిలోని వర్క్ఇన్‌స్పెక్టర్ నుంచి ఇంజనీరింగ్‌లోని ఉన్నత స్థాయి అధికారి వరకు ఈ పర్సంటేజీని వసూళ్లు చేస్తున్నారు. కాంట్రాక్టర్ వద్ద ఏఈఈలు వసూళ్లు చేసి అన్ని కేటగిరీలకు పంచిపెడుతున్నట్లు సమాచారం.

● నాణ్యత పట్టింపేది!?

కార్పొరేషన్ పరిధిలోని నిర్మాణ పనులకు బిల్లుల చెల్లింపు వ్యవహారం సందట్లో సడేమియా అన్నట్టుంది. సార్వత్రిక ఎన్నికల పోరులో రాజకీయ పార్టీలు మునిగి తేలడంతో వారి జోలికి ఎవరు రారన్నట్టుగా యవ్వారం నడుస్తోంది. ఇదే క్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం కూడా తూతూ మంత్రంగా పనులను పరీక్షిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారికి ప్రత్యేక పర్సంటేజీలు ఉండటంతో నాణ్యతను పెద్దగా గుర్తించే పనిలేకుండా కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకు నివేదిక తయారు చేసి ఇచ్చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం జరిగిన, జరుగుతున్న పనులపై కమిషనర్ పూర్తి స్థాయిలో నాణ్యతను పరీక్షిస్తే అనేక లోపాలు బహిర్గతమవుతాయని పలువురు కోరుతున్నారు.

- నెల్లూరు(సిటీ)

వైసీపీకి ఒక్కచాన్స్ ఇస్తే రాష్ట్రం నిలువు దోపిడీ



సంగం: వేమిరెడ్డి, ఆనంను గజ పూలమాలతో సత్కరిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



ఆత్మకూరులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

● ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి
● ప్రజాగళంలో వైసీపీపై టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆనం, వేమిరెడ్డి తీవ్ర విమర్శలు

సంగం, ఏప్రిల్ 4: ఐదేళ్ల కిందట ఒక్కచాన్స్ అని వైసీపీ నాయకులు అడగడంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని నిలువునా దోచేశారని ఆత్మకూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం సంగం ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో రాష్ట్రంలో దోపిడీ, విధ్వంసం తప్పా అభివృద్ధి జరుగలేదన్నారు. సంగం, పెరమన మధ్య ఉన్న కొండలు, గుట్టలు మింగేశారని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు ప్రశాంతంగా బతకాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను చేసిన అభివృద్ధి చూసి టీడీపీ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి వీపీఆర్ మాట్లాడారు.

బైక్ ర్యాలీతో కిక్కిరిసిన ముంబాయి రోడ్డు

ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేసిన ఆనం రామనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సంగంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. కావలి కాలువ నుంచి సంగం కెనరా బ్యాంకు వరకు జరిగిన బైక్ ర్యాలీలో ముంబాయి జాతీయ రహదారి జనంతో కిక్కిరిసింది.

భారీ చేరికలతో వైసీపీ ఖాళీ..

ప్రజాగళం సభలో వైసీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆ పార్టీని వీడి పెద్దఎత్తున టీడీపీలో చేరారు. సంగం సర్పంచు నిమ్మల రమణమ్మ, జంగాలకండ్రిక సర్పంచు సునీల్, వెంగారెడ్డిపాలెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, పడమటిపాళెం సర్పంచు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, సిద్ధీపురం సర్పంచు ప్రసూన్న, పెరమన సర్పంచ్ రమణమ్మ, వైసీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ గంగపట్న చంద్రశేఖరయ్య, కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య, మక్తాపురం మోహన్‌రెడ్డి, అల్లూరు శ్రీధర్‌రెడ్డి అనిల్ కుమార్‌రెడ్డిలు వైసీపీ వీడి టీడీపీ తీర్థపుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఆనం రామనారాయణరెడ్డి పార్టీ కండువాలతో ఆహ్వానించారు.

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కూటమి నాయకులు సమన్వయంతో ముందు కెళ్లాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రవితేజ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి కూటమి ఆత్మీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించుకుంటే ఆత్మ కూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలోని 30 కుటుంబాలకు చెందిన వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. గ్రామంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఏన్‌ఆర్‌ఐ అక్కులరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కల్లూరు భాస్కర్‌రెడ్డి, అక్కల రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చల్లా మోహన్‌రెడ్డి, ధనిరెడ్డి ఈశ్వర్ రెడ్డి, పాలగిరి ఇంద్రసేనారెడ్డితో పాటు మరి కొన్ని కుటుంబాలు ఉన్నాయి.

ఉదయగిరి అభివృద్ధిని చేసి చూపిస్తా..

● మేనిఫెస్టోలోని ప్రతిహామీ నెరవేరుస్తా
● గ్రామాల్లో జోరుగా కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం



కాకర్ల సురేష్‌కు సమస్యలు చెబుతున్న మహిళలు

సీతారామపురం, ఏప్రిల్ 4: నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ గురువారం చిన్ననాగంపల్లి నుంచి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చింతల శ్రీనువాసులు, మం డల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, చేన్నకేశవులు, జనసేన నియోజకవర్గ నాయకులు బోగినేని కాశిరావు ఆధ్వర్యంలో నాయకులు చిన్ననాగంపల్లి వద్ద కాకర్ల సురేష్‌కు ఘనస్వాగతం పలికారు. తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఇంటింటి ప్రచారానికి వెళ్తున్న ఆయన ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు వింటూ పరిష్కార మార్గాలు చెబుతూ జననీరాజనాలు అందుకున్నారు. మండలంలో మంచినీటి సమస్య, ప్రతివీధికి సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు ఇస్తామన్నారు. అన్నదాత పథకం కింద రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తామన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామన్నారు. 18 నుంచి 59ఏళ్ల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం 50ఏళ్ల పైబడిన బీసీలకు రూ.4వేల పింఛన్ అందజేస్తుందన్నారు. వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతు పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, ప్రతినెలా 1వ తేదీన ఇంటి వద్దనే పింఛను అందజేస్తామన్నారు. మహిళలకు కలలకు రెక్కలు పథకం కింద వడ్డీ లేని రుణాలను అందజేస్తామన్నారు. జగన్‌మో హన్‌రెడ్డిపై చేస్తున్న ఈ పోరాటంలో మనతో కలిసి వచ్చే ప్రజల గొంతుకే ప్రజాగళమన్నారు. ఉదయగిరి శాసనసభ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, జాషువా, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, ఆదినారాయణ చంద్రారెడ్డి, పెద్దగౌస్, తోట మనోజ్‌బాబు, పిడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

● ఉదయగిరి అభ్యర్థి సోము



ఉదయగిరి రూరల్, ఏప్రిల్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సోము అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రతి గ్రామం లో ప్రత్యేక ఓటు బ్యాంకు ఉందని, గ్రామస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యక ర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని విడిగొట్టేందుకు లేఖ ఇచ్చిన చంద్రబాబు, కేంద్రం మెడలు వచ్చి ప్రత్యేక హోదా తీసుకొస్తానన్న జగన్ ఇద్దరూ కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అయ్యారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో తాను ఉదయగిరి కోటపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్రచౌదరి, విజయ్, బాబురావు, కాలేషా పాల్గొన్నారు.

మజ్జిగ, మంచినీరు పంపిణీ

వింజమూరు, ఏప్రిల్ 4: పట్టణంలోని సచివాలయాల్లో గురువారం పింఛనుదారులకు తెలుగుదేశం మండల నాయకులు మజ్జిగ, మంచినీటిని అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గొంగటి రఘు నాథరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులపై కక్ష సాధింపు చర్యగా పింఛన్‌దారులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది ఉన్నా కూడా ఇంటి వద్దకు పింఛను పంపిణీ చేయ కపోవడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వీఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వర రావు, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, చల్లా వెంక టేశ్వర్లు, సుబ్బారెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



కురుగొండ్ల సమక్షంలో టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన తోపుగుంట గ్రామస్థులు

కలువాయి, ఏప్రిల్ 4: వెంకటగిరి మాజీ ఎమ్మె ల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో గురువారం తోపుగుంట వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. నాపా నావూరయ్య, మాధవ్ నాయుడు ఆధ్వర్యంలో 30కుటుంబాలు తెలుగుదేశంలో చేరారు. వీరందరికీ కురుగొండ్ల టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మం డలాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, పీర్ల సోమ య్య యాదవ్ ఉన్నారు.

నేడు పింఛనుదారుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 4 : నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో గల పెన్షన్‌భవన్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, కార్య దర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు అంశా లపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కార్య వర్గం, మండల, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, ఆఫీసు బేరర్స్, టెక్నికల్ సభ్యులు గౌరవసలహాదారులు అందరూ హాజరుకావాలని కోరారు.

చలివేంద్రాల ప్రారంభం



సంగం: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు రమాదేవి

సంగం, ఏప్రిల్ 4: వేసవిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దారు రమాదేవి స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ మంచినీటి కుండలు ఏర్పాటు చేయించారు. ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి దృష్ట్యా కార్యాలయానికి వచ్చే రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి నెప్రహాబాబు పాల్గొన్నారు.

దాసరిపల్లిలో ఇఫ్తార్ విందు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 4: పవిత్ర రంజాన్ మాసాన్ని పురష్కరించుకొని దాసరిపల్లి గ్రామంలో మాజీ సర్పంచు సయ్యద్ జమృత్ జాఫర్‌మొహిద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలు వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చంచలబాబుయాదవ్, మాజీ ఎంపీపీలు చేజర్ల సుబ్బారెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు నాయకులు కాకర్ల సునీల్, బయన్న, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, సయ్యద్ నవాజ్, శివకృష్ణ పాల్గొన్నారు.

మూడుసార్లు వాటర్‌బెల్ కొట్టాలి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 4: వేసవి దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలో రోజుకు మూడుసార్లు వాటర్‌బెల్ కొట్టాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉదయం 8:45, 10:05, మధ్యాహ్నం 11.50 గంటలకు వాటర్‌బెల్ కొట్టాలన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

వింజమూరు, ఏప్రిల్ 4 : పట్టణంలోని గ్రంథాలయం సెంటర్‌లో గురువారం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కంభం బాలకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, రేవునూరి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: ఈ ఎన్నికల్లో కష్టపడిన వారికే నాయకులుగా, కార్యకర్తలుగా ఎమ్మెల్యే గుర్తించనున్నారని వైసీపీ మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, మోహన్‌రెడ్డి తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ మాధవ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

నిదరోతున్న నిఘా నేత్రం



పనిచేయని సీసీ కెమెరా

వలేటివారిపాలెం, ఏప్రిల్ 4: ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ పోలీసు అధికారులు తరచూ చెబుతుంటారు. దీన్ని బట్టి చూస్తూ సీసీ కెమెరాకు ఎంత ప్రాధాన్యం ఉందో తెలుస్తోంది. అలాంటి సీసీ కెమెరాలు మండలంలోని కూనిపాలెం, చుండి, వలేటివారిపాలెం, పోకూరు గ్రామాల్లో రెండేళ్ల నుంచి పనిచేయడంలేదు. అయినా వీటి మరమ్మతులను పోలీసులు పట్టించుకోవడంలేదు. రెండేళ్ల క్రితం వలేటివారిపాలెంలో పోలీసులు ప్రజాప్రతినిధులు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని రోజులు బాగానే పనిచేశాయి. అనంతరం మరమ్మతులకు గురయ్యాయి. ఇవి పనిచేయకపోవడంతో గొర్రెలు, పొట్టేళ్లను దుండగులు అపహరించుకపోతున్నారు బస్టాండు సెంటరులోని దుకాణాలు తాళాలను దుండగులు పగులగొడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తానని ఎస్ఐ బాలమహేంద్రనాయక్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ముసునూరుకు సకల సౌకర్యాలు కల్పిస్తా : కావ్య



టీడీపీలో చేరుతున్న నాగులవరం మాజీ సర్పంచి



అల్లూరులో బీద గిరిధర్ ప్రచారం

కావలి, ఏప్రిల్4: సమస్యల నిలయంగా ఉన్న కావలి ముసునూరుకు సకల సౌకర్యాలు కల్పిస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తె లిపారు. ముసునూరులోని 14వ వార్డులో గురువారం ఆయన జనసేన ఇన్ చార్జి అళహరి సుధాకర్, ఆలా శ్రీనాథ్, బీజేపీ నేత మందా కిరణ్‌లతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటికి పరిష్కార మార్గం చూపిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, ఉప్పు వెంకటస్వామి, రవినూతల వెంకటేశ్వర్లు, లింగాల మాల్యాద్రి పాల్గొన్నారు.

● **విష్ణు అనుచరులు టీడీపీలో చేరిక**

మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు, బోగోలు మండలం నాగులవరం మాజీ సర్పంచి గణేశం రమేష్ రెడ్డితో పాటు మండలానికి చెందిన మాధవి, ప్రవీణ్, వంశీ, గణేష్ తదితరులు కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలనుకప్పి కావ్య సాదరంగా ఆహ్వానించారు.

● **ప్రతాప్‌ను ఇంటికి పంపుదాం..**

కావలి రూరల్: రుద్రకోట కొండను తొలిచిన కాలకేయుడు వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలో గురువారం రాత్రి జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అరుంధతీయవాడ, ఎస్టీకాలనీ, వడ్డిపా లెం, గుమ్మడిబొందల ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అళహరి సు ధాకర్, సిద్దు, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబునాయుడు, ఆవుల రామక్రిష్ణ, తుళ్లూరు మల్లికార్జున్, పేరం రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

● **ఏనుగులబావిలో టీడీపీ ప్రచారం**

బిట్రగుంట : బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీలో గురువారం రాత్రి మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రె డ్డి, కావలి అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. కార్యక్రమంలో దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి, పంది శ్రీనివాసులు, ఒంటేరు ప్రసన్న, బడుగు వెంకయ్య, యల్లమ్మ, జంపాని ప్రసాద్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

● **గెలిపిస్తే.. అభివృద్ధి ఏమిటో చూపిస్తాం...**

అల్లూరు : టీడీపీని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు దళితవాడల్లో గురువారం సాయంత్రం కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చరణ్‌రెడ్డిలతో కలసి ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సూరిజ్యోతి, అనూరాధ, కావలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తు

ఉదయగిరి, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో 43సమస్యాత్మక గ్రామా లను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 323 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. అత్యధికంగా కలిగిరిలో 53కేంద్రాలు ఉండగా అత్యల్పంగా సీతారామపురం మండలంలో 25 ఉన్నట్లు పేర్కొన్నారు.

రంగస్థల నటుడు కోటేశ్వరరావు కన్నుమూత



కోటేశ్వరరావు (ఫైల్)

కందుకూరు : ప్రముఖ రంగస్థల నటుడు కేవీ కోటేశ్వరరావు (82) గురువారం కన్నుమూశారు. పౌరాణిక నాటకాల్లో తన కంచుకంఠంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కోటేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కందుకూరులోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. హరిశ్చంద్ర కాటిసీనులో కేవీ కోటేశ్వరరావు అభినయం, ఆయన కంచుకంఠంతో పాడే పద్యాలు కళాకారుల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, చింతామణి తదితర నాటకాలలో నటించి ఆయన గుర్తింపుపొందారు. కోటేశ్వరరావు మృతిపట్ల పలువురు కళాకారులు, కళాభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గుడ్లూరు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ఈ సంఘటన, మండలంలోని పరకొండపాడులో చోటుచేసుకుంది. మన్నేరు నుంచి గురువారం తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందగా, పోలీసులు అక్కడి వెళ్లి ట్రాక్టర్లను, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కందుకూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై వేటు

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీ కార్యదర్శి కేఎస్ చక్రవర్తిపై పలు అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషన్ ఆయన్ను సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యదర్శిపై స్థానికులు అవినీతి ఆరోపణలు చేస్తూ, ఆధారాలతో పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయమై ఎంపీడీవో విజయను వివరణ కోరగా ఫిర్యాదుదారుడు సస్పెన్స్ కాపీని అందించాడని తెలిపారు.

వాహనాల్లో రూ. 5లక్షల పట్టివేత

ఉలవపాడు : ఉలవపాడు జాతీయ రహదారిపై మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం సిబ్బంది వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా రూ. 5లక్షలు పట్టుబడినట్లుగా ఎస్సై బాజిరెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న కారులో ఎస్కే సైదా వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని చాకిచర్ల, పెదపట్టపుపాలెం, రామాయపట్నం గ్రామాల్లో కేంద్రబలగాలతో ఎస్సై కవాతు నిర్వహించారు.

బీటెక్ విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగావకాశాలు

బిట్రగుంట : బీటెక్ విద్యార్థులకు దేశవిదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని వీఎస్‌యూ వీసీ జీఎం.సుందరవల్లి, హైదరాబాద్ చెందిన ది బ్లాక్ బగ్స్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో తోట అనురాధలు తెలిపారు. బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం రాత్రి జరిగిన వార్షికోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఓవరాల్ అకడమిక్ సెమిస్టర్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపాల్ వీ వీఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గెస్ట్ ఆఫ్ ఆనర్స్‌గా డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌రెడ్డి ఆర్వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టు వద్ద తనిఖీల పరిశీలన

కావలి, ఏప్రిల్4: పట్టణ ముసునూరు టోల్‌గేట్ వద్ద హైవేపై వెళుతున్న వాహనాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును గురువారం కావలి ఆర్వో శీనానాయక్ పరిశీలించారు. అక్కడ వాహనాల తనిఖీలు ఎలా నిర్వహిస్తున్నారు. ఎలాంటి వాహనాలను ఆపుతున్నారు. వాటిలో ఎక్కడెక్కడ తనిఖీలు చేస్తున్నారో పరిశీలించారు. ఈ తనిఖీలలో నగదు, మద్యం ఎక్కడా లభించలేదని ఆయన తెలిపారు.

ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య



కరపత్రాలు పంపిణీచేస్తున్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 4: పట్టణంలోని 30వ వార్డు నాంచారమ్మ కాలనీ, కోర్టు వెనుక వైపు ప్రాంతాల్లో కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, ముచ్చు లక్ష్మీరాజ్యం, నవిడిబోయిన వెంకటకృష్ణ, పసుపులేటి రమణయ్య, భోగిశెట్టి మోహనరావు, నీలిశెట్టి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **తెలుగు మహిళల ప్రచారం**

జలదంకి : మండలంలోని కమ్మవారిపాలెంలో గురువారం సాయంత్రం టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు ఓట్లేసి గెలిపించాలంటూ తెలుగు మహిళలు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రచారంలో నేతలు వంటేరు పద్మావతి, కాకర్ల తల్లిదండ్రులు వెంకటసుబ్బానాయుడు, ప్రమీలమ్మ, అత్తమామలు కడియాల వెంకటేశ్వర్లు, పద్మావతి, పీ మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న దామా అంకయ్య తదితరులు

కావలి, మార్చి4: పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయటం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికలప్పుడు వైసీపీ ప్రభుత్వం అలజడులు సృష్టించేందుకు కోడికత్తి, వివేకానందరెడ్డి హత్య కేసుల డ్రామా ఆడిందన్నారు.ఇప్పుడు పింఛన్ల పంపిణీలో ప్రతిపక్షాలపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తున్నదన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాజకీయాలు చేయకుండా పనిచేస్తే వలంటీర్లకు సీపీఐ అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే పింఛను



దివ్యాంగుడికి ఇంటివద్దే పింఛన్ అందచేస్తున్న మున్సిపల్ కమిషనర్, టీపీఎస్ తదితరులు

కావలి, ఏప్రిల్4: సచివాలయాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే పింఛన్లు అందచేశామని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పింఛన్ల పంపిణీకి సచివాలయాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేశారు ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా ? అనే విషయాలను గురువారం ఆయన పరిశీలించారు. కచ్చేరి మిట్టలోని 18వ సచివాలయం పరిధిలో ఓ దివ్యాంగుడి ఇంటికి వెళ్లి కమిషనరే పింఛను అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికాధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

● **90 శాతం పింఛన్ల అందజేత**

లింగసముద్రం: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 90 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో యు శేషబాబు చెప్పారు. మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, వీఆర్ కోట, మొగిలిచెర్ల గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన వీఆర్ కోట సచివాలయంలో కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. బయటి ప్రాంతాలు, ఇతర పట్టణాల్లో ఉంటున్న వారికి సమాచారం అందజేశామని, వారికి ఈ రెండు రోజుల్లో నగదు అందజేస్తామన్నారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ

అల్లూరు : సచివాలయాలకు వచ్చిన లబ్ధిదారులకు గురువారం సాయంత్రం వరకు పింఛన్లు అందజేయగా, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి అధికారులు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందచేశారు. ఎండకు వచ్చే లబ్ధిదారుల కోసం తాగునీరు, షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎట్టకేలకు మండలంలో అధికారులు పింఛన్ల పంపిణీని పూర్తి చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

కలిగిరి : ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన కేంద్రబలగాలతో కలిసి కలిగిరి, పెద్ద అన్నలూరు, కృష్ణారెడ్డిపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా మని ఆయన తెలిపారు.

వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విష్ణు

అల్లూరు : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం సీఎం జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. అల్లూరులోని తన నివాసం నుంచి ఆయన అభిమానులతో కలసి వెళ్లి రేణిగుంట వద్ద పర్యటనలో ఉన్న జగన్మోహన్‌రెడ్డిని కలుసుకొని పార్టీలో చేరారు.